www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 301
శనివారం | 15-2-2025

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 11.53 తదుపరి చవితి; నక్షత్రం: ఉత్తర రా. 1.39 తదుపరి హస్త; వర్జ్యం: ఉ. 7.06-8.52; దుర్ముహూర్తం: ఉ. 6.45-8.17; అమృతఘడియలు: సా. 5.42-7.28; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.45; సూర్యాస్తమయం: 6.13

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


వైట్ హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ

# తగ్గేదే లే..!

## అమెరికా ఉత్పత్తులపై భారత్ ఎంత సుంకం విధిస్తుందో మేమూ అంతే వేస్తాం

- ప్రధాని మోదీ సమక్షంలో తేల్చిచెప్పిన ట్రంప్
- అమెరికా అధ్యక్షుడితో సమావేశమైన ప్రధాని మోదీ
- వాణిజ్యం, రక్షణ సహా పలు అంశాలపై విస్తృత చర్చ
- భారత్‌కు ఎఫ్-35లు ఇచ్చేందుకు సిద్ధమన్న ట్రంప్
- 26/11 దాడి కేసు నిందితుడు తహవుర్ రాణాను భారత్‌కు తక్షణమే అప్పగించనున్నట్టు ప్రకటన
- 2030 నాటికి రెండు దేశాల మధ్య 500 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యంగా మిషన్ 500 ప్రకటన
- అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను వెనక్కి తీసుకోవడానికి సిద్ధం: ట్రంప్‌తో మోదీ
- 119 మందితో నేడు అమృత్‌సర్‌కు మరో విమానం
- ఆదివారం మరో విమానం వచ్చే అవకాశం
- హెచ్-1బీ పునరుద్ధరణలో మరింత జాప్యం
- డ్రాప్‌బాక్స్ అర్హత 12 నెలలకు కుదింపు
- భారతీయ దరఖాస్తుదారులపైనే తీవ్ర ప్రభావం

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: భారత ప్రధాని నరేంద్ర మోదీని గొప్ప మిత్రుడిగా అభివర్ణించినా.. ఆత్మీయ ఆలింగనాలు, సుదీర్ఘ కరచాలనాలతో ఆహ్వానించినా.. సుంకాల విషయంలో మాత్రం తగ్గేదే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పేశారు! 'కంటికి కన్ను.. పంటికి పన్ను' అన్న సామెత చందంగా.. తమ దేశ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధించే దేశాలపై తామూ అధిక పన్నులు విధిస్తామని స్పష్టం చేశారు. "అది ఇండియా కానివ్వండి, మరే దేశమైనా కానివ్వండి.. మా ఉత్పత్తులపై తక్కువ సుంకాలు విధిస్తే మేమూ అలాగే విధిస్తాం. భారత్ ఎలా వసూలు చేస్తే.. మేమూ అలాగే వసూలు చేస్తాం" అని సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ సాక్షిగా.. ఆయన పక్కనే నిలబడి.. సంయుక్త పత్రికా సమావేశంలో ఎలాంటి శషభిషలూ లేకుండా నిర్మొహమాటంగా ప్రకటించారు. తనకన్నా మోదీనే మెరుగైన బేరగాడని వ్యాఖ్యానించారు. త్వరలోనే భారీ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు రెండు దేశాలూ ఎదురుచూస్తున్నాయన్న ట్రంప్.. అమెరికాకు చెందిన కొన్ని ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న సుంకాలు అన్యాయంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. కాకపోతే.. భారతదేశంతో పోలిస్తే చైనా, యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య సంబంధాలు చాలా క్లిష్టంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో తన తొలి హయాంలో జరిపిన చర్చల వల్ల సుంకాలు తగ్గలేదని.. అందుకే ఈసారి పరస్పర సుంకాల విధానాన్ని అనుసరించాలని నిర్ణయించినట్టు తెలిపారు. మోదీతో భేటీ కావడానికి కొన్ని గంటల ముందు ఆయన ఈ పరస్పర సుంకాలకు సంబంధించిన ఉత్తర్వుపై సంతకం చేశారు. ఆ సమయానికే.. స్పేస్‌ఎక్స్ చీఫ్ మస్క్ ప్రధాని మోదీతో భేటీ అయిన నేపథ్యంలో విలేకరులు ట్రంప్‌ను మస్క్-మోదీ భేటీ గురించి అడిగారు. అప్పుడు కూడా ట్రంప్ భారత్ అధిక సుంకాల గురించి ప్రస్తావించడం గమనార్హం. ఆ తర్వాత కొన్నిగంటలకు (భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో) ప్రధాని మోదీ శ్వేత సౌధానికి చేరుకుని ట్రంప్‌ను కలిశారు. తన చిరకాల మిత్రుడైన మోదీకి ట్రంప్ ఆత్మీయ స్వాగతం పలికారు. సుదీర్ఘ కరచాలనం.. గాఢ ఆలింగనంతో ఓవల్ ఆఫీసులోకి తీసుకెళ్లారు. మోదీని గొప్ప స్నేహితుడిగా, అద్భుతమైన వ్యక్తిగా అభివర్ణిస్తూ.. తన సిబ్బందికి పరిచయం చేశారు. మళ్లీ మోదీవైపు తిరిగి.. "మేం మిమ్మల్ని మిస్ అయ్యాం.. చాలా మిస్ అయ్యాం" అన్నారు. మోదీ కూడా.. ట్రంప్‌ను మళ్లీ కలిసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా



మిగతా 12వ పేజీలో...



### మనది మెగా భాగస్వామ్యం

ప్రెసిడెంట్ ట్రంప్ ఎప్పుడూ మాగా (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) గురించి మాట్లాడుతుంటారు. మేం మా దేశంలో 'వికసిత్ భారత్' లక్ష్యంతో పనిచేస్తున్నాం. దాన్ని.. 'మేక్ ఇండియా గ్రేట్ ఎగైన్' అనొచ్చు. రెండూ (మాగా+మిగా) కలిస్తే.. అది సౌభాగ్యానికి మెగా భాగస్వామ్యం అవుతుంది.

- ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్



### బేరాల్లో నాకంటే మోదీనే బెటర్

'మీ ఇద్దరిలో బాగా బేరసారాలు చేయగలిగేది ఎవరు?' అని విలేకరులు అడిగిన ప్రశ్నకు.. ఆ విషయంలో మోదీనే తనకంటే చాలా మెరుగని, ఆయనకు అసలు పోటీయే లేదని ట్రంప్ చెప్పారు.

## ఎఫ్-35 డీల్.. జరిగే పనేనా?

- మన రష్యన్ క్షిపణి వ్యవస్థ ఓ అడ్డంకి
- సొంత తయారీకే భారత్ మొగ్గు?
- ట్రంప్‌ది ప్రతిపాదన మాత్రమేనన్న భారత విదేశాంగ కార్యదర్శి

### పరస్పర పన్నుతో నష్టమే!

- అమెరికా-భారత్ వాణిజ్యంలో ఇప్పటి వరకూ భారత్‌దే పైచేయి
- ఎగుమతులెక్కువ, దిగుమతులు తక్కువ
- అమెరికా కంటే మన సుంకాలు అధికం
- పరస్పర పన్నుతో పరిస్థితి మారే చాన్స్
- ఆటోమొబైల్స్, ఇంధనం, రక్షణ రంగాలపై తీవ్ర ప్రభావం

### అదానీ అంశం వ్యక్తిగతం

- ట్రంప్‌తో చర్చించే విషయం కాదది
- అమెరికాలో మీడియాతో ప్రధాని

సమగ్ర కథనాలు ...12,13లో

### ఈసారి సెగలే!
ఈ వేసవిలో పాత రికార్డులు తిరగరాసే అవకాశం 14
ఉత్తరాదిలో 50 డిగ్రీలు దాటొచ్చు
మార్చి 15 తరువాత మరింత వేడి

### యాసిడ్ పోసి.. కత్తితో పొడిచి..
ప్రేమించలేదని ప్రేమికుల రోజున యువతిపై ఉన్మాది ఘాతుకం
ప్రాణాపాయ స్థితిలో యువతి.. బెంగళూరుకు తరలింపు 2
అన్నమయ్య జిల్లాలో దారుణం

సరఫరా చేసే సామర్థ్యం లేకున్నా..
### నెయ్యి టెండర్లలో ఎలా పాల్గొన్నారు?
మార్కెట్ ధర కంటే తక్కువకు ఎందుకు కోట్ చేశారు?
నేతలు, సిబ్బంది పాత్ర ఏమిటి?
కల్తీ నెయ్యి నిందితులపై సిట్ ప్రశ్నల వర్షం 9

### 'మెహర్బానీ' టెండర్లు రద్దు
'ఆంధ్రజ్యోతి' కథనంపై సీఎంవో ఆరా 2

### వణికిస్తున్న జీబీఎస్..! 14

### విజయవాడలో క్యాట్ సర్క్యూట్ బెంచ్ 14



శుక్రవారం తెల్లవారుజామున మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని విజయవాడలోని జిల్లా జైలుకు తరలిస్తున్న పోలీసులు



### కోర్టులో తిట్లు..

# జైల్లో చిందులు

- ఆ బ్యారక్‌లో ఉండను
- ఈ టాయిలెట్ వాడను
- జైలులో అధికారులపై వంశీ వీరంగం
- నడుం నొప్పి ఉందంటూ మంచం కోసం పట్టు
- అక్కర్లేదన్న వైద్యులు

విజయవాడ, విశాఖపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా కారాగారంలోకి అర్ధరాత్రి అడుగుపెట్టిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, అక్కడి అధికారులపై సదుపాయాలు, సౌకర్యాల కోసం చిందులు తొక్కారు. తనకు కేటాయించిన బ్యారక్‌లోని గది విషయంలో పేచీ పెట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణా జిల్లాలోని గన్నవరం టీడీపీ కార్యాలయంపై వంశీ అనుచరుల దాడికి ప్రత్యక్ష సాక్షి, ఫిర్యాదుదారు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన వ్యవహారం సహా పలు అభియోగాలపై గురువారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో వంశీని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయనకు కోర్టు రిమాండ్ విధించడంతో విజయవాడ

మిగతా 11వ పేజీలో...

**మట్టికొట్టుకు పోతారు**
- న్యాయాధికారి వింటుండగానే వంశీ నోటి దురుసు
- తనపై కేసు పెట్టిన, పెట్టించిన వారికి శాపనార్థాలు

# తప్పుచేసి ఎదురుదాడి!

## వైసీపీ నేర మనస్తత్వానికి నిదర్శనం

- రాజకీయాల ముసుగులో నేరగాళ్లు
- ప్రాణాలు తీయడానికీ వెనుకాడరు
- ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం
- రాష్ట్రాభివృద్ధికీ విఘాతం కలిగిస్తుంది
- ఆటవిక పాలన పునరావృతం కారాదు
- తప్పు చేస్తే చట్టం కఠినంగా వ్యవహరిస్తుందనే సంకేతాలు పంపాలి
- లేదంటే మరింత బరితెగిస్తారు
- టీడీపీ నేతలతో సీఎం చంద్రబాబు

గత ఐదేళ్లూ జంగిల్‌రాజ్ నడిచింది. గంజాయి, డ్రగ్స్, దోపిడీలు, భూదందాలు యథేచ్ఛగా సాగాయి. ఆ కారణంగా రాష్ట్రం ఎంత వెనుకబడిందో మనందరికీ తెలుసు. ఇకపై అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉంది.

- సీఎం చంద్రబాబు


బీసీ సంక్షేమంపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి సవిత

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'తప్పు చేసి దానిని కప్పిపుచ్చుకునేందుకు ఓ దళిత యువకుడిని కిడ్నాప్ చేసి మరో తప్పు చేశారు. పక్కా ఆధారాలతో దొరికిపోయినా తిరిగి మనపైనే ఎదురుదాడి చేస్తున్నారంటే వారు ఎలాంటి నేరమనస్తత్వం ఉన్నవారో అర్థమవుతోంది. ఇలాంటి నేరగాళ్లు రాజకీయ నాయకుల ముసుగులో ఉండడం ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజల నుంచి వినతులు

మిగతా 11వ పేజీలో...

### బీసీలను హత్యచేసిన వారికి శిక్ష పడాలి 2
- విచారణ వేగవంతం చేయండి
- సబ్‌కమిటీ నివేదిక రాగానే బీసీ రక్షణ చట్టం
- చంద్రబాబు ఆదేశాలు

# బీసీ విద్యార్థుల డైట్ చార్జీలు చెల్లించాలి

- దామాషా ప్రకారం కార్పొరేషన్లకు నిధులు
- వైసీపీ హయాంలోని బకాయిల విడుదలకు అనుమతి
- కుప్పంలోనూ బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్
- బీసీ సంక్షేమశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థుల కోసం ప్రభుత్వం తీసుకునే కార్యక్రమాలతో స్పష్టమైన మార్పులు తీసుకురావాలని, ప్రభుత్వం చేసే ఖర్చుకు జవాబుదారీతనం కనిపించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో బీసీ సంక్షేమశాఖపై సమీక్ష చేశారు. రాష్ట్రంలోని 660 ప్రభుత్వ హాస్టళ్లలో రూ.13.10 కోట్లతో చేపట్టిన మరమ్మతులు మరో 6 వారాల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గత ప్రభుత్వం ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, కిచెన్ ఐటమ్స్ అందించలేదని, రూ.18 కోట్లతో వాటి పంపిణీకి చర్యలు తీసుకున్నామని అధికారులు వివరించగా, ఈ ప్రక్రియ కూడా మార్చి మూడో వారం నాటికి పూర్తవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ట్యూటర్ల గౌరవవేతనాలకు సంబంధించి 485 హాస్టళ్లలో 2024 మార్చి వరకు గత ప్రభుత్వం పెట్టిన రూ.2.02 కోట్ల బకాయిలు, ఈ ఏడాది ఫిబ్రవరి వరకు చెల్లించాల్సి ఉన్న రూ.2.33 కోట్ల బకాయిలు మొత్తం కలిపి రూ.4.35 కోట్లు చెల్లించాల్సిన ఉందని అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా, చెల్లించేందుకు అనుమతి ఇచ్చారు. డైట్ చార్జీలకు సంబంధించి రూ.185.27 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు వివరించగా ప్రస్తుతం రూ.110.52 కోట్ల చెల్లింపునకు సీఎం అంగీకారం తెలిపారు. అదేవిధంగా కాస్మెటిక్ బిల్లులు రూ.29 కోట్లు చెల్లించాలని ఆదేశించారు. హాస్టళ్ల విద్యుత్ పెండింగ్ బిల్లులు కూడా వెంటనే చెల్లించాలన్నారు. సత్యసాయి జిల్లాలోని నసనకోట, ఆత్మకూరు బీసీ సంక్షేమ బాలికల పాఠశాలలను రెసిడెన్షియల్ బీసీ గర్ల్స్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. కుప్పంలోనూ బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

### కార్పొరేషన్లకు నిధులు ఇలా...

బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేబినెట్లో కూడా ఆమోదం తెలిపామని, ఆ మేరకు అవసరమైతే న్యాయ పోరాటం చేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. అలాగే ప్రతి కార్పొరేషన్‌కూ దామాషా ప్రకారం నిధులు కేటాయించాలన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, దీనిపై ఇప్పటికే విధి విధానాలు రూపొందించామని తెలిపారు. రజకులకు మేలు చేకూరేలా రాష్ట్రంలో 2014-19 మధ్య నిర్మించిన దోబీ ఘాట్ల మరమ్మతులు, అవసరమైన చోట కొత్తవి నిర్మించడంపై దృష్టి పెట్టాలని సీఎం అన్నారు. రానున్న బడ్జెట్‌లో కేటాయించే నిధులతో రాష్ట్రంలో బీసీ భవనాలు పూర్తి చేయాలని ఆదేశించారు. 2014 నుంచి బీసీ కార్పొరేషన్ ద్వారా లబ్ధి పొందిన వారి సమాచారం సేకరించాలని, వృత్తి ప్రామాణికంగా రుణాలు తీసుకున్న వారు ప్రస్తుతం ఎంత మంది కొనసాగిస్తున్నారో ఆడిట్ చేయాలన్నారు.

## బీసీలను చంపిన వారికి శిక్ష పడాలి

- విచారణ వేగవంతం చేయండి
- సబ్‌కమిటీ నివేదిక రాగానే బీసీ రక్షణ చట్టం: చంద్రబాబు

వైసీపీ హయాంలో బీసీలను ఊచకోత కోశారని, వారి హత్యలపైనా విచారణ వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్ష పడేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ అంశం మేనిఫెస్టోలో కూడా పొందుపరిచామని, అవసరమైతే ప్రత్యేక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. బీసీ రక్షణ చట్టాన్ని సబ్‌కమిటీ నివేదిక రాగానే అమల్లోకి తెస్తామన్నారు. రాష్ట్రంలో 2014-19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో 13 కాపు భవనాలను మంజూరుచేసింది. అందులో 5 భవనాల నిర్మాణాలను ప్రారంభించగా, గత ప్రభుత్వం నిలిపేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణాలను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేసింది. అవి త్వరలోనే వినియోగంలోకి రానున్నాయని అధికారులు వివరించారు. నిర్మాణంలో ఉన్న 42 కాపు కమ్యూనిటీ హాళ్లు కూడా వేగంగా పూర్తి చేయాలని చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ సమీక్షలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, అధికారులు పాల్గొన్నారు.

# నేరుగా అర్జీదారుల వద్దకే!

- టీడీపీ కేంద్ర కార్యాయలంలో వినతులు స్వీకరించిన సీఎం
- 22న ఉయ్యాలవాడ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి
- రెడ్డి సంక్షేమ సంఘం అభ్యర్థన

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి సీఎం చంద్రబాబు వినతులు స్వీకరించారు. శుక్రవారమిక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత దివ్యాంగుల వద్దకు వెళ్లి వినతులు స్వీకరించి.. పలువురికి ఆర్థిక సాయం అందించారు. అనంతరం నేరుగా అర్జీదారుల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని వినతులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆయనతో మాట్లాడుతూ.. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు.. ఫిబ్రవరి 22న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని రాష్ట్రప్రభుత్వమే అధికారికంగా నిర్వహించేలా జీవో ఇచ్చిందని.. జగన్ ప్రభుత్వం అమలు చేయకుండా పక్కన పడేసిందని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిని ఘోరంగా అవమానించి.. రెడ్డి జాతి మనోభావాలను జగన్ దెబ్బతీశారని, కూటమి ప్రభుత్వం ఉయ్యాలవాడ వర్ధంతిని అధికారికంగా నిర్వహించి తమ మనోభావాలను కాపాడాలని కోరారు.



టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

# లోకం తీరు




# స్వచ్ఛాంధ్ర అందరి బాధ్యత

- పౌరులు బాధ్యత వహిస్తేనే కల సాకారం: చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. లక్ష్యాలు పెట్టుకోవడమే కాదని.. వాటిని కచ్చితంగా చేరుకునేలా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో పరిశుభ్రతను పెంచేందుకు.. అమలు చేస్తున్న కార్యాచరణపై సచివాలయంలో సమీక్ష చేశారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ప్రతి నెలా ఒక థీమ్ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జనవరిలో న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. మన మూలాలు-మన బలాలు తెలుసుకునేలా, రాష్ట్రంలోని వనరులను ఎలా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలనే దానిపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. జీవన ప్రమాణాలు పెంచడం, పర్యాటక రంగానికి ప్రోత్సాహం, పెట్టుబడులు ఆకట్టుకోవడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం, నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని సీఎం సూచించారు. స్వచ్ఛాంధ్ర అంటే స్వచ్ఛమైన మనసులు, స్వచ్ఛమైన పరిసరాలు, స్వచ్ఛమైన ఇళ్లు, కాలనీలు, ఊళ్లు అని అంతా గుర్తించాలన్నారు. ఇళ్లతో పాటు బహిరంగ ప్రదేశాలను, స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థనా మందిరాలు, పరిశ్రమలు కూడా పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇది ఏ ఒక్క శాఖకో.. ఒక అధికారికో సంబంధించిన కార్యక్రమంగా చూడవద్దని, పరిశుభ్రత, పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో పాఠశాల విద్యార్థి నుంచి నాయకుల వరకు బాధ్యత తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. రోడ్లపై చెత్త వేసి, చెట్లు నరికేసి.. అంతా క్లీన్‌గా ఉండాలి, పచ్చదనం ఉండాలి అని నినాదాలిస్తే కుదరదన్నారు.

### జిల్లాలకు ర్యాంకులు

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా మొత్తం 14 ఇండికేటర్స్‌లో పెట్టుకున్న లక్ష్యాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వీటిఆధారంగా జిల్లాలకు ర్యాంకులు ఇచ్చారు. మొత్తం 200 పాయింట్లకు గాను 129 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 127 పాయింట్లతో విశాఖ 2, 125తో తూర్పుగోదావరి 3, 122తో అనంతపురం జిల్లా 4, 120 పాయింట్లతో అన్నమయ్య 5, శ్రీకాకుళం 6. 118 పాయింట్లతో కడప 7వ స్థానం, 117 పాయింట్లతో గుంటూరు 8వ స్థానం, 115 పాయింట్లతో నెల్లూరు 10వ స్థానం ఇలా 26వ ర్యాంక్ వరకు ప్రకటించారు.

# ప్రేమించలేదని.. యాసిడ్ పోసి.. కత్తితో పొడిచి..

- అన్నమయ్య జిల్లాలో దారుణం

రాయచోటి, అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఉన్మాదిలా మారాడు. తన ప్రేమను అంగీకరించలేదన్న కోపంతో యువతి ముఖంపై యాసిడ్ పోసి.. కత్తితో మెడ, చేతులపై కోశాడు. తీవ్రంగా గాయపడిన ఆ యువతి ప్రాణాపాయ స్థితిలో ఉంది. ఆమెను మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలో శుక్రవారం ఉదయం ఈ దారుణం చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గుర్రంకొండ మండలం నడిమిఖండ్రిగ పంచాయితీ ప్యారంపల్లెకు చెందిన టి.జనార్దన్, రెడ్డెమ్మ దంపతుల కుమార్తె గౌతమి (22) మదనపల్లెలో డిగ్రీ పూర్తి చేసి అక్కడే బ్యూటీషియన్‌గా పనిచేసేది. ఈ నేపథ్యంలో అమ్మచెరువు మిట్ట వైఎస్సార్ కాలనీకి చెందిన గణేష్ అనే యువకుడు ఏడాదిగా బాధితురాలిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ వేధింపులు భరించలేని బాధితురాలు.. 3 నెలలక్రితం స్వగ్రామానికి వచ్చేసింది. తల్లిదండ్రులు మేనత్త కొడుకుతో ఆమెకు ఈ నెల 7న పెళ్లి నిశ్చితార్థం చేశారు. ఏప్రిల్ 29న పెళ్లి చేయాలని నిర్ణయించారు. విషయం తెలుసుకున్న గణేష్ శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో బైక్‌పై ప్యారంపల్లెకు వచ్చి, యువతి తల్లిదండ్రులు లేని సమయంలో గౌతమి ఇంట్లోకి ప్రవేశించి తలుపు మూసేశాడు. తనను ప్రేమించాలని ఆమెను కోరాడు. ఆమె నిరాకరించడంతో తన వెంట బాటిల్ లో తెచ్చుకున్న యాసిడ్‌ను ఆమె ముఖం, నోటిలో పోశాడు. తర్వాత.. కత్తితో ఆమె మెడ, చేయిపైన కోసి.. శరీరంపైనా పొడిచాడు. అక్కడి నుంచి పారిపోతూ.. ఆ ఇంటికి తాళం వేశాడు. అయితే ఇంట్లో ఉన్న ఆమె తల్లి ఫోన్ నుంచి తండ్రి జనార్దన్‌కు ఫోన్ చేసి ఘటన గురించి చెప్పింది. దీంతో తల్లిదండ్రులు పొలం నుంచి వచ్చేసరికి ఆమె అపస్మారక స్థితిలో పడి ఉంది. వెంటనే గుర్రంకొండ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడని సమాచారం. కాగా.. యాసిడ్ దాడిని సీఎం చంద్రబాబు ఖండించారు.నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యాసిడ్ దాడి ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గౌతమికి మెరుగైన వైద్య సాయం అందించి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

## చింతమనేనిపై సీఎం సీరియస్

- భాష మార్చుకోవాలని వార్నింగ్

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. బుధవారం రాత్రి ఓ వివాహ వేడుకకు వెళ్లిన సందర్భంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి కారును ఉద్దేశపూర్వకంగా తన కారుకు అడ్డంగా పెట్టడంతో డ్రైవర్‌ను ప్రభాకర్ దూషించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది, శుక్రవారం పార్టీ కార్యాలయానికి వచ్చిన సీఎంను ఎమ్మెల్యే కలిశారు. తప్పును తప్పని చెప్పడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయని, కేవలం బూతులు ఒక్కటే మార్గం కాదని, తీరు మార్చుకోవాలని చంద్రబాబు హెచ్చరించారు.

## వ్యర్థ రక్తం నుంచి స్టెమ్ సెల్స్ విభజన

- ఏయూ విద్యార్థినుల వినూత్న ఆవిష్కరణ

వెంకోజీపాలెం(విశాఖపట్నం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం బయో టెక్నాలజీ పీజీ విద్యార్థులు వినూత్న ఆవిష్కరణ చేశారు. ఆకెళ్ల మైథిలి, సింగుపురం ఇందు సంయుక్తంగా పరిశోధన చేసి స్టెమ్ సెల్స్, జెల్‌తో కూడిన 3డీ ఆకారాన్ని డిజైన్ చేశారు. పరిశోధనలో భాగంగా మహిళల రుతుస్రావం సమయంలో వెలువడే రక్తాన్ని సేకరించి, దాని నుంచి బ్యాక్టీరియా, ఫంగస్ తొలగించి స్టెమ్ సెల్స్‌ను వేరు చేయడం ద్వారా తొలి అడుగు విజయవంతంగా వేశారు. సాధారణంగా ఎముక మజ్జతో పాటు మరి కొన్ని భాగాల నుంచి స్టెమ్ సెల్స్ తీస్తారు. అయితే, వ్యర్థాల నుంచి స్టెమ్ సెల్స్‌ను వేరుచేయడం సరికొత్త విధానానికి రూపకల్పన చేసినట్టయింది. రెండో దశలో 3డీ బయో ప్రింటింగ్ మెషీన్ సహాయంతో వేరు చేసిన స్టెమ్ సెల్స్‌ను, (ఆరోగ్యానికి హాని చేయని) బయో కంపాటబుల్ జెల్స్‌ను వినియోగించి ఒక ఆకారాన్ని డిజైన్ చేశారు. భవిష్యత్తులో వివిధ అవయవాల సమస్యలతో బాధపడేవారికి వాటిని 3డీ ప్రింటింగ్ విధానంలో రూపొందించి అమర్చడంలో ఈ పరిశోధన కీలకంగా మారుతుందని భావిస్తున్నారు.

## రఘురామ 'క్వాష్' పిటిషన్‌పై విచారణ 3 వారాలకు వాయిదా

- ప్రతివాది వకాలత్ వేసేందుకు వీలుగా సుప్రీంకోర్టు గడువు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్‌పై దాడి కేసులో ఏపీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మూడు వారాలకు వాయిదా వేసింది. ప్రతివాది వకాలత్ వేసేందుకు గడువు కోరడంతో విచారణను వాయిదా వేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న బౌల్డర్ హిల్స్‌లోని రఘురామ నివాసం వద్ద ఒక వ్యక్తి(కానిస్టేబుల్ ఎస్‌కే ఫరూక్ బాషా) అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. సీసీ కెమెరా ద్వారా గుర్తించిన అప్పటి ఎంపీ భద్రతా సిబ్బంది అతనిని పిలిచి విచారించగా, ఐడీ, ఆధార్ కార్డులు చూపించేందుకు నిరాకరించారు. ఈ ఘటనపై రఘురామ పీఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు విధి నిర్వహణలో ఉన్న తనపై నలుగురు వ్యక్తులు దాడి చేశారని ఏపీ ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ ఎస్‌కే ఫరూక్ బాషా సైతం ఫిర్యాదు చేశారు. దీంతో రఘురామతోపాటు మరో నలుగురిపై కేసు నమోదైంది. అయితే, తనతోపాటు తన కుమారుడు, ఇతరులపై నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని కోరుతూ రఘురామ అప్పట్లోనే హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ నేపథ్యంలో రఘురామ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. అయితే, కానిస్టేబుల్ ఫరూక్ బాషా తరపున వకాలత్ దాఖలు చేయడానికి కొంత సమయం కావాలని ఆయన తరపున న్యాయవాది విజ్ఞప్తి చేశారు.

## పెద్దిరెడ్డి అటవీ భూములపై చట్ట నిబంధనలు పాటించండి

- అధికారులకు హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల అధీనంలో ఉన్న అటవీ భూములపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ భూముల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తే చట్ట నిబంధనలు అనుసరించాలని రెవెన్యూ, అటవీశాఖ అధికారులను ఆదేశించింది. పూర్తి వివరాలతో 2 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, అటవీశాఖ ప్రధాన సంరక్షణ అధికారి, చిత్తూరు జిల్లా కలెక్టర్, పులిచర్ల తహసీల్దార్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను మార్చి 6కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఉత్తర్వులు ఇచ్చారు. చిత్తూరుజిల్లా, పులిచర్ల మండలం, మంగళంపేట గ్రామ పరిధిలోని వివిధ సర్వేనెంబర్లలో ఉన్న సుమారు 75.74 ఎకరాల భూమి పెద్దిరెడ్డి కుటుంబం అధీనంలో ఉంది. అయితే.. ఈ విషయంలో జోక్యం చేసుకోకుండా అధికారులను నిలువరించాలని కోరుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకానాథ్‌రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

# వైసీపీ నేత చెరలో తమిళ కూలీలు

- మూడేళ్లుగా నిర్బంధం.. దంపతులతో తోటలో వెట్టి చాకిరి
- స్వచ్ఛంద సంస్థ సాయంతో ఆర్డీవోకు బాధితుల ఫిర్యాదు
- క్షేమంగా స్వస్థలానికి పంపించిన అధికారులు
- కేశవరెడ్డిపై కేసు నమోదు.. శ్రీసత్యసాయి జిల్లాలో ఘటన



తమిళనాడులోని తిరుత్తణి రెవెన్యూ అధికారులకు బాధిత దంపతులను అప్పగిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా అధికారులు



వైసీపీ నేత బడన్నపల్లి కేశవరెడ్డి

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పొట్ట చేతపట్టుకుని తమిళనాడు నుంచి వచ్చిన దంపతుల పట్ల ఓ వైసీపీ నేత దారుణంగా ప్రవర్తించాడు. మూడేళ్ల పాటు తన చీనీ తోటలో నిర్బంధించి.. తక్కువ కూలీకి వెట్టిచాకిరి చేయించుకున్నాడు. స్వస్థలానికి వెళతామన్నా అనుమతించలేదు. బయటకు చెబితే ఏమవుతుందోనని భయపడిన ఆ బాధితులు.. తాజాగా ఓ స్వచ్ఛంద సంస్థ సాయంతో ఎట్టకేలకు బయటపడ్డారు. రెవెన్యూ, పోలీసు అధికారులు జోక్యం చేసుకుని, ఆ దంపతులను వారి స్వస్థలానికి సురక్షితంగా పంపించారు. శ్రీసత్యసాయి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. ధర్మవరం మండలం బడన్నపల్లికి చెందిన వైసీపీ నేత బడన్నపల్లి కేశవరెడ్డి మూడేళ్ల క్రితం తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి తాలుకా కార్తికేయపురానికి చెందిన పళని, దేవయాని దంపతులను తన చీనీ తోటలో పనికి కుదుర్చుకున్నాడు. బయటకు వెళ్లేందుకు వీల్లేకుండా తోటకే పరిమితం చేశాడు. తక్కువ కూలీ ఇస్తూ శ్రమ దోపిడీకి పాల్పడ్డాడు. పని వదిలి వెళ్లకుండా అగ్రిమెంట్ చేసుకుని, బానిసలుగా మార్చుకున్నాడు. స్థానికేతరులు కావడంతో బాధిత దంపతులు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. స్వగ్రామానికి వెళ్లి వస్తామన్నా.. అనుమతించలేదు. దిక్కుతోచని స్థితిలో తమ బంధువుల సాయంతో జిల్లాలోని రెడ్స్ స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించారు. వారు ఈ విషయాన్ని ఈ నెల 12న ధర్మవరం ఆర్డీవో మహేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీవో విచారణకు ఆదేశించడంతో వీఆర్వో విష్ణువర్ధన్.. కేశవరెడ్డి తోటకు వెళ్లి ఆ దంపతులను విచారించారు. వారిని ఆర్డీవో వద్దకు తీసుకెళ్లారు. అనంతరం పోలీసు భద్రతతో వీఆర్వో వారి స్వస్థలానికి తీసుకువెళ్లారు. తిరుత్తణి రెవెన్యూ అధికారులకు శుక్రవారం అప్పగించారు. ధర్మవరం రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు వైసీపీ నేత కేశవరెడ్డిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన కేశవరెడ్డి.. దంపతులు తన వద్ద అడ్వాన్స్ తీసుకుని పనులు వచ్చారని చెప్పినట్లు సమాచారం. వారికి ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించానని చూపించినట్లు తెలిసింది. కూలీలను నిర్బంధించడం, బెదిరించడం, తక్కువ కూలీ చెల్లించడం కార్మిక చట్టాల ప్రకారం నేరమని, కేశవరెడ్డిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



# 'మెహర్బానీ' టెండర్లు రద్దు!

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై సీఎంవో ఆరా

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అవసరం లేకపోయినా వందల కోట్లు అప్పుతెచ్చి మరీ పరికరాల కొనుగోలుకు ఎస్పీడీసీఎల్ పిలిచిన టెండర్లు రద్దయ్యాయి. 'మంత్రి మెహర్బానీ ఖరీదు రూ.343 కోట్లు' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్రంగా స్పందించారు. 'సదరు మంత్రి ఎవరు? పనులు దక్కించుకునేందుకు ప్రయత్నించిన కాంట్రాక్టరు ఎవరు? ఏమాత్రం అవసరం లేని పనులకు అత్యవసరం పేరిట టెండర్లు ఎలా పిలిచారు..? ఈ భారీ స్కెచ్ వేసిందెవరు? కాసుల కోసం డిస్కంను నష్టాల ఊబిలోకి తోసే ప్రయత్నం చేసిందెవరు' అని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఆరా తీసింది. కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో టీడీపీతో రాజకీయ వైరం కలిగిన వర్గ శత్రువులను ఆర్థికంగా బలోపేతం చేసేలా టెండర్ మార్గదర్శకాలు తయారుచేశారని తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణమే టెండర్ల రద్దుకు ఎస్పీడీసీఎల్‌కు ఆదేశాలివ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అటు మంత్రి గొట్టిపాటి కూడా.. ఆ మూడు జిల్లాల్లో అవసరం లేకున్నా 33/11 కేవీ లైన్ల పనులు చేపట్టేందుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి రూ.343 కోట్లు అప్పు తీసుకుని పనులు చేపట్టాల్సిన అవసరం ఏముందని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావుపై మండిపడ్డారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా.. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండానే టెండరు నోటిఫికేషన్లు ఎలా ఇస్తారని నిలదీశారు. తక్షణమే టెండర్లను రద్దు చేస్తున్నట్లుగా ప్రకటించాలని తాను ఆదేశించినట్లు గొట్టిపాటి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. డిస్కంలు, విద్యుత్ రంగం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న తరుణంలో ఇలా వృథా చేసే పనులు చేపట్టడాన్ని ఆక్షేపించారు. డిస్కంల పరిధిలో అత్యవసర పనులు ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని సంప్రదించాల్సిందేనని స్పష్టం చేశారు. దీనిపై సంతోషరావు కూడా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఆ మూడు జిల్లాల్లో 33/11 కేవీ లైన్ల టెండర్లను రద్దు చేస్తున్నట్లు చెప్పారు.

### అవసరాలు తేల్చేందుకు ప్రత్యేక విభాగం!

రాష్ట్రంలోని 3 డిస్కంలు తూర్పు, దక్షిణ, మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు తరచూ పరికరాల కొనుగోలు వివాదంలో చిక్కుకుంటున్నాయి. 2019-24 మధ్య కాలంలో కాంటాక్టు సంస్థల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు, కండక్టర్లను రెట్టింపు ధరలకు కొనుగోలు చేశాయి. ఈ భారాన్ని ప్రజలు మోయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఇదే విధానం కొనసాగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ వైఖరి పోవాలంటే.. విద్యుత్ పరికరాలు అవసరాల మేరకు కొనుగోలు చేయవచ్చా లేదో తేల్చిచెప్పేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని విద్యుత్ రంగ నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సలహాదారును నియమించాలంటున్నారు.

# టార్గెట్లు పెట్టి మరీ తప్పులు!

**ఉపాధి సిబ్బందిని ఫణంగా పెట్టిన వైసీపీ సర్కారు.. కూలీలకు పని లేకుండానే మస్టర్లు వేయాలని హుకుం**

- కోట్ల పనిదినాలు పూర్తి చేయించినట్లు దొంగ లెక్కలు
- ఇలాంటి తప్పులతో ఉపాధి పథకం లక్ష్యం దెబ్బతింది
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు కేంద్రం లేఖ
- ఇప్పుడు తనిఖీల్లో వెలుగు చూస్తున్న ఆనాటి తప్పులు
- వందల సంఖ్యలో సిబ్బంది ఉద్యోగాలకు ఎసరు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ సర్కారు హయాంలో ఉపాధి హామీ పథకంలో సిబ్బందికి టార్గెట్లు పెట్టి మరీ తప్పులు చేయించారు. కూలీలకు పనులు లేకుండానే మస్టర్లు వేయాలంటూ హుకుం జారీచేసి కోట్ల పనిదినాలు పూర్తి చేయించినట్లు లెక్కలు రాసుకున్నారు. ఆ తప్పులు కప్పిపుచ్చుకునేందుకు సోషల్ ఆడిట్, క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ విభాగం, అంబుడ్స్‌మెన్ వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. ఇలాంటి తప్పులతో రాష్ట్రంలో పథకం లక్ష్యం దెబ్బతిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ లేఖ రాసింది. ఈ నేపథ్యంలో 2023-24లో చేపట్టిన పనులపై కూటమి ప్రభుత్వం సోషల్ ఆడిట్ డైరెక్టర్‌ను మార్చి పకడ్బందీగా తనిఖీలు చేపడుతుండటంతో అప్పట్లో చేసిన తప్పులు భారీగా వెలుగు చూస్తున్నాయి. నాటి ప్రభుత్వమే టార్గెట్లు పెట్టి వేధించడంతో పనులు లేకుండానే మస్టర్లు వేసిన ఫలితంగా ఉపాధి సిబ్బంది ఇప్పుడు బలవుతున్నారు. ఇప్పటివరకూ సుమారు 400కు పైగా మండలాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. వందల సంఖ్యలో సిబ్బందిని ఇంటి దారి పట్టించారు. అప్పటి ప్రభుత్వం చేయించిన తప్పులకు తాము ఉద్యోగాలు కోల్పోతున్నామని వారంతా వాపోతున్నారు.

**సిబ్బందిపై ఒత్తిడి**

ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లపై క్షేత్రస్థాయి సిబ్బంది తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో అప్పట్లో తప్పులు యథేచ్ఛగా జరిగిపోయాయి. ఏపీడీలపై రాష్ట్రస్థాయి అధికారులు ఒత్తిడి తేవడం.. వారు సిబ్బందిపై స్వారీ చేయడంతో పనులు లేకున్నా గ్రామాల్లో యథేచ్ఛగా మస్టర్లు నమోదయ్యాయని చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చేవారు లేరని, అందరూ పట్టణాలకు వలస వెళ్లారని ఫీల్డ్ అసిస్టెంట్లు చెప్పినా... డ్వామా అధికారులు అంగీకరించలేదు. వారి ఇళ్లకు వెళ్లి జాబ్‌కార్డులు తీసుకుని మస్టర్లు నమోదు చేయమని ఆదేశించారని సమాచారం. అలాగే ఒక్కో కూలీకి వేతనం రూ.270కి తగ్గకుండా రికార్డు చేయాలని ఒత్తిడి తెచ్చారని, దీంతో పనులు చేసినా, చేయకపోయినా, పనులకు అసలే హాజరు కాకపోయినా కూలీలు పనికి వచ్చినట్లు అటెండెన్స్ వేసి నమోదు చేయాల్సి వచ్చిందని సిబ్బంది ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలు తీసుకొచ్చిన మస్టర్లు తప్పనిసరిగా నమోదు చేయాల్సి వచ్చిందని, లేకుంటే సాయంత్రానికి ఏపీడీ నుంచో, పీడీ నుంచో వేధింపులతో ఫోన్లు వచ్చేవని గుర్తుచేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడితో ఉద్యోగాలు నిలబెట్టుకునేందుకు తప్పుడు మస్టర్లు వేయడం, నిఘా విభాగాల నుంచి తప్పించుకునేందుకు నానా తంటాలు పడటం ఉపాధి సిబ్బందికి అలవాటుగా మారింది. ఇప్పుడు కూలీలతో నిజంగా పనులు చేయించాలంటే సిబ్బందికి కష్టమేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తప్పుదారి పట్టిన ఉపాధి సిబ్బందితో సక్రమంగా పనులు చేపట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది.

### మెటీరియల్ నిధుల కోసం తప్పులు

ఉపాధి హామీ పథకంలో సాధారణంగా ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఎక్కువగానే మస్టర్లు నమోదవుతాయి. ఆ తర్వాత ఒక్కో ప్రాంతంలో వ్యవసాయ పనులు ముమ్మరమైతే ఈ పనులకు హాజరయ్యే వారి సంఖ్య తగ్గుతుంది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులతో సంబంధం లేకుండానే మస్టర్లు వేసేశారు. గ్రామాల్లో పనులు కూలీల ద్వారా చేయిస్తే దానికి అనుగుణంగా మెటీరియల్ పనులు చేసేందుకు కేంద్రం నిధులిస్తుంది. వాటికోసం రాష్ట్ర స్థాయి అధికారులు టార్గెట్లు పెట్టి సిబ్బందితో మస్టర్లు కొట్టేయించడంతో క్షేత్రస్థాయిలో అవినీతి తారస్థాయికి చేరింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంది. అయితే వైసీపీ సర్కారు మాత్రం దొడ్డిదారిని ఎంచుకుంది.

# మార్గదర్శిపై కేసు కొనసాగాల్సిందే!

- కుటుంబం 'కర్త' మరణించినా కేసు ఉంటుంది
- డిపాజిట్ల సేకరణ చెల్లదు.. తప్పని తేలితే రెట్టింపు జరిమానా కట్టాలి
- అదనపు కౌంటర్ సమర్పించిన ఆర్బీఐ
- తండ్రి తప్పులకు వారసులపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ సాధ్యం కాదు
- సీనియర్ న్యాయవాదులు రోహత్గీ, లూథ్రా వాదనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి అవిభాజ్య హిందూ కుటుంబం (హెచ్‌యూఎఫ్) కర్త అయిన రామోజీరావు మరణించినప్పటికీ ఆ సంస్థపై కేసు కొనసాగించాల్సిందేనని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) శుక్రవారం హైకోర్టును కోరింది. మార్గదర్శి చట్టబద్ధమైన సంస్థగా కార్యకలాపాలను నిర్వహిస్తున్నందున కేసును కూడా కొనసాగించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టులో అదనపు కౌంటర్ దాఖలు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శి సంస్థ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించిందంటూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ చేసిన ఫిర్యాదు మేరకు అప్పటి ఏపీ ప్రభుత్వం కేసు నమోదు చేసింది. ఈ కేసు కొట్టివేయాలని కోరుతూ మార్గదర్శి సంస్థ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మళ్లీ హైకోర్టు విచారణ చేపడుతోంది. తాజాగా శుక్రవారం జస్టిస్ శ్యాంకోషి, జస్టిస్ కే సుజన ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. ఈ కేసుపై ఆర్బీఐ తన వాదనను వినిపించింది. అర్హత లేకపోయినా అక్రమంగా డిపాజిట్లు సేకరించినందుకు శిక్షను మార్గదర్శి ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది. ఒకవేళ తప్పు చేసినట్టు రుజువైతే సేకరించిన డిపాజిట్లకు రెట్టింపు మొత్తంలో జరిమానా పడే అవకాశం ఉంటుందని తెలిపింది. హెచ్‌యూఎఫ్‌కు ఆర్బీఐ చట్టంలోని 45ఎస్ సెక్షన్ వర్తించదని మార్గదర్శి చేస్తున్న వాదనలో అర్థంలేదని పేర్కొంది. రామోజీరావు చనిపోయినా మార్గదర్శి హెచ్‌యూఎఫ్ ఇప్పటికీ కొనసాగుతోందని గుర్తుచేసింది. మార్గదర్శి తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ లూథ్రాలు వాదనలు వినిపిస్తూ ఒకవేళ తండ్రి తప్పు చేసి మరణిస్తే అతడి వారసులపై ఆ క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొనసాగించడం సాధ్యం కాదని ధర్మాసనానికి నివేదించారు. ఒకవేళ అప్పటి మార్గదర్శి ఛైర్మన్ రామోజీరావు తప్పు చేశారని అనుకున్నా, ఆయన కుమారుడు కిరణ్‌ను ఎలా శిక్షిస్తారని ప్రశ్నించారు. క్రిమినల్ చట్టాల ప్రకారం తండ్రిపై ఉన్న క్రిమినల్ కేసులకు కొడుకులు బాధ్యత వహించడం అనేది ఉండదని పేర్కొన్నారు. చట్టప్రకారం రామోజీరావు కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీలుండదని తెలిపారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. మార్గదర్శి హెచ్‌యూఎఫ్ ఇప్పటికీ వ్యాపారం నిర్వహిస్తోందని, సివిల్ తప్పులకైనా బాధ్యత వహించాల్సి వస్తుంది కదా? అని ప్రశ్నించింది. కోర్టు సమయం ముగియడంతో తదుపరి ఈనెల 28కి విచారణను వాయిదా వేసింది.

# దారికొచ్చిన విజయసాయి

## హైకోర్టు కేసులతో మాజీ ఎంపీ వెనుకడుగు

- విశాఖ బీచ్ భూముల్లో ప్రహరీ నిర్మాణానికి దరఖాస్తు
- వైసీపీ హయాంలో అడ్డగోలుగా నిర్మాణాలు
- కుమార్తె నేహారెడ్డి సంస్థ పేరిట లావాదేవీలు
- ఇటీవల హైకోర్టు సీరియస్..కమిటీ ఏర్పాటు
- దీంతో దిగివచ్చి అనుమతులకు విజయసాయి వినతి
- పది కొర్రీలతో దరఖాస్తు తిప్పి పంపిన అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



అనుమతులు లేకుండా విశాఖ భీమిలి సాగర తీరంలో చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

అధికారం చేతిలో ఉందని అనుమతులు లేకుండా విశాఖ భీమిలి సాగరతీరాన అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి బృందం హైకోర్టు కేసులతో దారికి వచ్చింది. అధికారం కోల్పోయాక అనుమతులు తప్పనిసరి అని అర్థం కావడంతో ఇప్పుడు అరకొర సమాచారంతో దరఖాస్తు సమర్పించింది. దానిని అధికారులు పరిశీలించి సరైన సమాచారంతో అందజేయాలంటూ తిప్పి పంపారు. వివరాల్లోకి వెళితే.. విజయసాయిరెడ్డి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యసభ సభ్యునిగా, వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగాను వ్యవహరించారు. ఆ సమయంలో భీమిలి సాగర తీరాన పలువురు ప్రైవేటు వ్యక్తుల నుంచి భూములు కొనుగోలు చేశారు. ఆ వ్యవహారాలన్నీ కుమార్తె నేహారెడ్డికి చెందిన సంస్థల పేరు మీద నడిపించారు. భీమిలి బీచ్‌ను ఆనుకొని ఉన్న ఆ భూముల్లో ఆయన ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ప్రహరీ గోడలు నిర్మించారు. సముద్రంలో గెడ్డ కలిసేచోట ఫుట్ ఓవర్ బ్రిడ్జి వేయించారు. వీటిపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టును ఆశ్రయించారు. దఫదఫాలుగా విచారణ సాగిన ఈ కేసులో ఈ నెల 5న హైకోర్టు తీవ్రంగా స్పందించింది. భీమిలి బీచ్‌లో అక్రమ నిర్మాణాలన్నీ కూల్చివేయాలని, వాటికి సంబంధించిన వివరాలన్నీ వారం రోజుల్లో కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. నిజాయితీ కలిగిన వివిధ శాఖల అధికారులతో కమిటీ వేసి వారితో ఈ పని చేయించాలని సూచించింది. దాంతో భీమిలి ఆర్డీవో కె.సంగీత్ మాధుర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ (ఫైనాన్స్) ఎస్.ఎస్.వర్మ, ఎన్ఐవో సైంటిస్ట్-ఇన్‌చార్జి వీవీఎస్ఎస్ శర్మ, విజయవాడకు చెందిన కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ఈఈ పీవీబీఎల్‌జీ శాస్త్రితో కమిటీ ఏర్పాటుచేశారు. వారు ఈ నెల 8న భీమిలి సాగర తీరం అంతా సర్వే చేశారు. ఏయే స్థలాలపై ఆరోపణలు వచ్చాయో వాటితో పాటు భీమిలి బీచ్ రోడ్డులోని ఇతర ఆక్రమణలపైనా దృష్టిపెట్టారు. నివేదిక అదే రోజు తయారుచేసి కలెక్టర్‌కు సమర్పించారు. అక్కడి నుంచి అది హైకోర్టుకు చేరింది.

### సీజెడ్ఎంఏకు దరఖాస్తు

కోస్తా నియంత్రణ మండలిలో (సీఆర్‌జెడ్) అక్రమ నిర్మాణాలపై హైకోర్టులో కేసు నడుస్తుండడంతో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం సాధ్యం కాదని సాయిరెడ్డి బృందం గుర్తించింది. ఈ నేపథ్యంలో భీమునిపట్నం, నేరెళ్లవలస సర్వే నంబర్లు 1516, 1517, 1517/3, 1519/1, 1519/2, 1518, 1522, 1086లలో గల భూమికి ప్రహరీ గోడలు నిర్మిస్తామని, అనుమతులు ఇవ్వాలని 'అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ' పేరుతో 2024 డిసెంబరు 19న ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీకి(ఏపీసీజెడ్ఎంఏ) దరఖాస్తు చేశారు. హైకోర్టు ఈ అంశంపై సీరియస్‌గా ఉండడంతో సీజెడ్ఎంఏ అధికారులు ఈ దరఖాస్తును పూర్తిగా పరిశీలించి పది కొర్రీలతో వెనక్కి పంపించారు. దరఖాస్తు చేసిన సర్వే నంబర్లలో మొత్తం భూమి 23,700 చదరపు గజాలు ఉందని, అందులో ఏ ప్రాజెక్టు నిర్మించాలనుకుంటున్నారో స్పష్టత చేయలేదని, దాని అంచనా వ్యయం కూడా పేర్కొనలేదని, ప్రహరీ గోడ ఎంత విస్తీర్ణంలో (బిల్టప్ ఏరియా) నిర్మిస్తారో స్పష్టత లేదంటూ 'అవ్యాన్'కు పంపిన లేఖలో పేర్కొన్నారు. ఆ భూమి అంతా పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతం కావడంతో సర్వే చేయించి నివేదిక ఇవ్వాలని, జీవీఎంసీ ద్వారా సరిహద్దులకు జియో కో-ఆర్డినేట్లు చూపించాలని, అక్కడ భవిష్యత్తులో ఎటువంటి కార్యకలాపాలు చేపట్టబోతున్నారో తెలపాలని, ప్రస్తుతం ఆయా భూముల్లో ఉన్న పురాతన భవనాల తొలగింపునకు అనుమతులు తీసుకోవాలని, ఆ భూములపై కోర్టు కేసుల వివరాలు, న్యాయస్థానం ఆదేశాలు చూపాలని సూచించారు. అక్కడ 20 వేల చదరపు మీటర్లు కంటే ఎక్కువ నిర్మాణం చేపడితే వాటికి అదనంగా మరిన్ని వివరాలు సమర్పించాలని అధికారులు స్పష్టం చేశారు.

# దామోదరం సంజీవయ్యకు సీఎం ఘననివాళి

- ఆయన ఆశయసాధనకు కట్టుబడి ఉన్నామన్న లోకేశ్



దామోదరం సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయునికి సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఘన నివాళులర్పించారు. శుక్రవారం ఉండవల్లి నివాసంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా సంజీవయ్య ఖ్యాతికెక్కారని, తన పదవీకాలంలో అనేక విప్లవాత్మక పథకాలతో ప్రజల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. నమ్మిన విలువలకు జీవితాంతం కట్టుబడిన వ్యక్తి సంజీవయ్య అని, ఆయన జయంతి వేడుకలను కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ ఆయన ఆశయసాధనకు కట్టుబడి ఉందని లోకేశ్ పేర్కొన్నారు.

### కర్నూలులో ఘనంగా 'దామోదరం' జయంతి వేడుకలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం దామోదరం సంజీవయ్య నిజాయితీకి మారు పేరని కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కొనియాడారు. సంజీవయ్య 104వ జయంతి వేడుకలను కర్నూలు నగరంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ నుంచి విద్యార్థులు, అధికారులు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దామోదరం సంజీవయ్య కూడలిలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషాతో పాటు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..'ప్రతి ఒక్కరూ సంజీవయ్యను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగు జాడల్లో నడవాలి. దళిత సీఎంగా ఆయన ఒక చరిత్ర సృష్టించారు. సంజీవయ్య జీవిత చరిత్రను పుస్తకాలుగా ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేస్తాం' అని అన్నారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ, 'సంజీవయ్య ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. బడుగుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. దేశంలోనే మొదటిసారిగా వృద్ధులకు పింఛన్ మంజూరు చేశారు' అని వివరించారు. గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ... అవినీతిపరుల కట్టడి కోసం ఏసీబీ సంస్థను ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా పలువురు కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ... కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

## 'అనంత'లో జననీ మిత్ర యాప్ ప్రారంభం

- మాతాశిశు మరణాల నివారణకు ఏఐ సాంకేతికత
- కూడేరు పీహెచ్‌సీలో పైలెట్ ప్రాజెక్టు అమలు

కూడేరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, మాతాశిశు మరణాలను నివారించేందుకు ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జననీ మిత్ర యాప్‌ను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ శుక్రవారం ప్రారంభించారు. మోడల్ పీహెచ్‌సీగా తీర్చిదిద్దేందుకు ఎంపిక చేసిన అనంతపురం జిల్లా కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి యాప్‌ను ప్రారంభించారు. జిల్లాలోని కూడేరు, పామిడి మండలాల్లో రక్తహీనత కేసులు ఎక్కువగా నమోదయ్యాయని అందుకే కూడేరును పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. అందుబాటులోని సాంకేతిక వనరులను ఉపయోగించి.. రక్తహీనత, మతాశిశు మరణాలను నివారించడమే పైలెట్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

## రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ట్రాన్స్ జెండర్ల హక్కుల రక్షణ, సంక్షేమం కోసం రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ బోర్డుకు ఛైర్మన్‌గా రాష్ట్ర దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు, వయోవృద్ధుల శాఖా మంత్రి వ్యవహరించనున్నారు. శాఖ కార్యదర్శి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

## జగన్.. మళ్లీ అధికారంపై భ్రమలొద్దు: ఎంపీ కలిశెట్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సీఎంగా గత ఐదేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. నేడు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం విమర్శించారు. రేపోమాపో అధికారంలోకి వస్తామనే భ్రమలు పెట్టుకోవద్దని జగన్‌కు హితవు పలికారు.

### ఏపీలో జౌళి రంగానికి సహకారం అందించండి

జౌళి రంగంలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న ప్రతి ఒక్కరికీ ఆంధ్రప్రదేశ్ స్వర్గధామంగా ఉంటుందని, సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అవసరమైన అనుమతులు వేగంగా అందిస్తుందని కేంద్ర జౌళి పరిశ్రమల మంత్రి గిరిరాజ్‌సింగ్‌తో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన భారత్ టెక్స్ 2025 ఎగ్జిబిషన్‌కు హాజరైన కేంద్ర మంత్రితో కలిసి ఏపీ స్టాల్‌ను కలిశెట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ జౌళి, చేనేత శాఖ కమిషనర్ రేఖారాణి, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు

గుత్తి రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్వామి వారికి, మాతా జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి బంజారాలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## సాంకేతిక మార్పులను అందిపుచ్చుకోండి!

- అందుకు తగ్గట్టు యువత సన్నద్ధమవ్వాలి
- నేడు ఏదో రంగంలో నైపుణ్యం అవసరం
- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

వెంకటాచలం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ నేటి యువతరం కాలంతో పాటు మారాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో విద్యార్థులు, వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న వారితో శుక్రవారం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు వెంకయ్య సమాధానాలు ఇచ్చారు. సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకుంటూ.. అందుకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. మన ఆలోచనలు కూడా మారాలన్నారు. యువత ఏదో ఒక రంగంలో నైపుణ్యం సాధించడం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డా రు. కేవలం డిగ్రీలు, పీజీలతో ఉద్యోగాలు వస్తాయన్న నమ్మకం లేదని, నైపుణ్యం ఉంటే జీవితంలో సొంత కాళ్లపై నిలబడవచ్చన్నారు. ప్రభు త్వం నుంచి ఎలాంటి సాయం పొందకుండానే స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను అందిస్తుండడం సంతోషంగా ఉందన్నారు.

## హైస్కూల్ ప్లస్‌లపై త్వరలో నిర్ణయం

- ఉపాధ్యాయ సంఘాలతో కమిషనర్ భేటీ

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): హైస్కూల్ ప్లస్‌ల కొనసాగింపుపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు తెలిపారు. శుక్రవారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. హైస్కూల్ క్రీడలు కాకుండా ఇతరత్రా ఆటలు, కార్యక్రమాల నిర్వహణకు వారిని బయటికి పంపొద్దని ఆదేశించారు. మిగులు టీచర్లు, భాషా పండితుల పదోన్నతులపైనా సమావేశంలో చర్చించారు.

### డీఐఈపీసీలకు అదనపు బాధ్యతలు

జిల్లా స్థాయి పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ)లకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. జిల్లాస్థాయిలో పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు, ప్రోత్సాహకాలు, స్వయం ఉపాధి లక్ష్యంగా ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీ, లబ్ధిదారుల ఎంపిక మొదలైన కార్యకలాపాలను జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వంలోని డీఐఈపీసీలు పర్యవేక్షిస్తున్నాయి. ఇక నుంచి అదనంగా జిల్లాల్లో ఎగుమతుల ప్రమోషన్‌కు సంబంధించిన అజెండా అంశాల సమీక్ష, పర్యవేక్షణ బాధ్యతలను కూడా డీఐఈపీసీలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వహించేలా ప్రతినెలా నిర్ణీత తేదీల్లో సమావేశాలను నిర్వహించి ఆ మినిట్స్‌ను పరిశ్రమలశాఖ డైరెక్టర్‌కు పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



కప్పస్తంభం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ రఘునందనరావుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఏఈఓ

## అప్పన్న సేవలో న్యాయమూర్తులు

సింహాచలం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సింహాచల వరాహ లక్ష్మీనృసింహ స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందనరావు శుక్రవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం వారికి పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, ఏఈఓ వీబీ రమణమూర్తి స్వామివారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.

## క్షీరదాలను సంరక్షించుకోవాలి

- పాంగోలిన్‌ల మనుగడను కాపాడాలి: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అరుదైన, అసాధారణమైన క్షీరదాలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. అందులో భాగంగా పురుగుల నియంత్రణకు ఉపయోగపడే 'పాంగోలిన్'ల మనుగడ కూడా ముఖ్యమని అన్నారు. శుక్రవారం ప్రపంచ పాంగోలిన్ దినోత్సవాల్లో భాగంగా మంగళగిరిలోని అరణ్య భవన్‌లో అటవీశాఖ, తూర్పు కనుమల వన్యప్రాణుల సొసైటీ సహకారంతో పాంగోలిన్‌ల సంరక్షణ ప్రాజెక్ట్ నివేదికను పీసీసీఎఫ్(వైల్డ్‌లైఫ్) ఏకే నాయక్, అదనపు పీసీసీఎఫ్ శాంతిప్రియా పాండే, ఐఎఫ్ఎస్ అధికారి రాహుల్‌పాండే కలిసి విడుదల చేశారు. ఇండియన్ పాంగోలిన్‌పై పోస్టర్‌ను ఆవిష్కరించి, అటవీ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ సందేశాన్ని అధికారులు వివరించారు.

## శ్రీవారి సేవనూ అమ్మేశాడు!

- ఉచిత సేవకు రూ.11,200 వసూలు చేసిన దళారీ

తిరుమల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉచితంగా కేటాయించే శ్రీవారి సేవను ఓ దళారీ అధిక ధరకు మహిళలకు విక్రయించి మోసం చేసిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. బాధితుల ఫిర్యాదుతో తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దళారీని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన కృష్ణారావు దాదాపు 15 వాట్సాప్ గ్రూపులను నడుపుతున్నాడు. ఆ గ్రూపుల్లో టీటీడీ శ్రీవారిసేవ, పరకామణి సేవలను కేటాయిస్తామని చెప్పడంతో పాటు శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం, రూ.300 ప్రత్యేక దర్శన టికెట్లు కూడా విక్రయిస్తామని పోస్టులు పెడుతుంటాడు. ఒక్కో గ్రూప్‌లో దాదాపు 500 మందికిపైగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఉన్నారు. హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ శేషవేణమ్మ తన బృందంతో కలిసి శ్రీవారి సేవ చేసేందుకు టీటీడీ వెబ్‌సైట్‌లో పలుమార్లు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో కృష్ణారావు పోస్టులు చూసి అతన్ని సంప్రదించగా, లక్ష్మీ శేషవేణమ్మ బృందంలోని 14 మంది నుంచి రూ.800 చొప్పున రూ.11,200 వసూలు చేశాడు. సేవ చేసేందుకు తిరుమలకు వచ్చిన శేషవేణమ్మ ఈ సేవ ఉచితమేనని తెలుసుకుని విజిలెన్స్ వింగ్ అధికారులకు ఫిర్యాదు చేయగా, కృష్ణారావును అదుపులోకి తీసుకున్నారు. తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విశాఖలో బ్రౌన్ షుగర్ స్వాధీనం

- పోలీసుల అదుపులో ముగ్గురు ఒడిశా వాసులు

ఆరిలోవ (విశాఖపట్నం), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని విశాలాక్షినగర్ ప్రాంతంలో కొందరి వద్ద మాదకద్రవ్యాలు ఉన్నట్టు టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందడంతో ఆరిలోవ పోలీసులతో కలిసి శుక్రవారం దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాలాక్షి నగర్ ప్రాంతంలో ఉన్న ఒడిశాకు చెందిన ముగ్గురి వద్ద డ్రగ్స్ ఉన్నట్టు సమాచారం అందింది. దీంతో మహ్మద్ చాంద్‌బాబు, షేక్ అనీష్, షేక్ ముజఫర్ అనే వారిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వారి నుంచి రెండు గ్రాముల బ్రౌన్ షుగర్ స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. వీరు ఒడిశాలో అరబ్ అనే వ్యక్తి నుంచి బ్రౌన్ షుగర్ కొనుగోలు చేసి, ఈ ప్రాంతంలో విక్రయానికి తెచ్చినట్టు సీఐ తెలిపారు. వీరిని పూర్తిస్థాయిలో విచారిస్తున్నామని, అనంతరం కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# మిత్రప్రేమలో వాణిజ్య రక్తి

ఇద్దరు గొప్ప మిత్రులు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న ఆ దృశ్యాన్ని ఎంతోకాలం తరువాత మళ్ళీ చూశాం. శ్వేతసౌధంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, భారతప్రధాని నరేంద్రమోదీ చేయిచేయీ కలిపారు, ఈ మారు అదనంగా థంబ్స్‌ప్‌తో స్నేహ గాఢతను తెలియచేశారు. శ్వేతసౌధంలో మిమ్మల్ని మళ్ళీ చూడటం నాకు ఆనందంగా ఉంది అన్న మోదీ వ్యాఖ్యలో ట్రంప్‌కు కచ్చితంగా నిజాయితీ కనిపించి ఉంటుంది. నమస్తే ట్రంప్, హౌడీ మోడీ కార్యక్రమాలను తామిద్దరూ ఒకరికోసం ఒకరు జరుపుకున్న ఘనమైన గతాన్ని మోదీ గుర్తుచేశారు కూడా. మోదీ అద్భుతంగా పనిచేస్తున్నారనీ, అందరూ అదే అంటున్నారని, నిజంగానే గొప్ప నాయకుడనీ ట్రంప్ ఈమారు కూడా మనప్రధాని మనసు ఉప్పొంగేట్టు చేశారు. నిత్యం దేశం గురించి ఆలోచించడమనే అద్భుతమైన నాయకత్వం లక్షణం ట్రంప్‌లో ఉన్నదనీ, తాను కూడా అదే స్ఫూర్తితో వ్యవహరిస్తానని మోదీ గుర్తుచేశారు. పొగడ్తంటేనే ఓ వల, మాయ అని కొందరు మేధావులకు ఏవగింపు ఉంటుంది కానీ, దేశాధినేతల ఈ కీర్తిగానాల మధ్యనే అమ్మకాలు, వ్యాపార లావాదేవీలు జరుగుతాయి.

మేం కలసికట్టుగా ఎవరినైనా జయిస్తాం, ఒకరినొకరు జయించాలని మాత్రం అనుకోవడం లేదని ట్రంప్ చక్కని మాటన్నారు. కలసి జయించాలని ఆయన కోరుకుంటున్నది చైనాని. తన ప్రబల శత్రువుతో పోరాటంలో మిత్రదేశం మరింత కలసిరావాలని కోరుకుంటున్నప్పుడు ఇతరత్రా విషయాల్లో భారత్ పట్ల కాస్తంత ఆదరణ పూర్వకంగా అమెరికా అధ్యక్షుడు వ్యవహరించివుంటే ఎంతో బాగుండేది. యుద్ధంలోనే ప్రేమ, వాణిజ్యంలో కలహమేనని ట్రంప్ తేల్చేశారు. ఒకరినొకరు జయించుకోబోమని ఇచ్చిన హామీ వ్యాపారవాణిజ్యాలకు, టారిఫ్ యుద్ధాలకు వర్తించబోదని మోదీతో భేటీకి కాస్తంత ముందే రుజువుచేశారు. ప్రతి సుంకాలని ఓ మర్యాదమాట వాడుతున్నప్పటికీ ప్రతీకార సుంకాలతో మిగతాదేశాలతో మననూ కలగలపి మోదేశారు. ఈ నిర్ణయం ఆఖరునిముషంలో మనపై మరింత ఒత్తిడిపెంచి, దారికితేవడానికి ఉద్దేశించింది కానప్పుడు, ఆ భేటీ ఏదో ముగిసేవరకూ ఆగితే మరింత గౌరవంగా ఉండేది. భారతప్రధానితో భేటీలో ట్రంప్ ఓ నాలుగు మర్యాదమాటల తరువాత పూర్తిగా బిజినెస్‌లో పడ్డారు. సుంకాల విషయంలో ఆయనకు ఉన్న ఆగ్రహాన్ని కాస్తంత చల్లార్చేందుకు మోదీ అమెరికా యాత్రకు ముందే విశేషమైన ప్రయత్నం జరిగింది. హార్లీడేవిడ్సన్ బైకులూ, ఎలాన్ మస్క్ కార్లూ ఖరీదు తగ్గేట్టు చేసినా భారత్ సుంకాలమీద ట్రంప్ మోదీ సమక్షంలోనే గట్టిగా మాట్లాడారు, హెచ్చరికలు చేశారు. రెండుదేశాల మధ్య వాణిజ్యంలో అమెరికాకు వంద బిలియన్ డాలర్ల లోటు ఉన్నదని అంటున్న ట్రంప్ ఈ విషయంలో అమెరికన్లకు న్యాయం జరిగేలా చేస్తానని స్పష్టం చేశారు. ఈ ఏడాదిలోగా ఆచరణలోకి వస్తుందంటున్న వాణిజ్య ఒప్పందంలో ఎవరిది పైచేయి అవుతుందో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు.

మగా, మిగా, మెగా అంటూ భారతప్రధాని చేసిన సూత్రీకరణ ఇరుదేశాల సంబంధాలకు మంచి ఉత్తేజాన్నిస్తుంది. ట్రంప్‌తో వ్యవహారం అంత సులభం కాదనీ, ప్రపంచదేశాల నాయకులు సైతం బోల్తాపడుతున్న తరుణంలో మోదీ నెగ్గుకొచ్చారని అమెరికన్ మీడియా ప్రశంసలు కురిపిస్తోంది. రక్షణ, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో హెచ్చిన భాగస్వామ్యం దశాబ్దాల బంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది. దశాబ్దకాలంలో అమెరికాతో సాన్నిహిత్యం ఆలింగనాలస్థాయికి చేరి, చైనాతో శత్రుత్వం మరింత పెరిగిన తరువాత అత్యాధునిక యుద్ధవిమానాల అవసరం కూడా హెచ్చింది. ఎఫ్–35 యుద్ధ విమానాల కొనుగోలు మన అమ్ములపొదిని బలోపేతం చేస్తుంది. ఈ ప్రతిపాదన ఏ దశలో ఉన్నదో తెలియదు కానీ, భారతదేశం అందుకు సిద్ధంగా ఉన్నదన్నట్టుగా ట్రంప్ వ్యాఖ్యానించడం విశేషం. అక్రమవలసదారులను వెనక్కుతెచ్చుకోవడం, సుంకాల విషయంలో రాజీపడటం, యుద్ధవిమానాలతో సహా అతిఖరీదైన ఆయుధసామగ్రిని కొనుగోలు చేయడం, డ్రిల్ బేబీ డ్రిల్ అంటూ చమురు తోడిపోస్తున్న అమెరికానుంచి భారీగా ఇంధనాన్ని కొనుగోలుచేయడానికి సిద్ధపడటం ఇత్యాదివి కచ్చితంగా ట్రంప్‌ను సంతృప్తిపరుస్తాయి. ఈ ఇచ్చిపుచ్చుకోవడాల్లో అంతిమ లబ్ధి ఎవరిదన్నది అటుంచితే, నాకంటే నరేంద్రమోదీయే బహుచక్కగా బేరమాడగలరు అని ట్రంప్ చేసిన ప్రశంస ఒక అతి తెలివైన వ్యాపారిని గుర్తుచేస్తోంది.

# నిరుపేదలకు అభయమేదీ?

తమిళ సమాజంలో ఒక సామెత ఉంది: 'ఆకలి దహించివేస్తే మొత్తం పదీ ఎగిరిపోతాయి'. ఇవీ ఆ పది: గౌరవం, వంశం, విద్య, ఔదార్యం, జ్ఞానం, ఉదారత, తపస్సు, సాధన, ధైర్యం, ప్రార్థన.

మన ఆధునిక ప్రజాస్వామ్య సమాజంలో ఈ పది మాత్రమే కాదు, ఇంకా ఎన్నో సుగుణాలూ హఠాత్తుగా మాయమైపోతాయి. ఇది సత్యం కాదూ? ఢిల్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలోను, బిహార్ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ప్రవేశపెట్టిన 2025–26 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌ను విలోకిస్తే ఆ సత్యం మీకు మరింతగా విశదమవుతుంది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అయితే ప్రభుత్వం ఒక సంవత్సర కాలంలో ఇవ్వగలిగినదంతా, ఎన్నికలలో పాలక పక్షం లబ్ధి పొందగలదనే ఆశాభావంతో, కేవలం కొద్ది మంది వ్యక్తులకు మాత్రమే ఇచ్చిన వార్షిక బడ్జెట్‌ను నేను చాలా చాలా అరుదుగా మాత్రమే చూశాను. గౌరవనీయ ఆర్థిక మంత్రి 2025–26 కేంద్ర బడ్జెట్‌ను కచ్చితంగా ఆ ఆశాభావంతోనే నివేదించారని నిక్కచ్చిగా చెప్పదలుచుకున్నాను.

ప్రజలకు పంపిణీ చేసేందుకు రూ.1,00,000 కోట్ల కాసుల కాణాచి తనకు అందుబాటులో ఉందని లేదా తాను కనుగొనవలసి ఉందని ఆర్థిక మంత్రి చెప్పారు. ఆమె ఆ భారీ ధనరాశిని 'కనుగొన్నారు'. ఆ సమస్త నిధులను (143 కోట్ల దేశ జనాభాలో) ఆదాయపు పన్ను చెల్లించే 3.2 కోట్ల మందికి ఇచ్చేందుకు ఆమె నిర్ణయించారు. మధ్య తరగతి కుటుంబీకులు, సంపన్నులు, మహా సంపన్నులు, కుబేర సమానులు ఆ 3.2 కోట్ల మందిలో ఉన్నారనేది ఒక అనావశ్యక వివరణ. తమిళ లోకోక్తిని పది సుగుణాలతో పాటు ఆధునిక పరిపాలనా విలువలు అయిన సమ దృష్టి, సామాజిక న్యాయం, సమంజసమైన పంపకం మొదలైన వాటిని కూడా పూర్తిగా గాలికి వదిలివేశారు.

బడ్జెట్ రూపకల్పనలో ఉండగా ప్రభుత్వ వార్షికాదాయం తగ్గుదల ఆర్థిక మంత్రిని వేధించింది. కేంద్ర ప్రభుత్వ మొత్తం వసూళ్లకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ అంచనాల కంటే రూ.60,000 కోట్ల మేరకు తక్కువగా ఉంటాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ లెక్కతేల్చింది. మరీ ముఖ్యంగా 2024–25 ఆర్థిక సంవత్సర ద్రవ్యలోటును 'మెరుగుపరచాలని' ఆర్థిక మంత్రి ఆశిస్తే, అందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ కనీసం రూ. 43,000 కోట్లను కనుగొనవలసి ఉన్నది. వసూళ్లలో తగ్గుదల భర్తీకి, ద్రవ్యలోటు 'మెరుగుదల'కు అవసరమైన నిధులకు మొత్తం రూ.1,00,000 కోట్లను సమకూర్చుకోవలసి ఉన్నది. ఇదిలావుండగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపించాయి. ఓటర్లకు భారీ వితరణ చేయదలుచుకుంటే అందుకు అదనపు నిధులు అవసరమవుతాయి. ఆ 'వితరణ' ఆదాయపు పన్నులో కోత రూపేణా ఉండాలని ప్రభుత్వ అత్యున్నత స్థాయిలో నిర్ణయం తీసుకుని ఉంటారు. పన్ను చెల్లింపుదారులలో ఏ వర్గానికి ఆ లబ్ధి చేకూర్చాలి? డొనాల్డ్ ట్రంప్ మహాశయుడు చెప్పినట్టు ప్రతి ఆదాయపు పన్ను చెల్లింపుదారుడు తగ్గింపు లబ్ధి పొందాలి! ఇంకేం, వార్షికాదాయం రూ.7 లక్షల నుంచి రూ.12 లక్షల దాకా ఉన్న వారందరూ ఆదాయపు పన్ను చెల్లించనవసరం లేకుండా నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి రూ.1,00,000 కోట్ల ఆదాయం తగ్గి పోతుందని ఆర్థిక మంత్రి చెప్పారు.

ఈ నిర్ణయాల పర్యవసానంగా 2024–25 ఆర్థిక సంవత్సర వ్యయాలలో కోత పెట్టడం, 2025–26లో ఇతర వర్గాల పౌరులకు అవసరమైన సహాయాన్ని సమకూర్చడాన్ని నిలిపి వేయడం అనివార్యమయింది. దీంతో ఉపాధి హామీ లబ్ధిదారులు (పేదలలో నిరుపేదలు), దినసరి కూలీలు, ఆదాయపు పన్ను చెల్లించని వేతన ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, ఎమ్ఎస్ఎమ్ఈలు, గృహిణులు, పెన్షనర్లు, నిరుద్యోగ యువతను పూర్తిగా ఉపేక్షించారు. పెట్టుబడి వ్యయం, రాబడి వ్యయం రెండిటిలోను కోత విధించారు. ఈ నిర్ణయం ఫలితంగా విదేశీ వ్యవహారాలు, మానవ వనరుల అభివృద్ధి, సాంఘిక సంక్షేమం, పట్టణాభివృద్ధి మొదలైన మంత్రిత్వ శాఖలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోను, రాబోయే ఆర్థిక సంవత్సరాలలోను నిధుల కేటాయింపు గణనీయంగా తగ్గిపోనున్నది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ నికర పన్ను వసూళ్లు 2024–25లో వలే 11 శాతం చొప్పున పెరుగుతాయని ఆర్థిక మంత్రి విశ్వసిస్తున్నారు! వాస్తవమేమిటి? పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్) ప్రకారం యువతలో నిరుద్యోగిత 10.2 శాతంగా ఉన్నది. పట్టభద్రుల నిరుద్యోగిత 13 శాతంగా ఉన్నది. ఉపాధి కల్పన పథకాల అమలుకు చేసే వ్యయం ఎనిమిది విధాలుగా నిర్ణయించారు. ఉత్పాదకతతో ముడివడి ఉన్న పెట్టుబడి పథకాలు కూడా ఇందులో ఉన్నాయి. ఉపాధి కల్పన పథకాల అమలుకు అయ్యే వ్యయం రూ.23,318 కోట్లుగా 2024–25 బడ్జెట్‌లో అంచనా వేశారు. సవరించిన అంచనాల ప్రకారం ఆ వ్యయం కేవలం రూ.20,035 కోట్లు మాత్రమే. ఏతవాతా ఉపాధి కల్పనా కార్యక్రమాలు లక్ష్య పరిపూర్తిలో పూర్తిగా విఫలమయ్యాయని చెప్పక తప్పదు.

పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం వేతన ఉద్యోగులలో పురుషుల నెలసరి వేతనం గత ఏడు సంవత్సరాలలో రూ.12,665 నుంచి రూ.11,858కి పడిపోయింది. అలాగే స్వయం ఉపాధి కార్మికులలో





భారత ఆర్థిక వ్యవస్థ తగినంత వృద్ధిరేటుతో అభివృద్ధి చెందడం లేదు. ప్రభుత్వ విధానాల (ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ఇవి ప్రతిబింబించాయి) ఫలితంగా చాలా కొద్ది మంది సంపన్నులు, మధ్యతరగతి జనాలు (వీరు మహా అయితే దేశ జనాభాలో 30 శాతంగా ఉంటారు) మాత్రమే జీవనోల్లాసంతో జీవించగలుగుతున్నారు. ఆర్థికంగా కింది స్థాయిలో ఉన్న 50 శాతం మంది ప్రజలకు సంక్షేమాన్ని సమకూర్చవలసిన బాధ్యతను ప్రభుత్వం క్రూరంగా వదిలివేసింది.

పురుషుల నెలసరి ఆదాయం కూడా గత ఏడు సంవత్సరాలలో రూ.9,554 నుంచి రూ.8,591కి పడిపోయింది. మహిళా ఉద్యోగుల, కార్మికుల ఆదాయాలు కూడా ఇదే విధంగా తగ్గి పోయాయి. కుటుంబ వినియోగంపై సర్వే ప్రకారం నెలసరి సగటు తలసరి వినియోగం గ్రామీణ ప్రాంతాలలో రూ.4,226 కాగా పట్టణ ప్రాంతాలలో రూ.6,996గా ఉన్నది. ఈ సగటు దేశ జనాభా మొత్తానికి వర్తిస్తుంది. కింది స్థాయిలో ఉన్న 50 శాతం మంది నెలవారీ తలసరి వినియోగ వ్యయం తక్కువ స్థాయిలో ఉన్నది. జనాభాలో కింది స్థాయిలో ఉన్న 25 శాతం నెలవారీ తలసరి వినియోగం మరింత తక్కువగా ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

నెలవారీ తలసరి వినియోగం రూ.4,000 నుంచి రూ.7,000 దాకా మాత్రమే ఉంటే, నలుగురు సభ్యులు ఉన్న ఒక కుటుంబం సుఖప్రదంగా ఎలా జీవించగలుగుతుంది? ఈ తలసరి వినియోగ వ్యయంలోనే ఆహారం, విద్యుత్తు, విద్య, ఆరోగ్య భద్రత, అద్దె, రవాణా, అప్పుల చెల్లింపు, వినోద విహారాలు, సామాజిక బాధ్యతలు, అత్యవసర వ్యయాలు మొదలైనవి కూడా భాగంగా ఉన్నాయన్న వాస్తవాన్ని మనం విస్మరించ కూడదు.

2030 సంవత్సరం దాకా ఏటా 78.5 లక్షల ఉద్యోగాలను వ్యవసాయేతర రంగాలలో సృష్టించవలసిన అవసరమున్నదని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. గత పదేళ్లుగా మన తయారీ రంగం స్థితిగతులు క్షీణించి పోతున్నాయి. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం స్థూల దేశీయోత్పత్తిలో మన తయారీరంగం వాటా 2014లో 15.07 శాతం నుంచి 2023లో 12.93 శాతానికి తగ్గి పోయింది. ప్రపంచ వస్తూత్పత్తుల వాణిజ్యంలో చైనా వాటా 28.8 శాతం కాగా, మన దేశం వాటా కేవలం 2.8 శాతం మాత్రమే! నిరుద్యోగ యువజనులు, దినసరి వేతనకార్మికులు, స్వయం ఉపాధి శ్రామికులు అందరికీ అవసరమైన ఉద్యోగాలను మన తయారీరంగం సృష్టించలేక పోతోంది. ప్రభుత్వం ఘనంగా చెప్పే 'మేడ్ ఇన్ ఇండియా' కూడా లక్ష్య పరిపూర్తిలో విఫలమయింది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ తగినంత వృద్ధిరేటుతో అభివృద్ధి చెందడం లేదు. ప్రభుత్వ విధానాల (ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో ఇవి ప్రతిబింబించాయి) ఫలితంగా చాలా కొద్ది మంది సంపన్నులు, మధ్యతరగతి జనాలు (వీరు మహా అయితే దేశ జనాభాలో 30 శాతంగా ఉంటారు) మాత్రమే జీవనోల్లాసంతో జీవించగలుగుతున్నారు. మిగతా వారి మాటేమిటి? ఆర్థికంగా కింది స్థాయిలో ఉన్న 50 శాతం మంది ప్రజలకు సంక్షేమాన్ని సమకూర్చవలసిన బాధ్యతను ప్రభుత్వం క్రూరంగా వదిలి వేసింది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

# బిరుదులన్నీ వ్యక్తి పూజలే!

ఏటా రిపబ్లిక్ దినానికి, 'పద్మ ఎవార్డు'ల పేరుతో, నాలుగు రకాల బిరుదుల్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. భారత రత్న, పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ. ఈ నాలుగు బిరుదుల వరసా చూస్తే, ప్రాచీన కాలంలో ఉండిన నాలుగు వర్ణాల వ్యవస్థ గుర్తుకు వస్తుంది. కానీ, భారత పాలకవర్గాలు రాసుకున్న 1950 నాటి రాజ్యాంగంలో, ప్రభుత్వం బిరుదులు ఇవ్వకూడదనే ఉంది. కానీ, 1954లో, ఈ బిరుదుల్ని అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ బిరుదులు రాజ్యాంగంలో రాసుకున్నదానికి విరుద్ధమైనవి కాబట్టి, వీటిని రద్దు చెయ్యాలని అప్పట్లో కొందరు కొన్ని రాష్ట్రాల హైకోర్టులకి వెళ్ళారు. చివరికి, ఐదుగురు జడ్జీల సుప్రీం కోర్టు ధర్మాసనం, "అవి బిరుదులు కావు, 'గౌరవ పురస్కారాలు' ('ఆనరరీ ఎవార్డ్స్'). కాబట్టి అవి రాజ్యాంగానికి విరుద్ధమైనవి కావు" అని తేల్చింది. బిరుదులు కాకపోతే, ఈ ఎవార్డులను పొందినవారిని, "భారత రత్న, ఫలానా", "పద్మ విభూషణ్, ఫలానా", "పద్మశ్రీ, ఫలానా" అని సభల్లోనూ, పత్రికల్లోనూ, సంబోధించడం ఎందుకు? ఆ పురస్కారాలు పొందిన కొందరు తమ లెటర్ హెడ్స్ లోనూ, తమ జీవిత విశేషాల్లోనూ ('బయోడేటా') ఆ ఎవార్డుల్ని చెప్పుకోవడం ఎందుకు? ఇతరులు చెబుతూ ఉంటే ఆనందిస్తూ కూచోడం ఎందుకు? కాబట్టి, గౌరవ పురస్కారాలైనా, బిరుదులైనా, రెండూ సారాంశంలో ఒకటే. ఒక రకంగా అవి పర్యాయపదాలే!

దేశంలో మనుషులందరూ సమానులే అని ఒక పక్క చెప్పుకుంటూనే, ఆ దేశంలోనే కొంతమందిని ఎక్కువ సమానులుగా బిరుదులు ఇవ్వడం ఏమిటి? ప్రభుత్వం ప్రకటించినా, తీసుకోవడం ఏమిటి? "అవును, మేము అందరితో సమానం కాము. మేము ప్రత్యేకం! మేము 'పద్మ' బిరుదాంకితులం! అల్లాటప్పాగాళ్ళం కాదు!" అని చెప్పుకోవడం కాదూ? ఏం? "ఎందుకీ గౌరవ పురస్కారాలూ? ఏముందీ? మాకు ఆయా రంగాల్లో పరిస్థితులూ, అవకాశాలూ కుదిరాయి. మాకు చేతనైన పనులు మేము చేశాము. అంతమాత్రాన, తోటి మనుషులనించీ, మమ్మల్ని విడగొట్టి గొప్ప చెయ్యడం ఏమిటి?" అనవద్దా? "నేను ఫలానా రంగంలో కృషి చేసినందుకు గుర్తింపుగా నాకు ఈ పురస్కారం లభించింది. ఇది నా రంగంలో కృషి చేస్తున్నవారందరికీ లభించిన పురస్కారంగా భావిస్తాను" అని ఒకరంటే, "ఇది నా జాతి (కులం) ప్రజలందరికీ దక్కిన గౌరవం" అని ఇంకొకరు అంటారు. అసలీ బిరుదులన్నీ, ఆ సమయానికి ఉన్న ప్రభుత్వానికి అనుకూలంగానో, వ్యతిరేకత లేకుండానో ఉండేవారికే వస్తాయి. పైగా ఆ బిరుదుల కోసం స్వయంగా గానీ, మిత్రుల ద్వారా గానీ, సిఫార్సులూ, పైరవీలూ జరుగుతాయని ఎన్నో వింటాం!



ఈ బిరుదులూ, ప్రత్యేక గౌరవ పురస్కారాలూ, ఇవన్నీ మనుషుల మధ్య అసమానత్వానికి గుర్తులు. వీటిని ఇచ్చేవారూ, పులకించి పుచ్చుకునే వారూ, వారిని చూసి సమ్మోహితులయ్యేవారూ, 'మాకు రాలేదే' అని బెంగ పడేవారూ... అందరూ సమానత్వ భావనకి వ్యతిరేకులు, తెలిసిగానీ, తెలియక గానీ! ఇతర్లని పొగడ్డమూ, పొగిడించుకోవడమూ ఇష్టమైనవారు అంటే, 'వ్యక్తి పూజ'కి అనుకూలురు!

ప్రభుత్వాలు బిరుదులిచ్చినట్టే, కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా, ఒక వ్యక్తిని గొప్ప చెయ్యడానికి, కొన్ని బిరుదులిస్తూ ఉంటాయి. ఉదాహరణకి, సినిమా హీరోల విషయంలో: నట సామ్రాట్, నట రత్న, విశ్వవిఖ్యాత నట సార్వభౌమ, మెగాస్టార్, పవర్ స్టార్, రెబెల్ స్టార్.. ఇలా రకరకాల బిరుదులున్నాయి. అవన్నీ, ఆ హీరోలతో తీసిన సినిమాలను బాగా అమ్ముడయ్యే సరుకులుగా ప్రచారం చేసుకోవడానికి ఉపయోగించుకుంటారు. అలాగే, కవులకి కూడా కొన్ని రకాల బిరుదులున్నాయి. 'విశ్వ కవి', 'మహా కవి', 'ప్రజా కవి', 'కవి సామ్రాట్', 'కవి రత్న', 'కవి కోకిల', 'కవి రాజు' వగైరాలు. గతంలో అయితే, 'గండపెండేరాలు' తొడిగి, ఏనుగు మీద ఊరేగించడం కూడా చేసేవారు!

ఈ బిరుదులూ, ప్రత్యేక గౌరవ పురస్కారాలూ, ఇవన్నీ మనుషుల మధ్య అసమానత్వానికి గుర్తులు. వీటిని ఇచ్చేవారూ, పులకించి పుచ్చుకునే వారూ, వారిని చూసి సమ్మోహితులయ్యేవారూ, 'మాకు రాలేదే' అని బెంగ పడేవారూ... అందరూ సమానత్వ భావనకి వ్యతిరేకులు, తెలిసిగానీ, తెలియక గానీ! ఇతర్లని పొగడ్డమూ, పొగిడించుకోవడమూ ఇష్టమైనవారు! అంటే, 'వ్యక్తి పూజ'కి అనుకూలురు! ఈ కీర్తి దాహానికి ('కీర్తి కండూతి' అని ఒక పరుషపదం కూడా ఉంది) లొంగిపోయే వారూ, ప్రోత్సహించేవారూ, బానిస యజమానులే కాదు, ఫ్యూడల్ చక్రవర్తులే కాదు, బూర్జువా నాయకులే కాదు, విప్లవ కమ్యూనిస్టులు కూడా! 'కామ్రేడ్ స్టాలిన్', 'కామ్రేడ్ మావో' ఈ విషయంలో, అందరినీ అధిగమించారు 'వ్యక్తి పూజ' చరిత్రలో! నిజానికి, సమానత్వ సిద్ధాంతమైన కమ్యూనిజం పూర్తిగా వంటబట్టిన వారెవ్వరూ, వ్యక్తి పూజని అంగీకరించరు. దానికి, శాస్త్రీయ కమ్యూనిజం సిద్ధాంతకర్తలైన, మార్క్సు, ఎంగెల్సుల్ని ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చును.

'విల్ హెల్మ్ బ్లాస్' అనే ఒక జర్మన్ పత్రికా సంపాదకుడికి రాసిన ఉత్తరంలో ఎంగెల్స్ గురించీ, తన గురించీ మార్క్సు ఇలా అంటాడు. (మార్క్సు ఏంగెల్స్ సెలెక్టడ్ కరెస్పాండెన్స్ పే. 291) "మాలో ఎవ్వరం పాప్యులారిటీకి గడ్డిపరకంత విలువైనా ఇవ్వం. వ్యక్తి పూజ ('పెర్సనాలిటీ కల్టు') ఏ రకమైందైనా మాకు విముఖతే. అనేక దేశాల నించీ వచ్చే ఎన్నో రకాల పొగడ్తల ఉత్తరాలు బహిరంగం కావడానికి నేను ఎన్నడూ ఒప్పుకోలేదు. ఇంటర్నేషనల్ ఉన్నంత కాలం ఆ ఉత్తరాలు నన్ను మహా చికాకు పెట్టేవి. వాటికి నేను ఎన్నడూ జవాబే ఇవ్వలేదు ఎప్పుడైనా ఓసారి తప్ప. అదైనా వాటిని వ్యతిరేకిస్తున్నానని గట్టిగా చెప్పడానికే. "ఎంగెల్సూ, నేనూ మొట్టమొదట రహస్య కమ్యూనిస్టు సంఘంలో చేరినప్పుడు, 'అధికారం' గురించి మూఢ విశ్వాసాన్ని ప్రోత్సహించే ప్రతీ అంశాన్నీ నిబంధనావళి నించి తీసెయ్యాలని షరతు పెట్టాం."

బిరుదులూ, ఎవార్డులూ, సన్మానాలూ ఆనందంగా అంగీకరించే మేధావులు, బిరుదులూ వగైరాల్లో ఉన్న అసమానత్వ కోణం గురించి ఆలోచించాలా, వద్దా?


◆ బి.ఆర్. బాపూజీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

# పరీక్షా ఫలితాలే జీవిత విజయమా?

పరీక్షల సీజన్లలో దేశంలో ప్రతి ఏటా విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. అధిక ఒత్తిడి కారణంగా విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డేటా ప్రకారం 2022లో మొత్తం 1,70,924 ఆత్మహత్యలు నమోదు కాగా, వాటిలో 7.6 శాతం ఆత్మహత్యలు విద్యార్థులవి. వీటిలో పరీక్షల్లో ఫెయిల్ అవుతామన్న భయంతో చేసుకున్న ఆత్మహత్యలు 2,248. ఈ ఆందోళనకరమైన ధోరణి భారతీయ సమాజాన్ని ఆవరించిన విద్యా ఒత్తిడిని నొక్కి చెబుతుంది.

పెరుగుతున్న పరీక్షా ఒత్తిడి సంక్షోభానికి ప్రతిస్పందనగా భారత ప్రభుత్వం 2018లో 'పరీక్షా పే చర్చ' (పీపీసీ)ను ప్రారంభించింది. ప్రతి సంవత్సరం జనవరి / ఫిబ్రవరి నెలల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఎంపిక చేయబడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి, ఎంపిక చేయబడ్డ ప్రశ్నలకు ప్రధానమంత్రి సమాధానాలిస్తూ ప్రసంగిస్తారు. పరీక్షలకు సంబంధించిన ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో సలహాలు అందిస్తారు. ఈ సంవత్సరం దాని ఎనిమిదవ ఎడిషన్ కార్యక్రమం ఇటీవలే ముగిసింది. పీపీసీ లక్ష్యం ప్రశంసనీయమైనప్పటికీ, దాని ప్రభావం, ప్రాధాన్యత ప్రశ్నార్థకంగానే ఉన్నాయి.



'పరీక్ష పే చర్చ' వంటి కార్యక్రమాలు విద్యార్థి ఆత్మహత్యల సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా ఉన్నప్పటికీ, వాటి ప్రభావం పరిమితంగా ఉంది. సామాజిక విలువలను పునర్నిర్వచించడం, మూల్యాంకన పద్ధతులను సంస్కరించడం, ఉపాధ్యాయ శిక్షణలో పెట్టుబడి పెట్టడం ద్వారా మాత్రమే నిజమైన పరిష్కారాలు సాధ్యం.

పీపీసీపై ఉన్న ప్రాథమిక విమర్శలలో ఒకటి దాని వనరుల కేటాయింపు. 2022 నుంచి 2024 వరకు మూడేళ్ళకు ఈ కార్యక్రమానికి రూ.62 కోట్ల ఖర్చు అయింది. 2022, 2023 సంవత్సరాలలో ఈ కార్యక్రమానికి రిజిస్టర్ చేసుకొని ఆన్‌లైన్‌లో వీక్షించిన వారికి ప్రశంసాపత్రాలను పంపించారు. దీని కోసం నేషనల్ బుక్ ట్రస్ట్ రూ.28 కోట్లు ఖర్చు చేసింది. ఒక కేంద్రీయ విద్యాలయాన్నీ, ఒక నవోదయ విద్యాలయాన్నీ ఒక ఏడాది పాటు నిర్వహించడానికి అయ్యే ఖర్చు కంటే ఒక పీపీసీ కోసం ఒక ఏడాది పెట్టే ఖర్చు ఎక్కువ. మరొక వైపు నేషనల్ టాలెంట్ సెర్చ్ పరీక్ష ద్వారా పదవ తరగతి పిల్లలకు పీహెచ్‌డీ చదువు వరకు ఇవ్వబడే స్కాలర్‌షిప్ పథకాన్ని రద్దు చేశారు. దేశవ్యాప్తంగా ప్రతిభ కలిగిన పిల్లలకు ఎంతగానో ఉపయోగపడే ఈ పథకం 1963 నుండి కొనసాగుతున్నది. సంవత్సరానికి సుమారు పన్నెండు కోట్ల రూపాయలు ఈ పథకానికి ఖర్చు అవుతాయి. ఒకపక్క ఇటువంటి ప్రభావవంతమైన కార్యక్రమాలకు బడ్జెట్లు రద్దు చేస్తూ, పీపీసీ లాంటి కార్యక్రమాలను మాత్రం నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

ప్రేరణాత్మక ప్రసంగాలు, పరీక్షల ఒత్తిడి నిర్వహణ చిట్కాలు తాత్కాలిక ఉపశమనాన్ని అందించవచ్చు. కానీ అవి పరీక్షల ఒత్తిడికి ఉండే మూల కారణాలను పరిష్కరించవు. నిజానికి ఇలాంటి ప్రసంగాలు, నిర్వహణ చిట్కాలను టీచర్లు చాలా ప్రొఫెషనల్‌గా నిత్యం అందిస్తూనే ఉంటారు. వాటికంటే ముఖ్యంగా, ఆరోగ్యకరమైన, మరింత స్థిరమైన అభ్యాస వాతావరణాన్ని సృష్టించడానికి, విధాన నిర్ణేతలు ఈ క్రింది అంశాలపై దృష్టి పెట్టాలి:

1) పరీక్షా ఫలితాలే జీవిత విజయం అనే ఇరుకైన నిర్వచనాన్ని సవాలు చేయాలి. వృత్తి శిక్షణ, కళలు, క్రీడలు వంటి ప్రత్యామ్నాయ కెరీర్ మార్గాలు సమానంగా చెల్లుబాటు అయ్యే విధానాలను పెంపొందించాలి, వాటి ఎంపికలను ప్రోత్సహించాలి. 2. అధిక పోటీతో ఉండే పరీక్షలపై అతిగా ఆధారపడటాన్ని తగ్గించాలి. తుది పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి ఏడాది పొడవునా విద్యార్థుల పురోగతిని అంచనా వేసే నిరంతర, సమగ్ర మూల్యాంకన (CCE) పద్ధతులను అమలు చేయాలి. లాభాపేక్షతో నడిచే కోచింగ్ సెంటర్లను చైనా నిషేధించింది. హోంవర్క్‌పై పరిమితులను విధించింది. మనం ఈ చర్యలను చేపట్టలేకపోతున్నాము, 'ఒకే దేశం–ఒకే పరీక్ష' విధానాలను తెస్తూ ఇంకా ఒత్తిడి పెరిగేటట్లు చేస్తున్నాము. 3. శిక్షణ పొందిన కౌన్సిలర్లు, మనస్తత్వవేత్తల సేవల ద్వారా పాఠశాలలు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగ శ్రేయస్సుపై అవగాహన కార్యక్రమాలను పాఠ్యాంశాల్లో విలీనం చేయాలి. 4. విద్యార్థుల విద్యా అనుభవాలను రూపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారు. వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థి కేంద్రీకృత అభ్యాసంపై మొక్కుబడి శిక్షణలు గాక సరైన శిక్షణ అందించడం వలన మరింత ఆకర్షణీయమైన తరగతి గది వాతావరణం ఏర్పడుతుంది. 5. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, ఉపాధ్యాయ–విద్యార్థి నిష్పత్తులను తగ్గించడానికి, వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించడానికి ప్రభుత్వం తగినంత నిధులను కేటాయించాలి. ప్రజా సంబంధాలను పెంచుకునే పనిలో భాగంగా పెద్దగా ప్రభావాన్ని కలిగించని కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తూ, ముఖ్యమైన కార్యక్రమాలకు బడ్జెట్ తగ్గిస్తున్నారు. ఇది ప్రతికూల ఫలితాన్నిస్తుంది.


పరీక్షల ఒత్తిడి కారణంగా పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య వ్యవస్థాగత సంస్కరణల తక్షణ అవసరాన్ని గుర్తు చేస్తుంది. 'పరీక్ష పే చర్చ' వంటి కార్యక్రమాలు ఈ సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా ఉన్నప్పటికీ, వాటి ప్రభావం పరిమితం. సామాజిక విలువలను పునర్నిర్వచించడం, మూల్యాంకన పద్ధతులను సంస్కరించడం, ఉపాధ్యాయ శిక్షణలో పెట్టుబడి పెట్టడం ద్వారా మాత్రమే నిజమైన పరిష్కారాలు సాధ్యం.

• ఎడమ శ్రీనివాస రెడ్డి
అధ్యాపకులు

# మలయాళీ బానిసల న్యాయ ఉద్ఘోష

కేరళకు చెందిన పోయ్‌కయిల్ యోహనన్ గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక విప్లవకారుడిగా ఆయన అక్కడి బానిస జాతుల అభ్యున్నతి కోసం జీవితకాలం పోరాడాడు. వివిధ సంస్థలను స్థాపించి తన పాటలు, ప్రసంగాల ద్వారా దళిత జన ఐక్యతకు పాటుపడ్డాడు. ఆనాటి బానిస జాతుల వేదనలను తన పాటల ద్వారా వినిపించాడు. ఆయన రాసిన 'నా గురించి ఒక్క అక్షరమూ లేదు' అనే గీతం ఇప్పటికీ అక్కడి జనం గొంతెత్తి పాడుకుంటారు. "ఎన్నో జాతుల గురించి చరిత్రలున్నాయి/ మా గురించి ఎక్కడా ఓ అక్షరం లేదు/ నా జాతి చరిత్ర రాసేందుకు భూమ్మీద ఎవరూ లేరు/ నేల నుంచి ఆకాశం దాకా మమ్మల్ని ద్వేషించేవారే!" అనే పంక్తులు అప్పటి మలయాళీ బానిస జాతుల వేదనను స్పష్టం చేస్తాయి. దేశంలో నేటికీ మారని అణగారిన వర్గాల పరిస్థితులకు అవి అద్దం పడతాయి.

బానిస వ్యవస్థ అంటే అమెరికాలో నీగ్రోలే గుర్తుకొస్తుంటారు. అయితే అదే పరిస్థితి కేరళలోని సంస్థానాల్లో ఎంతోకాలం కొనసాగింది. దళిత, గిరిజనులను దొరకబుచ్చుకొని వారిని బానిసలుగా అమ్ముకున్న చరిత్ర కేరళకు ఉంది. అయితే, బ్రిటిష్ పాలనా కాలంలో వివిధ సంస్థానాలు 1850–60 దశకాల్లో ఈ దురాచారాన్ని రద్దు చేశాయి. అయితే చట్టాలు సామాజిక ఆచరణలోకి ఊరికే రావు. వాటి కోసం సామాజిక ఉద్యమాలు కావాలి. దళితజాతులపై వివక్షను సమాజంలోంచి పెకిలించేందుకు పాటుపడిన కేరళ ఉద్యమకర్తల్లో పోయ్‌కయిల్ యోహనన్ ముందుంటారు. కేరళలోని ఎరవిపేరూరులో యోహనన్ 17 ఫిబ్రవరి 1879న జన్మించాడు. ఆయనది పరయ బానిస కుటుంబం.



దళిత క్రైస్తవులపై వివక్షకు నిరసనగా 1909లో ఆయన ప్రత్యక్ష రక్ష దైవసభను స్థాపించాడు. ఈ సభ ద్వారా దిగువజాతులపై జరుగుతున్న మతపర వైపరీత్యాలను తీవ్రంగా వ్యతిరేకించాడు. మతాతీతంగా మనుషులందరిలో దేవుడున్నాడని, మనుషులందరి హితం కోరే మనిషి రూపంలోనే ఉద్భవిస్తాడని ఆయన అనుచరులకు బోధించాడు.

సంస్కర్తగా యోహనన్ అణగారిన జాతుల క్షోభ అందరికీ చేరేందుకు కవిత్వాన్ని ఆయుధంగా వాడుకున్నాడు. ఆయన గేయాల్లో దళిత పేదల బాధలు కళ్ళకు కట్టినట్లుగా ఉంటాయి. సామాన్యులకు అర్థమయ్యే రీతిలో, జనభాషలో రాసిన ఆ పాటలు మౌఖికంగా వ్యాప్తి చెంది ఎంతో ప్రాచుర్యాన్ని పొందాయి. "నన్ను బానిస అంటే చర్చికి వెళ్ళాను/ అక్కడా అందరితో సమానంగా నన్ను చూడలేదు/ హిందుత్వపు నీడలో అస్తిత్వాన్ని వెదుకుతూ/ చివరి వరుసలో అనాథగా తిరుగుతున్నాను/ హిందువులు, క్రిస్టియన్లు మమ్మల్ని ఎవరూ తమవారిగా ఒప్పుకోరు/ నా జాతి గురించి చెప్పుకోవడానికి నేను సిగ్గు పడను/ గుండె నిండా వేదనతో నా గాథ ముందుంచుతాను/ జనంలోని క్రూరత్వాన్ని విప్పి చెబుతాను/ అందరి దృష్టిలో ఈ భూమ్మీద నేను శాపగ్రస్త జీవిని/ భూమ్యాకాశాల నడుమ నన్నే నిందిస్తారు/ భూమ్మీద అన్నిటిని తీర్చిదిద్దిన దేవుడు/ ఈ వివక్షను ఎలా అనుమతించాడు" అని తన గీతాల్లో ఆయన ప్రశ్నించాడు.

"దైవమా నన్ను విస్మరించకుము/ భూమ్మీద ఏ ఒక్కరు నన్ను దీవించలేదు/ భవిష్యత్తులో కూడా జరుగుతుందని ఆశ లేదు/ ఈ భూమ్మీద నన్ను అంగీకరించేవారెవరూ లేరు/ మరెవరు రారు/ నీ భుజాలతో చుట్టేసి నా కన్నీరును తుడువు/ ఈ భూమ్మీద ఎవరికీ చెందని గూటి కోసం వెదుకుతూ తిరుగుతున్నాను/ నా బాధ్యత తీసుకొని చేరదీసి పక్కన కూచోబెట్టుకో/ మోక్షం ప్రసాదించి నా బాధల్ని తుడిచెయ్" అని ఆధ్యాత్మిక ధోరణిలో వేడుకున్నాడు. రత్నమాణికల్ అనే పేరిట యోహనన్ గీతాలు సంపుటిగా వచ్చాయి. ఎం.ఆర్. రేణుకుమార్ 'పోయ్‌కయిల్ యోహనన్' అనే పేరుతో ఆయన ఆత్మకథను రాశాడు. యోహనన్ జీవితాన్ని వి.వి. శాంతకుమార్ 'మన్నిక్కులే మాణిక్యం' పేరుతో నాటకంగా తీర్చిదిద్దాడు. ఆత్మగౌరవం కోసం వెదికిన యోహనన్ తొలుత మార్తోమా సిరియన్ చర్చి విధానాన్ని స్వీకరించాడు. అక్కడ కూడా క్రైస్తవుల మధ్య సమానత్వం దొరకకపోవడంతో దాన్ని వదిలేశాడు. ఆ తర్వాత ఎవాంజెలికల్ అనే క్రిస్టియన్ బ్రెథ్రెన్ మిషన్‌లో చేరి నాలుగేళ్ళ తర్వాత అదీ నచ్చక బయటికొచ్చాడు. ఈ రెండు అనుభవాల తర్వాత భారత సమాజంలోని క్రిస్టియన్లలో కులతత్వం మూలాల్లోనే ఉందని, క్రీస్తు బోధనల వల్ల అది మరింత లోతుగా వెళ్లిందని గ్రహించిన ఆయన సొంత మార్గంలో దళిత విముక్తి ఉద్యమంగా ప్రత్యక్ష రక్ష దైవసభను స్థాపించాడు.

"బైబిల్‌లో మా గురించి ఒక్క అక్షరం లేదు. అందులో ఉన్నదంతా బయటి ప్రాంతాల్లో జరిగిందే. మా బానిసత్వం గురించి ప్రస్తావన, సానుభూతి కనబడని పుస్తకాన్ని మేమెందుకు చదవాలి" అని ప్రశ్నించాడు. క్రైస్తవాన్ని నిరసిస్తూ తనను ద్రావిడ దళితుడిగా ప్రకటించుకున్నాడు. కేరళకు చెందిన ప్రసిద్ధ సంఘ సంస్కర్త అయ్యంకాళి స్థాపించిన సాధుజన పరిపాలన సంఘంలో సభ్యత్వం తీసుకున్నాడు. దళితజాతి ఉన్నతికి నిర్విరామంగా పాటుపడిన యోహనన్ 29 జూన్, 1939న మరణించాడు. నేటికీ కేరళలోని అణగారిన వర్గాల గుండెల్లో ఉద్యమకర్తగా, వాగ్గేయకారుడిగా ఆయన స్థానం పదిలంగా ఉంది.

• బి. నర్సన్

(ఫిబ్రవరి 17: పోయ్‌కయిల్ యోహనన్ జయంతి)



కొండలను పిండి చేశారు.. భూములను ఆక్రమించేశారు.. చెరువులను చెరపట్టారు.. మామిడి తోటలను సైతం మాయం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, ఆయన అనుచరులు చేసిన అరాచకాలివి. అధికారం అనే అంధకారంలో.. అధికారులను కొనేసి సాగించిన అక్రమాల్లో రూ.కోట్లకు పడగలెత్తారు. నాటి వీరి పాపాలకు సాక్ష్యంగా నేడు గన్నవరంలో ఎటుచూసినా కరిగిపోయిన కొండలు.. తవ్వేసిన భూములే కనిపిస్తాయి.

## కొండపావులూరు కొండలకు బోడిగుండ్లు

కొండపావులూరులోని సర్వే నెంబర్ 6లో పేదలకు ఇళ్ల పేరుతో విజయవాడ నగరంలోని 5 వేల మందికి ఇళ్ల పట్టాలు కేటాయించారు. ఇందుకోసం రైతుల ఆక్రమిత, డీ పట్టా భూములు తీసుకున్నారు. వీటి చదును కోసం సూదిగట్టు, గదబాలగట్టు, గుర్రంగట్టు, పాతగట్టు కొండలపై వైసీపీ అనుచరులు కన్నేశారు. ఎక్స్‌కవేటర్లతో రాత్రికి రాత్రే తవ్వించేశారు. ఒక రాత్రికి ఐదెకరాల చొప్పున తవ్వేశారంటే అర్థం చేసుకోవాలి. మూడు కొండలను బోడిగుండ్లుగా మార్చారు. సర్వే నెంబర్‌లోని మూడు కొండల నుంచి తవ్వుకున్న గ్రావెల్ ద్వారానే వంశీ అనుయాయులు కోట్ల రూపాయలను కూడబెట్టుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. నాటి అరాచకానికి పరాకాష్ఠగా ఇప్పుడీ కొండలు కనిపిస్తున్నాయి.

బోడిగా మిగిలిన కొండపావులూరులోని కొండ

# అవినీతి కొండలు

## గన్నవరంలో వంశీ అనుచరుల అక్రమాలు

### వైసీపీ హయాంలో విచ్చలవిడిగా అవినీతి

- కొండలన్నింటినీ బోడిగుండ్లుగా మార్చేశారు
- లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వేశారు
- చెరువులను చెరపట్టి మట్టిని తరలించారు
- గ్రావెల్ ఉన్న మామిడి తోటలనూ వదల్లేదు
- ఇన్నాళ్లకు పండిన పాపాల చిట్టా



కొండపావులూరులో అక్రమ తవ్వకాలు (ఫైల్)



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో విచ్చలవిడిగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అనుయాయులు బినామీ పేర్లపై కొండలను, చెరువులను, వాగులను, తోటలను చెరబట్టి మరీ ఈ మైనింగ్ చేపట్టారు. వీటిపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలను కూడా ప్రచురించింది. పట్టిందల్లా బంగారమే అన్నట్టుగా కొండలు, చెరువులు, మామిడి తోటలు, పేదల భూములు.. అన్నింటినీ తమ అక్రమాల కోసం వాడుకున్నారు.

**వెదురుపావులూరులో పేలుళ్లు**

వెదురుపావులూరు కొండ ప్రాంతంలో అక్రమ క్వారీయింగ్ భారీగా జరిగింది. వెదురుపావులూరు, కొండపావులూరులో 300 ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న కొండ ప్రాంతాన్ని భారీ పేలుళ్లతో పిండి చేశారు. దీనికోసం డ్రిల్లింగ్ మెషీన్లను తెప్పించి కొండకు ఐదారు మీటర్ల లోతున రంధ్రాలు చేసి, అందులో పేలుడు పదార్థాలను నింపి బ్లాస్టింగ్‌లు చేశారు. ఈ బ్లాస్టింగ్‌లతో పురుషోత్తపట్నం, కొండపావులూరు ప్రాంతాలు దద్దరిల్లాయి.

దుమ్మూధూళి రేగటంతో స్థానికులు గగ్గోలు పెట్టారు. రాత్రిపూట వందలాది భారీ టిప్పర్లు తిరిగాయి. ఇందులో నాటి రెవెన్యూ అధికారుల హస్తం కూడా ఉంది. ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. అప్పట్లో రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులకు కూడా ఈ పాపంలో వాటాలు ఉండటంతో.. అడ్డుకున్న వారు లేకుండాపోయారు. ఇక్కడ జరిపిన తవ్వకాల ద్వారా కోట్ల రూపాయలను వంశీ అనుయాయులు సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**సూరంపల్లి తోకతిప్పను పిండేశారు**

సూరంపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 526లోని 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తోకతిప్పను కూడా వంశీ అనుయాయులు వదల్లేదు. గ్రామస్థులు అడ్డుపడినా, అడ్డుకునే ప్రయత్నాలు చేసినా లెక్క చేయలేదు. వ్యవస్థలను చేతుల్లో పెట్టుకుని తోకతిప్పను తవ్వేశారు. ఏడాది పాటు ఏకబిగిన తవ్వేయటం ద్వారా కోట్ల రూపాయలు ఆర్జించారు.

**మల్లవల్లిని మింగేశారు**

మల్లవల్లిలోని సర్వే నెంబర్ 11లో వంశీ అనుయాయులు 175 ఎకరాలను మిగతా 6లో..

### చెరువులను చెరపట్టారు

గన్నవరం నియోజకవర్గంలోని అనేక చెరువులను వంశీ అనుయాయులు చెరపట్టారు. నాలుగు మండలాల పరిధిలో 80 శాతానికి పైగా చెరువులను ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా తవ్వారు. కొండపావులూరులోని సర్వే నెంబర్ 144లోని ఎర్రచెరువు, బాపులపాడు మండలంలోని బిళ్లనపల్లి, రేమల్లెలోని ఊరచెరువు, వేలేరులోని ఊరచెరువు, కుంటలను 150 ఎకరాలకు పైగా తవ్వేశారు. గ్రామస్థులు అడ్డుకున్నా తవ్వకాలు ఆగలేదు. ఉంగుటూరులోని ఏ సీతారామపురం చెరువును రాత్రికి రాత్రే తవ్వేశారు. బాపులపాడు మండలంలోని కానుమోలులో ఉన్న 12 ఎకరాల చెరువును అడ్డగోలుగా తవ్వేశారు. గ్రామస్థులు పోరాడినా వదల్లేదు.

# కోటి ఎక్కడ?

### సత్యవర్ధన్ కేసులో కీలక నిందితుడు



వంశీ చేయి పట్టుకుని నడుస్తున్న కొమ్మా కోట్లు (ఫైల్)

**వంశీకి ప్రధాన అనుచరుడు**

- ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- మిగిలిన వారి కోసం కొనసాగుతున్న వేట

విజయవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ముదునూరు సత్యవర్ధన్ కేసులో మిగిలిన నిందితులు ఎక్కడున్నారు? ముఖ్యంగా సత్యవర్ధన్‌ను బెదిరించి, కిడ్నాప్‌కు రంగం సిద్ధం చేసిన వంశీ ప్రధాన అనుచరుడు కొమ్మా కోట్లు అలియాస్ కోటి ఎక్కడ దాక్కున్నాడు? వంశీ కేసులో ఉదయిస్తున్న ప్రశ్నలివి. సత్యవర్ధన్ కేసులో పటమట పోలీసులు వంశీతో పాటు నలుగురిని అరెస్టు చేశారు. దీంతో నిందితుల సంఖ్య ఐదుకు చేరింది. వంశీ చెప్పిన ప్రణాళికను అమలు చేసిన కొమ్మా కోట్లు కోసం పోలీసులు గాలిస్తున్నారు. సత్యవర్ధన్‌ను ట్రాప్‌లోకి దింపి బెదిరించడంలో అతడు కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది. తాజాగా వంశీ పీఏ ఘంటా వీర్రాజు, కారు డ్రైవర్ వంశీబాబును పోలీసులు అరెస్టు చేశారు. కేసులో మొత్తం 11 మంది నిందితులు ఉన్నట్టుగా పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఇందులో ఐదుగురికి పోలీసులు సంకెళ్లు వేశారు. మిగిలిన నిందితుల పేర్లు బయటకొస్తే వారు పరారయ్యే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

**రెండో కేసు ఉన్నట్టేనా..?**

వల్లభనేని వంశీ, ఆయన అనుచరులపై పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఇందులో క్రైం నెంబరు 86/2025ను మిగతా 6లో..

## వంశీని కఠినంగా శిక్షించాలి

- అవనిగడ్డలో దళిత సంఘాల నిరసన 6లో



నేరెళ్లపాలెంలో నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నేతలు

## సానుభూతి కరువు

**వంశీ అరెస్టుపై నోరెత్తని వైసీపీ శ్రేణులు**

- చోటా నాయకులు ఒకరిద్దరు తప్ప మిగతా వారంతా సైలెన్స్
- అరెస్టు నుంచి రిమాండ్ వరకూ కనిపించని ప్రధాన నేతలు
- సబ్‌జైల్లో ఉన్నా పరామర్శించేవారు లేరు
- వంశీ వ్యవహారంలో కార్యకర్తలు బలి
- కేసుల్లో చిక్కుకుని విలవిల

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అరెస్టుపై ఎక్కడా సానుభూతి వ్యక్తం కావట్లేదు. వైసీపీ మిగతా 6లో..

## పసిపాప చేసిన పెళ్లి

### ప్రేమికులను కలిపిన జగ్గయ్యపేట పోలీసులు

- ప్రేమించి, బిడ్డ పుట్టాక కాదన్న యువకుడు
- పోలీసులను ఆశ్రయించిన యువతి బంధువులు
- ఇరువర్గాల చర్చలతో సమస్య కొలిక్కి
- నవజాత శిశువును చంకనేసుకుని ఒక్కటైన జంట

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పండంటి పాప పుట్టి పుట్టగానే ఆ తల్లిదండ్రులకు ఒక్కటి చేసింది. ప్రేమ సాక్షిగా ఒక్కటైన తన అమ్మానాన్నలను తానే కలిపింది. ప్రేమికుల దినోత్సవం రోజు జరిగిన ఈ సంఘటన కాకతాళీయమే అయినా నవజాత శిశువును చంకనేసుకుని ఆ దంపతులు దండలు మార్చుకోవడం అందరినీ ఆనందానికి గురిచేసింది. వివరాల్లోకి వెళితే..

జగ్గయ్యపేటలోని విలియంపేటకు చెందిన ఓ యువతి (19), అనుమంచిపల్లికి చెందిన యువకుడు (21) కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఆ యువకుడు బంధువుల ఇంటికి సమీపంలో యువతి నివాసం ఉండటంతో పరిచయం కాస్త ప్రేమ.. ఆ తర్వాత శారీరక సంబంధానికి దారితీసింది. కొన్నిరోజులకు యువతి గర్భం దాల్చింది. కానీ, ఆ విషయం ఆమెకు తెలియలేదు. కడుపునొప్పి ఎక్కువ కావడంతో రెండు రోజుల క్రితం ఆమె స్థానిక ప్రైవేట్ నర్సింగ్ హోంకు వెళ్లింది. అక్కడ వాష్‌రూమ్‌లోకి వెళ్లిన యువతి ఓ పాపకు జన్మనిచ్చింది. దీంతో నర్సింగ్ హోమ్ వారు ఐసీడీఎస్‌కు సమాచారమిచ్చారు. ఈ వ్యవహారమంతా యువతి బంధువులకు తెలియడంతో ప్రేమించిన యువకుడిని నిలదీశారు. తొలుత అతడు పెళ్లికి అంగీకరించకపోవడంతో గురువారం యువతి బంధువులు జగ్గయ్యపేట పోలీసులను ఆశ్రయించారు. యువకుడి బంధువులకు కూడా విషయం తెలియడం, ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందినవారు కావటంతో చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని పోలీసులు నచ్చజెప్పారు. దీంతో శుక్రవారం ఇరుపక్షాల వారు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. యువకుడు నూతనంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణం పూర్తయ్యాక పెళ్లికి అంగీకరించాడని, వివాహం నిశ్చయం చేసుకున్నామని పోలీసులకు చెప్పారు. అయితే, పోలీసులు అక్కడే నిశ్చయ తాంబూలాలు ఇచ్చి ఇద్దరితో దండలు మార్పించడంతో ప్రేమకథ సుఖాంతమైంది.

# పక్కా ప్లాన్‌తో..

**ఎనికేపాడు గోడౌన్‌లో సెల్‌ఫోన్ల చోరీ కేసులో నిజాలు**

### ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌కు సహకరించిన యూట్యూబర్

- కీలక సూత్రధారి అతనేనని తేల్చిన పోలీసులు
- దొంగిలించిన ఫోన్లు నేపాల్‌లో విక్రయించడానికి స్కెచ్
- బిహార్‌లో పట్టుబడిన నిందితులను తీసుకొచ్చిన బెజవాడ పోలీసులు



యూపీ గ్యాంగ్ నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను చూపిస్తున్న సీపీ రాజశేఖరబాబు, ఇతర పోలీసు అధికారులు

విజయవాడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఎనికేపాడులోని గోడౌన్‌లో ఇన్‌గ్రాం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన యాపిల్ ఫోన్లను దొంగిలించిన కేసులో మరో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఆరుగురు సభ్యులున్న గ్యాంగ్‌తో చోరీ చేయించడం వెనుక ఉత్తరప్రదేశ్‌కు చెందిన సూత్రధారి ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. యూట్యూబర్‌గా ఉన్న రంజిత్ అనే యువకుడు ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ఈ గ్యాంగ్ ఇక్కడ చోరీ చేసినట్టు గుర్తించారు. ఈనెల ఐదో తేదీ అర్ధరాత్రి ఎనికేపాడులో ఉన్న గోడౌన్ నుంచి యాపిల్, వివో బ్రాండ్లకు చెందిన ఫోన్లు, యాక్సెసరీస్‌ను ఉత్తరప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్ చోరీ చేసిన విషయం తెలిసిందే. ఆ నిందితులను బిహార్ నుంచి పీటీ వారెంట్‌పై విజయవాడకు తీసుకొచ్చారు. వారి నుంచి రూ.2.52 కోట్ల విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీలు తిరుమలేశ్వరరెడ్డి, గౌతమీశాలి, క్రైమ్స్ ఏడీసీపీ రాజారావుతో కలిసి కమిషనరేట్‌లోని సమావేశపు హాల్లో శుక్రవారం వెల్లడించారు.

**గ్యాంగ్‌గా కలిసి..**

ఉత్తరప్రదేశ్‌లోని జాన్‌పూర్ జిల్లా జలాల్‌పూర్‌కు చెందిన దీప్‌చంద్ర ప్రజాపతి, సునీల్ కుమార్ సరోజ్, బ్రిజేష్ కుమార్ ఉగ్రా, సుంగున్‌పూర్‌కు చెందిన మాయా జైప్రకాష్ పటేల్, బస్వారా గ్రామానికి చెందిన మిథిలేష్ కుమార్, బోడిపూర్‌కు చెందిన సురేంద్ర కుమార్ పటేల్ స్నేహితులు. ప్రజాపతి ఇంటర్ వరకు చదువుకుని సొంతంగా కారు ట్రావెల్స్ ఏర్పాటు చేసుకున్నాడు. యూపీ62సీకే 1404 కారు నడుపుతున్నాడు. జైప్రకాష్ కూలీ పనులు చేసుకుంటూ చోరీలు చేసేవాడు. అతడిపై ఎక్కడా కేసులు నమోదు కాలేదు. సునీల్‌కుమార్ సరోజ్, బ్రిజేష్ కుమార్ ఉగ్రా మిగతా 6లో..

**రంజిత్ ఎక్కడ?**

ఈ ఆరుగురిలో ప్రజాపతి ఓ ప్రతిపాదన చేశాడు. తన కారులో వివిధ రాష్ట్రాలు తిరుగుతూ చోరీలు చేద్దామని, దానికయ్యే ఇంధనం ఖర్చును మిగిలిన ఐదుగురు భరించాలని చెప్పాడు. దీంతోపాటు కాజేసిన సొత్తును విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తంలో వాటా ఇవ్వాలని ప్రతిపాదించాడు. దీనికి మిగిలిన వారంతా అంగీకరించారు. ఈ తరుణంలో యూపీకి చెందిన యూట్యూబర్ రంజిత్ వారికి పరిచయమయ్యాడు. సాంకేతికంగా నైపుణ్యంగా ఉన్న అతడు ఈ గ్యాంగ్‌కు ఎనికేపాడులో ఉన్న గోడౌన్ లొకేషన్ ఇచ్చాడు. అందులో సెల్‌ఫోన్లు ఉంటాయని, వాటిని కాజేసి తీసుకొస్తే నేపాల్‌లోని ఖాట్మండులో విక్రయించేద్దామని ప్రతిపాదించాడు.

### ● హెల్మెట్.. చాక్లెట్..



హెల్మెట్‌ధారణపై ట్రాఫిక్ పోలీసులు రోజురోజుకూ వినూత్న కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. తాజాగా శుక్రవారం నగరంలో హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న వారికి చాక్లెట్లు పంచారు.

## స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో జిల్లా ఫస్ట్

**సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రకటించిన ర్యాంకులు**

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం 200 పాయింట్లకు గానూ 129 పాయింట్లతో ఈ ఘనత సాధించింది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్‌శాఖ చేపట్టిన కార్యక్రమాలపై శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 14 ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాలకు ర్యాంకులను ప్రకటించారు. పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో డోర్ టు డోర్ కలెక్షన్‌కు 15 పాయింట్లు, చెత్త సెగ్రిగేషన్‌కు 35 పాయింట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు, వ్యర్థాల తొలగింపునకు 10 పాయింట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 10 పాయింట్లు, పంచాయతీరాజ్ శాఖలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి 15 పాయింట్లు, పబ్లిక్ టాయ్‌లెట్లకు 10 పాయింట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్స్‌కు 10 పాయింట్లు, నూరుశాతం డోర్ టు డోర్ కలెక్షన్‌కు 10 పాయింట్లు, ఓడీఎఫ్ ప్లస్ మోడల్‌కు 20 పాయింట్ల చొప్పున మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు ప్రకటించారు. ఈ పాయింట్ల పట్టికలో ఎన్టీఆర్ జిల్లా ముందు వరసలో ఉండటం విశేషం.

# మొండి బకాయిలు



### పట్టించుకోని ఉద్యోగులు

- దుర్గగుడి షాపుల అద్దె బకాయిలు రూ.1.50 కోట్లు
- నిర్లక్ష్యంగా లీజు అండ్ లీగల్ విభాగం ఉద్యోగులు
- నోటీసులతో సరి.. పేరుకుపోతున్న బకాయిలు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం లీజు అండ్ లీగల్ విభాగంలో కొందరు ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా ఆలయ ఆదాయానికి గండి పడుతోంది. దేవస్థానానికి చెందిన షాపుల అద్దె బకాయిలు వసూలు చేయటంలో వీరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఈ ఏడాది జనవరి వరకు సుమారు రూ.1.50 కోట్లకు బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది. వీటిపై షాపుల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి.

**భారీగా బకాయిలు**

ఈ ఏడాది జనవరి వరకు... మహామండపం ఐదో అంతస్థులో ఉన్న షాపులు, కనకదుర్గానగర్‌లో ఉన్న షాపులతో పాటు గతంలో షాపులు నిర్వహించి అద్దెలు చెల్లించకుండా ఉన్నవి మొత్తం కలిపి రూ.1.50 కోట్ల వరకూ బకాయిలు పేరుకుపోయినట్లు దేవస్థానం అధికారులు చెబుతున్నారు. ఓ వైసీపీ నాయకుడు రెండు షాపులు నిర్వహించి సుమారు రూ.30 లక్షల వరకు బకాయి పడ్డట్టు తెలుస్తోంది. అతను బకాయిలు చెల్లించకుండా, మిగిలిన లీజుదారులను కూడా చెల్లించనీయకుండా చేస్తున్నాడనే విమర్శలు కూడా వస్తున్నాయి. సదరు వైసీపీ నాయకుడికి దుర్గగుడి లీజు అండ్ లీగల్ విభాగంలో పలువురు ఉద్యోగుల అండ దండలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

**వసూలులో తాత్సారం**

కనీసం మొండి బకాయిలు వసూలు చేయటంలో కూడా లీజు అండ్ లీగల్ విభాగం ఉద్యోగులు తాత్సారం చేయటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. షాపుల అద్దెలు రూ.1.50 కోట్ల వరకూ పేరుకుపోవటంపై దేవస్థానం ఉద్యోగులే ఆశ్చర్యపోతున్నారు. అద్దెదారులకు కేవలం ఒకటి రెండుసార్లు బకాయిలు చెల్లించాలని నోటీసులిచ్చి చేతులు దులుపుకొంటున్నారు తప్ప, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. ఈ విభాగంలో పలువురు ఉద్యోగులు ఏళ్ల తరబడి విధులు నిర్వహించటం వల్ల అద్దెదారులతో లాలూచీ పడుతున్నట్లు కూడా బహిరంగంగా విమర్శలు వస్తున్నాయి. దేవదాయ శాఖ కమిషనర్, ప్రస్తుత ఈవో కె.రామచంద్రమోహన్ ప్రత్యేక దృష్టిసారించి దేవస్థానం షాపుల అద్దె బకాయిలు వసూలు చేయటానికి చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

**షాపు యజమానులకు లీగల్ నోటీసులు**

బకాయిలు పడిన షాపులను నిర్వహించిన పాత యజమానులకు లీగల్ నోటీసులు సిద్ధం చేస్తున్నట్లు లీజు అండ్ లీగల్ విభాగం ఏఈవో దుర్గారావు చెప్పారు. ప్రస్తుత యజమానులకు కూడా ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, మరో దఫా కూడా నోటీసులు ఇస్తామన్నారు.

## గాల్లో ప్రాణాలు..!

**అత్యవసర సమయంలో అందని వైద్యం**

- అందుబాటులో లేని ట్రామా కేర్ యూనిట్లు
- నందిగామ, జగ్గయ్యపేటల్లో భారీగా పరిశ్రమలు
- క్వారీలు, క్రషర్లతో ప్రమాదమే.. 6లో



## నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

- మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు 8లో

కొద్ది నెలల క్రితం జగ్గయ్యపేట ప్రాంతంలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదం జరగ్గా, పదిమందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వైద్యం కోసం బాధితులను 90 కిలోమీటర్లకు పైగా దూరంలో విజయవాడ తరలించాల్సి వచ్చింది.

కంచికచర్ల మండలం పరిటాల పరిధిలోని రాతి క్వారీల్లో, క్రషర్లలో తరుచుగా ప్రమాదాలు జరుగుతుంటాయి. వైద్యం కోసం క్షతగాత్రులను విజయవాడ తరలించటం తప్పితే దగ్గర్లో తగిన సదుపాయాలతో కూడిన ఆసుపత్రి లేదు.

నందిగామ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో రాష్ట్ర సరిహద్దు గరికపాడు నుంచి కంచికచర్ల వరకు జాతీయ రహదారిపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహన ప్రమాద బాధితులకు సకాలంలో మెరుగైన వైద్యం అందటం లేదు.

ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంట (గోల్డెన్ అవర్) ఎంతో విలువైనది. బాధితులు, క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందని పక్షంలో ప్రాణాలకు ప్రమాదం. దగ్గర్లో ట్రామా కేర్ యూనిట్ ఉంటే ప్రాణాలు కాపాడవచ్చు.

# గాల్లో ప్రాణాలు!





## అత్యవసర సమయంలో అందని వైద్యం

- అందుబాటులో లేని ట్రామా కేర్ యూనిట్లు
- నందిగామ, జగ్గయ్యపేటల్లో భారీగా పరిశ్రమలు
- క్వారీలు, క్రషర్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయి
- ప్రమాదాలు జరిగితే చాలా సమస్యలు

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల)

నందిగామ, జగ్గయ్యపేటల్లో ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుకు ఏలికలు తగిన శ్రద్ధ చూపటం లేదు. ప్రధానమైన ఏరియా ఆసుపత్రులు, రిఫరల్ ఆసుపత్రులుగా ఉన్నాయి తప్పితే గాయాలపాలై నెత్తురోడుతున్న వారికి, కాళ్లు, చేతులు విరిగిన వారికి వైద్యం అందించలేకపోతున్నాయి.

**సరిహద్దులో ప్రమాదాలు..**

తెలంగాణ రాష్ట్ర సరిహద్దు గరికపాడు నుంచి విజయవాడ 90 కిలోమీటర్లు. ఈ 65వ నెంబరు జాతీయ రహదారి జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా అభివృద్ధి చేసినప్పటికీ ఇటీవల కాలంలో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. హైస్పీడ్ వాహనాలు అందుబాటులోకి రావటంతో ప్రమాదాల తీవ్రత కూడా ఎక్కువగా ఉంటున్నది. గ్రామీణ ప్రాంతాల రోడ్లు కూడా నెత్తురోడుతున్నాయి. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోతుండటంతో ఆటోలు, ద్విచక్ర వాహనాల ప్రమాదాలకు కొదవ లేదు. ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదం జరుగుతూనే ఉంది. ప్రతి ఏడాది లెక్కకు మించి ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో క్షతగాత్రుల సంఖ్య వందలు దాటుతున్నది. నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో పలు సిమెంట్ కార్మాగారాలు, ఫార్మా అండ్ కెమికల్స్ ఫ్యాక్టరీలు, పదుల సంఖ్యలో రాతి క్వారీలు, క్రషర్లతో పాటుగా ఇతరత్రా పలు కార్మాగారాలు, సంస్థలు ఉన్నాయి. ప్రమాదం తర్వాత క్షతగాత్రులకు మొదటి గంట ఎంతో విలువైనది. సకాలంలో మెరుగైన వైద్యం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే గరికపాడు నుంచి విజయవాడ మధ్యలో ఎక్కడా ట్రామాకేర్ సెంటర్ లేదు. నందిగామ, జగ్గయ్యపేటల్లో ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

ట్రామాకేర్ సెంటర్లలో మెరుగైన వైద్యానికి సంబంధించి అన్ని సదుపాయాలు ఉంటాయి. క్షతగాత్రులకు సకాలంలో మెరుగైన వైద్యం అందుతుంది. దాదాపుగా దశాబ్దం క్రితం జగ్గయ్యపేటలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటుగా ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు స్వామి రామానంద ట్రస్టు ముందుకొచ్చింది. అప్పట్లో జిల్లా అధికారులు తగిన స్థలం కూడా పరిశీలించారు. ప్రభుత్వం నుంచి స్పందన లేక ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు.

రిఫరల్ ఆసుపత్రులుగా ఏరియా ఆసుపత్రులు నియోజకవర్గ కేంద్రాలైన నందిగామ, జగ్గయ్యపేట పట్టణాల్లో వైద్య విధానపరిషత్ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రులు నడుస్తున్నాయి. ఈ రెండు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసదుపాయలు లేవు. ఆర్థోపెడిక్ వైద్యులున్నప్పటికీ తగిన ఆధునాతన ఎక్విప్‌మెంట్ లేనందున ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందటం లేదు. నాలుగు కుట్లు వేసి, ప్రథమ చికిత్స చేసి విజయవాడ రిఫర్ చేస్తున్నారు. దీంతో ఏరియా ఆసుపత్రులు రిఫరల్ ఆసుపత్రులుగా ఉన్నాయన్న విమర్శలు వస్తున్నాయి. విజయవాడ తీసుకువెళ్లే లోగా పుణ్యకాలం కాస్తా గడిచిపోతున్నది.

**పాలకులు స్పందించాలి**

ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటు విషయంలో పాలకులు, ఉన్నతాధికారుల ఆలోచన దృక్పథం మారాలి. జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను పోలీస్, రవాణాశాఖ, జాతీయ రహదారుల శాఖ అధికారులు గుర్తిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకునేందుకు రోడ్డు భద్రతా కమిటీ పలు సూచనలు చేస్తున్నది. అయితే ఎంతో ప్రాధాన్యత కల్గిన ట్రామా కేర్ సెంటర్ల గురించి మాత్రం ఎందుకు ఆలోచించటం లేదో అర్థం కావటం లేదు. క్షతగాత్రులకు వైద్యం అందించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. కాగా నందిగామలో ఆధునిక వసతులతో కూడిన వంద పడకల ఆసుపత్రికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ. 34.48 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. ఇందులో ట్రామా కేర్ సెంటర్ కూడా ఉందని అంటున్నారు.

---



దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

## సంజీవయ్య సేవలు శ్లాఘనీయం

**ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) :** మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య రాష్ట్రానికి చేసిన సేవలు ఆదర్శనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సంజీవయ్య జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శ్రీనివాస శిరోమణి తదితరులు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దామోదరం సంజీవయ్య నిరాడంబరత, నిజాయితీ, కార్యదక్షత నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

## గుడివాడ టీడీపీ పరిశీలకురాలిగా నూకానమ్మ



**నందిగామ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) :** నందిగామకు చెందిన బీసీ మహిళా నాయకురాలు యలగాల నూకానమ్మను గుడివాడ నియోజకవర్గ పరిశీలకులుగా నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి పని చేసి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు.

## ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** స్టాఫ్ సెలెక్షన్ కమిషన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని పట్టణానికి చెందిన ఒక యువతి వద్ద రూ.5 లక్షలు తీసుకుని మొహం చాటేసిన జమ్ము కాశ్మీర్ సరిహద్దులో పనిచేస్తున్న చిల్లకల్లుకు చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ కారుపాటి జయకుమార్ (40)పై జగ్గయ్యపేట ఎస్సై 2 వెంకటేశ్వరరావు శుక్రవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. విలియంపేటకు చెందిన కొండ్రు పూర్ణిమ (25)ను ఎస్ఎస్‌సీ (స్టాఫ్ సెలెక్షన్ కమిషన్)లో తాను మంచి ఉద్యోగం ఇప్పిస్తానని 2022 నుంచి దశల వారీగా రూ. 5 లక్షలు తీసుకున్నాడని, నాలుగు నెలలుగా గట్టిగా ప్రశ్నిస్తే డబ్బులు వెనక్కి ఇచ్చేస్తానని చెప్పి ఇవ్వటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

## ఆలయాల్లో ఆడిట్ విధానం ఒకేలా ఉండాలి

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో ఆడిట్ విధానం ఒకే తీరులో ఉండాలని రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్, దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్ ఆడిట్ అధికారులకు సూచించారు. శుక్రవారం దేవస్థానంలోని తన ఛాంబర్‌లో ఆయన రాష్ట్ర, జిల్లా ఆడిట్ అధికారులు, దుర్గగుడి ఇంజనీరింగ్ అధికారులు, ఏఈఓలతో ఆడిట్ విధానం పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గగుడిలో జరుగుతున్న ఆడిట్ విధానంపై ఆడిట్ వివరాలు తెలుసుకున్నారు.

## సానుభూతి కరువు

(5వ పేజీ తరువాయి)

హయాంలో చంద్రబాబు కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వంశీపై ఇప్పటికే తప్పు చేశారన్న ముద్ర ఉంది. గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి సరైనది కాదన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. దీంతో ఆయన అరెస్టుపై వైసీపీ నుంచి కూడా పెద్దగా స్పందన రావట్లేదు. వంశీ అరెస్టయ్యాక కృష్ణలంక పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చినప్పుడు జిల్లాకు చెందిన ఒకరిద్దరు చోటా నేతలు వచ్చారే తప్ప పెద్దగా ఎవరూ కనిపించలేదు. ఈ అరెస్టుపై వైసీపీ శ్రేణులు కూడా గొంతెత్తలేకపోతున్నాయి.

**కార్యకర్తలే పావులుగా..**

గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో కీలక సూత్రధారి వంశీనే. ఈ దాడికి ఆయన పథక రచన చేయటం, దానిని స్వయంగా సమీక్షిస్తూ అమలు చేయటం వంటి పరిణామాల్లో అప్పట్లో ఉత్సాహంగా పాల్గొన్నా.. అది తప్పన్నది చాలామంది కార్యకర్తలు అనుకున్నారు. ఎన్నికల్లో ఓడిపోయాక అప్పట్లో దాడిలో పాల్గొన్న వారంతా ఇప్పుడు ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుండటంతో వైసీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. వంశీ అండ్ గ్యాంగ్ వ్యవహారాల్లో తలదూర్చిన పాపానికి ఆ పార్టీకి చెందిన సామాన్య కార్యకర్తలు కూడా అరెస్టు కావాల్సి వచ్చింది. ఆరోజు అధికారం ఉంది కదా.. అని వంశీ అండ్ గ్యాంగ్‌కు సహకరించిన వారికి ఇప్పుడు చట్టం ద్వారా శిక్ష పడింది. చాలామంది కుటుంబాలకు దూరంగా అజ్ఞాతంలో ఉంటున్నారు. వారిని కూడా పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేస్తుండటంతో బెయిల్ కోసం రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. వంశీ అరెస్టు నుంచి కోర్టు రిమాండ్ విధించడం వరకూ శుక్రవారం రోజంతా సమయం పట్టినా ఎక్కడా హడావిడి జరగలేదు. వంశీని చూడటానికి శుక్రవారం నాయకులెవరూ సబ్‌జైలుకు రాకపోవడం ఈ పరిణామాలకు ఊతమిస్తోంది.

---

## ఎన్నికల్లో ప్రిసైడింగ్ ఆఫీసర్ల పాత్ర కీలకం

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



బ్యాలెట్ బాక్స్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్లు, చిత్రంలో కలెక్టర్ లక్ష్మీశ

**వన్‌టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) :** ఎన్నికల్లో ప్రిసైడింగ్ ఆఫీసర్లు (పి.ఒ), సహాయ ప్రొసైడింగ్ ఆఫీసర్ల (ఎ.పి.ఒ) పాత్ర కీలకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొననున్న 272 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, సహాయ ప్రిసైడింగ్ ఆఫీసర్లతో శుక్రవారం తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్‌కు ముందు అనుసరించాల్సిన విధి విధానాల గురించి ఆయన వివరించారు. పోలింగ్ స్టేషన్ ఏర్పాటు, నిర్వహణ, పోలింగ్‌కు అవసరమైన సామగ్రి సేకరణ, బ్యాలెట్ బాక్సులు, ఇతరత్రా సంబంధిత అంశాలపై అవగాహన ఉండాలని ఆయన పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియలో ఎటువంటి సమస్యలు ఎదురవుతాయో అన్న దానిపై వివరిస్తూ వాటిని ఎలా అధిగమించాలని కూడా శిక్షణ కార్యక్రమం ద్వారా తెలుసుకోవాలన్నారు. ఇంతకు ముందు పాల్గొన్నప్పటికీ ప్రతి ఎన్నికల సమయంలో కూడా కొత్తగానే ఉంటుందన్నారు. అప్రమత్తంగా ఉండి ఏ సమస్యలు వచ్చినా ఎదుర్కొనగలగాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని అంశాల్లోనూ జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డీఆర్వో, సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, ఎలక్షన్ విభాగంసూపరిటెండెంట్ చంద్రమౌళి, మాస్టర్ ట్రైనర్లు బి.బసవేశ్వరరావు, ఎస్.కె.సైదా సాహెబ్, కె.రాజశేఖర్, జె.రామకృష్ణ, ఎండీ హుస్సేన్, ఎండీ రఫీ, వి.కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆస్టర్ రమేష్ ఆసుపత్రి వైద్యులు, పిల్లలతో తల్లిదండ్రులు

## ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో 5500 మంది పిల్లలకు గుండె చికిత్సలు

▸ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు

**భారతీనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) :** తమ ఆసుపత్రిలో ఇప్పటివరకు 5500 మంది పిల్లలకు గుండె సంబంధిత చికిత్సలు అందించినట్టు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు తెలిపారు. రమేష్ హాస్పిటల్‌లో చిన్నిపిల్లల గుండెజబ్బుల వైద్యవిభాగం ఆధ్వర్యంలో పుట్టుకతో వచ్చే గుండె జబ్బులపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. సదస్సులో చిన్నపిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ జ్యోతి ప్రకాష్ రెడ్డి, డాక్టర్ కత్తుల అనూష, డాక్టర్ భరత్ సిద్ధార్థ పాల్గొన్నారు. అనంతరం చికిత్స పొందిన పిల్లలకు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ, చిన్నపిల్లలకు గుండె సంబంధిత శస్త్రచికిత్స చేయడం ఎంతో క్లిష్టమైన ప్రక్రియ అన్నారు. ఇది అధునాతన వైద్య పరికరాలు, నైపుణ్యం, సమగ్రమైన టీంవర్క్ అవసరమయ్యే చికిత్సల్లో ఒకటిగా గుర్తించబడిందన్నారు. హాస్పిటల్‌లో ప్రత్యేక చిన్న పిల్లల గుండె వైద్యవిభాగం ఇప్పటివరకు 5500 మంది పిల్లలకు గుండె సంబంధిత చికిత్సలు అందించి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిందన్నారు.కార్యక్రమంలో గుండె జబ్బులకు శస్త్రచికిత్సలు, డివైస్ చికిత్సలు చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు మొత్తం 100 మంది పాల్గొని వారి అనుభవాలను తెలిపారు. కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్స్ చీఫ్ ప్రొక్యూర్మెంట్ ఆఫీసర్ మహేంద్రబాబు, సీనియర్ వైద్యనిపుణులు డాక్టర్ వసుంధరాదేవి, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ రాజు పాల్గొన్నారు.

## కోటి ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

పట్టాలెక్కించారు. ఈ కేసులో అరెస్టు చేసిన నిందితులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ కేసులో సత్యవర్ధన్ సోదరుడు కిరణ్ ఫిర్యాదుదారుడిగా ఉన్నాడు. ఇదికాకుండా క్రైం నెంబరు 84/2025తో మరో కేసును పోలీసులు నమోదు చేశారు. టీడీపీకి చెందిన బీసీ, ఎస్సీ, మైనారిటీ నాయకులు చేసిన ఫిర్యాదుపై ఈ కేసును నమోదు చేశారు. ఒక కేసులో అరెస్టులు కొంత వరకు జరగడంతో, రెండో కేసును పోలీసులు పైకి తీస్తారా లేదా అనే ప్రశ్న వస్తోంది. ఓపక్క మొదటి కేసులో మిగిలిన నిందితుల కోసం వేట సాగిస్తున్న పోలీసులు, ప్రధాన నిందితుడు వంశీని కస్టడీలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించిన పిటిషన్‌ను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో శుక్రవారం దాఖలు చేశారు. వాస్తవానికి వంశీతో పాటు మిగిలిన ఇద్దరు నిందితులను పోలీసులు నాల్గో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కస్టడీ పిటిషన్‌ను పోలీసులు ఈ కోర్టులోనే దాఖలు చేయాల్సి ఉంటుంది. వంశీ కేసులో అట్రాసిటీ సెక్షన్లు ఉండటంతో కస్టడీకి ఇవ్వాలా వద్దా అనే నిర్ణయాన్ని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు నిర్ణయిస్తుంది. ఈ కారణంగా పోలీసులు కస్టడీ పిటిషన్‌ను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో దాఖలు చేశారని తెలుస్తోంది. వంశీ అరెస్టు ప్రభావంతో కేసులో ఉన్న నిందితులు రాష్ట్ర సరిహద్దులు దాటినట్టు ప్రచారం జరుగుతోంది. సాంకేతిక పరిజ్ఞానంతో వారి ఆచూకీని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

## అవినీతి కొండలు

(5వ పేజీ తరువాయి)

అడ్డగోలుగా తవ్వేశారు. మల్లవల్లి గ్రావెల్‌ను గుడివాడ, బందరుకు భారీ ఎత్తున తరలించారు. పోర్టు పనుల పేరుతో భారీ ఎత్తున గ్రావెల్‌ను తవ్వుకుపోయారు.

**ముస్తాబాద, చనుపల్లివారిగూడెం కొండలపై కన్ను**

గన్నవరం మండలం పరిధిలోనే ముస్తాబాద, చనుపల్లివారిగూడెం కొండలను కూడా వంశీ అనుయాయులు అనధికారికంగా చేజిక్కించుకున్నారు. ఈ కొండల తవ్వకాలపై స్థానికులు అభ్యంతరాలను వ్యక్తంచేసినా పెడచెవిన పెట్టారు. అర్ధరాత్రి సమయంలోనే కొండలను పిండిచేశారు. లక్షల క్యూబిక్ మీటర్ల మేర గ్రావెల్‌ను తన్నుకుపోయారు.

**మామిడి తోటలను మాయం చేశారు**

గ్రావెల్ నిక్షేపాలు కలిగిన మామిడి తోటలను కూడా వంశీ అనుచరులు వదల్లేదు. రంగన్నగూడెం, సింగన్నగూడెం గ్రామాల్లోని మామిడి తోటల నేలలు గ్రావెల్‌తో కూడుకుని ఉండటం వల్ల వాటిని కూడా వంశీ అనుయాయులు వాటాల ప్రాతిపదికన చేజిక్కించుకుని తవ్వేశారు. దాదాపు 15 మీటర్ల మేర గ్రావెల్‌ను తవ్వేసి సొమ్ము చేసుకున్నారు.



అక్రమ తవ్వకాల అనంతరం వీరవల్లి చెరువు

**డీ పట్టాలనూ వదల్లేదు**

గన్నవరం నియోజకవర్గంలో పేదలకు ఇచ్చిన సాగు పట్టాలను, ప్రజలు ఆక్రమించుకున్న భూములు ఏమైనా ఉంటే వాటిని కూడా తమ గుప్పెట్లోకి తీసుకున్నారు. ఇలా తీసుకున్న భూముల్లో మట్టిని అడ్డగోలుగా తవ్వేశారు. కొండపావులూరులో సర్వే నెంబర్ 33, 34, 62లో పెద్దసంఖ్యలో భూములను లీజుకు తీసుకుని 35 మీటర్ల లోతున మట్టిని తరలించారు. మట్టిని ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకున్నారు.

---

## వంశీని కఠినంగా శిక్షించాలి

▸ దళిత సంఘాల నేతల నిరసన

**అవనిగడ్డ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) :** గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎస్సీ యువకుడు సత్యవర్ధన్‌ను నిర్బంధించి వేధించిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీని కఠినంగా శిక్షించాలని అవనిగడ్డలో దళిత సంఘాలు నిరసన చేపట్టాయి. శుక్రవారం నేరెళ్లపాలెంలోని బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద ఎస్సీ నేతలు నివాళులర్పించి అనంతరం వంశీని కఠినంగా శిక్షించాలంటూ నిరసన తెలియజేశారు. వైసీపీ పాలనలో దళితులపై యథేచ్ఛగా దాడులు జరిగాయని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా వైసీపీ నేతలు తమ ధోరణిని మార్చుకోకుండా దళితులపై దాడులు కొనసాగిస్తారనటానికి గన్నవరం ఉదంతమే ఉదాహరణ అని దళిత సంఘాల నేతలు అన్నారు. సత్యవర్ధన్, అతని కుటుంబసభ్యులను వంశీ హైదరాబాద్ తీసుకెళ్లి ఓ ఫామ్‌హౌస్‌లో నిర్బంధించి నాలుగు రోజులపాటు చిత్రహింసలు పెట్టి కోర్టులో వాంగ్మూలాన్ని మార్చి చూపించారని, అలాంటి వ్యక్తి బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేయటంతోపాటు వారికి రక్షణ కూడా లేకుండాపోతుందని, విచారణ పూర్తయ్యే వరకు వంశీని రిమాండ్‌లోనే ఉంచి ఆయనను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కైతేపల్లి కృష్ణారావు, పులవర్తి దేవదాస్, బండెల సుబ్బారావు, మునిపల్లి రాంబాబు, నలుకుర్తి అశోక్, నలుకుర్తి చంద్రశేఖర్, పైడిపాముల శేఖర్, కొల్లూరి రాజశేఖర్, నలుకుర్తి నగధర్, బండెల ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నేతలకు కోడ్ వర్తించదా

**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** కలెక్టర్ లక్ష్మీశ పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి భర్త, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్‌తో కలిసి పర్యటించి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించారని పెనుగంచిప్రోలు మాజీ సర్పంచ్, జిల్లా టీడీపీ కార్యదర్శి జిల్లేపల్లి సుధీర్‌బాబు ఆరోపించారు. సుధీర్‌బాబు శుక్రవారం కలెక్టర్ పర్యటన అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కలెక్టర్‌ను తనతో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య, మాజీ జడ్పీటీసీ గజ్జి కృష్ణమూర్తిలు కలిసి ఇటీవల వచ్చిన వరదలకు పెనుగంచిప్రోలు ఎత్తిపోతల పథకం దెబ్బతినిపోవడంతో కలెక్టర్ దృష్టికి తెచ్చామని, దీంతో ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మీరు ఎత్తిపోతల పథకం వద్దకు రాకూడదని చెప్పడంతో తాము ఆగిపోయామన్నారు. టీడీపీ వారికి వర్తించిన ఎన్నికల కోడ్ వైసీపీ నేతలకు వర్తించదా అని సుధీర్‌బాబు ప్రశ్నించారు. ఈవిషయంలో జిల్లా కలెక్టర్‌ను కొందరు అధికారులు తప్పుదోవ పట్టించారని జిల్లేపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ తప్పుదోవ పట్టించిన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## అమరావతి ఫ్రీ జోన్‌గా ప్రకటించాలి

ఏఐవైఎఫ్ డిమాండ్

**కృష్ణలంక, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) :** అమరావతి రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్ చేసి 26 జిల్లాల నిరుద్యోగులకు రాజధాని ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలకు అవకాశం కల్పించాలని, మెగా డీఎస్సీ విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, జాతీయ కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జూమ్ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఎం.గంగాధర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పించాలని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్‌లు నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి వుంటుందని మెగా డీఎస్సీ మీద తొలి సంతకం చేస్తామని వచ్చిన ఆరు నెలల్లో నిరుద్యోగ భృతి ఇవ్వడంతో పాటుగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పనే ధ్యేయంగా 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఆ మాటను మరిచారన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకుడు రాజేంద్రబాబు, జి.సంతోష్, కె.శ్రీనివాసులు, సిహెచ్.గీత, టి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కా ప్లాన్‌తో..

(5వ పేజీ తరువాయి)

ఆర్టీవో కార్యాలయంలో ఏజెంట్లు పనిచేస్తున్నారు. ఈ ఇద్దరూ కలిసి చోరీలు చేసేవారు. సురేంద్ర కుమార్ పటేల్ కూలీ పనులు చేసుకుంటూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆరుగురు కలిసి ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు.

**సరిహద్దులు దాటితే చాలనుకుని..**

నిందితులకు స్కెచ్ ఇచ్చిన రంజిత్ ఇంకా అనేక విషయాలు వివరించాడు. సరుకుతో ఆంధ్రా సరిహద్దు దాటేయండి, ఆ తర్వాత ఎవరూ పట్టుకోలేరని చెప్పాడు. సెల్‌ఫోన్ల చోరీని ఆంధ్రా పోలీసులు పెద్దగా పట్టించుకోరని సలహా ఇచ్చాడు. దీంతో ఈ ఆరుగురు ఎనికేపాడులోని గోడౌన్‌లో చోరీ చేసి వెళ్లిపోతుండగా, బిహార్ సరిహద్దులో సాసారం వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారిని అక్కడ కోర్టులో హాజరుపరిచాక పీటీ వారెంట్‌పై ఇక్కడికి తీసుకొచ్చారు. బిహార్ పోలీసులు విచారించినప్పుడు తమ వెనుక సురేంద్రకుమార్ అనే వ్యక్తి ఉన్నాడని చెప్పిన నిందితులు విజయవాడ పోలీసులకు రంజిత్ పేరును వెల్లడించారు. ఈ రంజిత్ కుమార్ తేల్చే పనిలో పోలీసులు ఉన్నారు.

# విజయవాడ తూర్పు



**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 120,129, 140 |
| చికెన్ విత్ స్కిన్ | 230 |
| చికెన్ స్కిన్‌లెస్ | 240 |

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

### ఇరువురికి ఆర్థికసాయం

మొగల్రాజపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తండ్రి మరణించిన బాలికలకు, స్వయం ఉపాధి నిమిత్తం ఒకరికి టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతికుమార్ శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. 8వ డివిజన్ ఇశ్రాయేల్‌పేటకు చెందిన పచ్చగళ్ల యోనారాజు మరణించడంతో ఆయన ఇరువురు పిల్లల చదువు నిమిత్తం రూ. 25వేలను క్రాంతికుమార్ వారి ఇంటికి వెళ్లి అందించారు. అదే ప్రాంతానికి చెందిన కర్ర ఎస్తేరమ్మ బడ్డీలోకి సరుకుల కొనుగోలు రూ. 3వేలు సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి మల్లెల రామకృష్ణ, బద్దూరి వీరారెడ్డి, మెరకనపల్లి నాగేశ్వరరావు, ఆర్ జైహింద్‌రావు, బొప్పూరి బావనీ, కర్రా సురేష్, యోహాన్ పాల్గొన్నారు.

సింగిల్ యూజ్డ్
## ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించండి

కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర

కార్పొరేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై నగర ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని నగర కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువులు, ప్రత్యామ్నాయంగా పర్యావరణ హితమైన వస్తువులకు సంబంధించి ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర పలువురు అధికారులతో ఆయా స్టాల్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి సర్కిల్ పరిధిలో ఇటువంటి స్టాల్స్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణహితమైన వస్తువులే వాడాలని, ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువుల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లను కొలిచే స్క్రూగేజ్‌తో ప్లాస్టిక్ కవర్లను స్వయంగా తానే కొలిచి చూశారు. 120 మైక్రోన్ల కంటే తక్కువగా ఉన్న సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులు భూమిలో కలవకుండా పర్యావరణానికి హాని కల్పించేవని అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాస్టిక్ కవర్ నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

### వెటర్నరీ కాలనీలో కమిషనర్ పర్యటన

భారతీనగర్: నగర పర్యటనలో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం వెటర్నరీ కాలనీలో పర్యటించారు. ఈ పర్యటనలో కాలనీలోని వీఎంసీ పార్కులను సందర్శించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని, వారి సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ కమ్యూనిటీ హాల్లో ఉన్న ప్లేగ్రౌండ్‌ను పరిశీలించి, ప్రజలు ఆడుకునేందుకు వీలుగా మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. మదర్ థెరెస్సా జంక్షన్ ప్రాంతాలన్నీ పర్యటించి డ్రెయిన్లలో పూడికలను ఎప్పటికప్పుడు తీస్తూ, తీసిన పూడికలన్నీ వెంటనే తీసివేసి పరిశుభ్రంగా ఉంచాలని, నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు మీద ఉన్న పాత వాహనాలను తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్‌ఈ (ప్రాజెక్ట్) పి.సత్యకుమారి, ఈఈ జి.సామ్రాజ్యం పాల్గొన్నారు.

## చేనేతను ప్రోత్సహించడమే లక్ష్యం

గ్రామీణ భారత మహోత్సవం-ఆంధ్రప్రదేశ్-2025 ప్రారంభోత్సవంలో కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం కలిగిన కళాకారులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవనోపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా 'గ్రామీణ భారత్ మహోత్సవ్- ఆంధ్రప్రదేశ్ 2025'ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విజయవాడలోని మారిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ , నాబార్డు సీజీఎం ఎం.ఆర్.గోపాల్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాబార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం విజయవాడ ఏటా నిర్వహి స్తున్నట్లే ఈ ఏడాది కూడా రాష్ట్రస్థాయి చేనేత, హస్తకళల ప్రదర్శనను ఏర్పాటు చేయడం సంతోషంగా వుందన్నారు. సంప్రదాయ చేనేత, హస్తకళలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, ఆప్‌ఫార్మ్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ఉత్ప త్తులను ప్రోత్సహించడానికి, నాబార్డు మార్కె టింగ్ చేసేందుకు చర్యలు తీసుకొం టుందన్నారు.ఈ నెల 23 వరకు జరగనన్న ఈ ప్రదర్శనలో మంగళగిరి పట్టు, ఉప్పాడ, పొం దూరు ఖద్దరు, తెలంగాణ ప్రత్యేకతలైన నారాయణపేట సిల్క్, కాటన్ చీరలు, సిక్కోలు కాటన్ చీరలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నా యన్నారు. తిరుపతికి చెందిన బాలాజీ హస్తకళలు, ధర్మవరం పట్టుచీరలు, శ్రీ బాలాజీ కాటన్ సిల్క్, కొండపల్లి, ఏటికొప్పాక వంటి సంప్రదాయ కళాఖండా లతో పాటు, తమిళనాడు నుంచి ప్రత్యే కంగా వచ్చిన నవసారిగ్గె ఆఫ్ పట్టు చీరలు కూడా ఈ ప్రదర్శనలో ప్రాముఖ్యత సంత రించుకొన్నాయన్నారు.



హస్తకళా ప్రదర్శనను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, నాబార్డు సీజీఎం ఎం.ఆర్. గోపాల్

నాబార్డు సీజీఎం ఎం.ఆర్.గోపాల్ (ఏపీ) మాట్లాడుతూ గ్రామీణ భారతదేశ అభివృద్ధి కోసం నాబార్డు చేస్తున్న సమగ్ర కృషిని వివరిం చారు. నాబార్డు జనరల్ మేనే జర్ (ఏపీ) డాక్టర్ కేవీఎస్ ప్రసాద్ అతిథులకు, కళాకా రులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ ఎండీ డాక్టర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, ఎస్‌ఎల్ బీసీ ఏజీఎం శ్రీనివాస్ దాసియం, నాబార్డు డీజీఎం ఎం.శ్రీరామచంద్రమూర్తి, పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ఏపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్
## నూతన కార్యవర్గం ఎన్నిక

పటమట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా వి.ప్రసాదరావు, జనరల్ సెక్రటరీగా సీహెచ్ శ్యామ్‌బాబు, అధ్యక్షుడిగా డి.బ్రహ్మం, కోశాధికారిగా ఎంబి సౌరయ్య, కొత్త సభ్యులుగా ఆర్.పి దాస్, బి.డి సావియోను ఎన్నుకున్నారు.

## సమస్యలపై అవగాహన ఉన్న నేత ఆలపాటి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యువత, ఉపాధ్యాయుల సమస్యలపై ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు పూర్తిస్థాయి అవగాహన ఉందని, వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజాకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కోరారు. రాజా విజయాన్ని కాంక్షిస్తూ ఆయన పటమటలంక బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలపాటికి రాజకీయంగా మద్దతునివ్వాలని కోరారు. గెలిస్తే ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించేలా చేయగల సత్తాతోపాటు ప్రభుత్వాన్ని ఒప్పించే సత్తా కూడా రాజాకు ఉందన్నారు. నియోజకవర్గ పరిశీలకులువెలగపూడి శంకర్‌బాబు, చెన్నుపాటి గాంధీ, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి క్రాంతిశ్రీ, యలమంచలి దేవేంద్ర, సీహెచ్ లక్ష్మీ నరసింహారావు, కోనేరు రాజేష్‌లు పాల్గొన్నారు.



పటమట లంక మున్సిపల్ హైస్కూల్లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ఎన్నికల ప్రచార సభలో గద్దె అనురాధ

### ఆలపాటిని మెజార్టీతో గెలిపించండి: అనురాధ

ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వారి తొలి ప్రాధాన్యత ఓటును కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జడ్పీ మాజీ పర్సన్ గద్దె అనురాధ కోరారు. శుక్రవారం పటమట త్రివేణి కళాశాలలో, భారతీనగర్ వెస్లిన్ కళాశాలలో పట్టభద్రులను, అధ్యాపకులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పేరేపి ఈశ్వర్, నర్రా కిషోర్, వీరంకి డాంగియా కుమారి, బద్రీ కర్నా రమేష్, నాజర్‌వలి పాల్గొన్నారు.

వన్‌టౌన్: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గ్రాడ్యుయేట్‌లు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.



పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

## బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులకు సత్కారం

విజయవాడ(స్పోర్ట్స్), ఫిబ్రవరి 14: ఇటీవల జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్ సెపక్ తక్రా పోటీల్లో బంగారు పతకాలు సాధించిన పటమట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కేబీసీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కుమార్ కోనేరు, కె.వీరాజీ, సీహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో క్రీడల అభివృద్ధికి ఎంత వ్యయమైనా వెనకాడేది లేదని తెలిపారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలంటే ఆటల వలనే సాధ్యం అని వారు తెలిపారు. ఈ సందర్భంగా బంగారు పతకాలు సాధించిన వి.కావ్య, రిహానేమా, కె.లావణ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.రమేష్‌లను సన్మానించారు.

## సమాజహిత ప్రాజెక్టులు చేయండి

ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉమామహేశ్వరి

మొగల్రాజపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): మీలో ఉన్న సమర్థతతో సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు తయారు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి వైస్ చైర్ పర్సన్ డాక్టర్ ఉమామహే శ్వరి సూచించారు. మొగ ల్రాజపురం వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం స్కిల్ ఫెస్ట్ -2025 కార్యక్రమాన్ని ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో నిగూఢంగా ఉండే నైపుణ్యాలను ఎలా గుర్తించాలో, వాటిని ఎలా ఉపయోగించు కోవాలో సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఆర్ట్, క్రాఫ్ట్, ఎంబ్రాయిడరీ, సైన్స్, సోషల్, మ్యాథ్స్, త్రీడీ చిత్ర నమూనాలను చూశారు. విద్యార్థులు డ్రోన్‌లతో చేసిన విన్యాసాలను తిలకించారు. ఈ కార్యక్రమాన్ని సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు నాగభూషణం, చనుమోలు కృష్ణారావు, జాయింట్ సెక్రటరీ పాఠశాల కన్వీనర్ సూరెడ్డి విష్ణు, అకాడమీ ఏవో ఎల్‌కే మోహన్‌రావు, కన్వీనర్ వెల్లంకి లలిత, కెసీపీ సిద్ధార్థ కన్వీనర్ శశికళ, వివిధ పాఠశాలల విద్యార్థులు తిలకించారు. ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, హెచ్‌ఎం సీహెచ్ జయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డ్రోన్ విన్యాసాలను తిలకిస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరి తదితరులు

### పరిశుభ్రతపై బాలికలకు అవగాహన



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సిద్ధార్థ ఫార్మసీ విద్యార్థిని

మొగల్రాజపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): కేవీఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో మొగల్రా జపురం బోయపాటి శివరామ కృష్ణయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెడికల్ హైజెనిక్‌పై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ. సునీత మాట్లాడుతూ బాలికలు నెలసరి కార్యక్రమంలో పరిశుభ్రమైన పద్ధతులు పాటించాలని సహజ వనరులతో తయారయ్యే ప్యాడ్స్ డిస్పోజల్ విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారిత కార్యదర్శి ఎం.విజయలక్ష్మి, ఆరోగ్య నిపుణులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ హౌస్‌లో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ



స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు

బస్టేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): విజయ వాడ పండిట్ నెహ్రూ బస్టేషన్‌లోని ఆర్టీసీ హౌస్ లో శుక్రవారం అన్ని విభాగాల్లోను పరిశు భ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ డి.సామ్రా జ్యం అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అన్ని ప్రాంతాల్లోనూ అనుసరించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్థ అన్ని డిపోల్లోనూ ఈ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఎ) జి.వి.రవివర్మ, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు, ఏడీ.శోభామంజరి, విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

దేవినేని వెంకటరమణ, ప్రణీత క్రికెట్ పోటీల్లో
## ఎవరెస్ట్ సీసీ, వెల్‌కమ్ సీసీ విజయంలో బౌలర్లే కీలకం



సీహెచ్.సూర్యకుమార్ 5 వికెట్లు



సీహెచ్.గోకుల్ వర్మ 4 వికెట్లు

విజయవాడ(స్పోర్ట్స్),ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మూలపాడులోని డీవీఆర్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌ల్లో శుక్రవారం రెండు మ్యాచ్ లు జరిగాయి. మొదటి మ్యా చ్‌లో ఎవరెస్ట్ సీసీ జట్టు, న్యూ ఎవరెస్ట్ సీసీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఎవరెస్ట్ సీసీ జట్టు 50ఓవర్లకు 8వికెట్లు కోల్పోయి 272పరుగులు చేసింది. బౌలింగ్ చేసిన న్యూ ఎవరెస్ట్ సీసీ జట్టులో బౌలర్స్ సీహెచ్.గోకుల్ వర్మ 4వికెట్లు, కె.మనోహర్ 2వికెట్లు తీశారు. బ్యాటింగ్‌కు దిగిన న్యూ ఎవరెస్ట్ సీసీ జట్టు 48.3 ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 250 పరుగులు చేసి ఓటమి పాలైంది. ఎవరెస్ట్ సీసీ జట్టు 4పాయింట్లు సాధించింది. రెండో మ్యాచ్‌లో వెల్‌కమ్ సీసీ జట్టు, ఆంధ్రా బ్లూస్ సీసీ జట్లు తలపడ్డాయి. బ్యాటింగ్ చేసిన ఆంధ్రా సీసీ జట్టు 44.3 ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 174పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన వెల్‌కమ్ సీసీ జట్టు 44.3 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 175పరుగులు చేసి విజయం సాధించి 4పాయింట్లు తన ఖాతాలో వేసుకుంది. జట్టులో బౌలర్ సిహెచ్.సూర్యకుమార్ 41పరుగులు ఇచ్చి 5వికెట్లు తీసి విజయంలో కీలకపాత్ర పోషించాడు.



డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా తో సత్కరించిన రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు

### మర్యాదపూర్వక కలయిక

వన్‌టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను శుక్రవారం ఆయన చాంబర్‌లో రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి అభినందలు తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడు ఎ.రవిచంద్ర, జనరల్‌సెక్రటరీ కె.సత్యనారాయణ, ట్రెజరర్ కె.వి. నారాయణ, అసోసియేషన్ మెంబర్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### కళారత్న కొప్పాడకు ఘన నివాళి

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కళారత్న కొప్పాడ వెంకట శ్రీనివాసరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఎంజీ రోడ్డు బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నైరూపి చిత్రకారుల్లో తనకంటూ ప్రత్యేకత చాటుకున్న గొప్ప కళాకారుడు కొప్పాడ అన్నారు. రిటైర్డ్ ఐఎఎస్ ఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ రోజ్ బడ్స్ విద్యాసంస్థ ద్వారా ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని తెలిపారు. జీఆర్‌కే పోలవరపు సాంస్కృతి సమితి సెక్రటరీ గోళ్ల నారాయణరావు కొప్పాడ చిత్ర విశిష్టతను ప్రసంశించారు. కొప్పాడ వెంకట శ్రీనివాసరావు కుటుంబసభ్యులు, బంధువులు, చిత్ర కళాకారులు, కొప్పాడ శిష్యులు, రోజ్ బడ్స్ స్కూల్ పూర్వపు విద్యార్థులు హాజరయ్యారు.



పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లో రోడ్డుపై చిందరవందరగా పడిన కంకర

# కంకర.. బతుకు చిందరవందర

- టిప్పర్ డ్రైవర్ల నిర్లక్ష్యం
- పట్టాలు కప్పకుండా తోలకాలు
- పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రోడ్డుపై టిప్పర్ల నుంచి జారిపడిన కంకర
- స్కూటీపై నుంచి పడి వాహనదారుడికి గాయాలు

టిప్పర్ డ్రైవర్ల నిర్లక్ష్యం ద్విచక్రవాహనదారుల పాలిట శాపంగా మారింది. పైన పట్టాలు కప్పకుండా కొన్ని టిప్పర్లు గురువారం అర్ధరాత్రి పరిమితికి మించి కంకర రవాణాచేశాయి. పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రోడ్డుపై టిప్పర్ల నుంచి జారిన కంకర చిందరవందరగా పడింది. శుక్రవారం ఉదయం నాలుగు గంటల సమయంలో అటుగా స్కూటీపై వెళుతున్న ఓ వాహనదారుడు పక్కన వాహనాలు వేగంగా రావడంతో కంకరపైకి వెళ్లాల్సి వచ్చింది. దీంతో అతను స్కూటీతో సహా జారిపడ్డాడు. తలకు గాయమైంది. అటుగా వెళుతున్న వాహనదారులు అతనికి సపర్యలు చేశారు. - విజయవాడ



కంకరలోడుపై పట్టా కప్పకుండా వెళుతున్న టిప్పర్



స్కూటీపై వెళుతుండగా కంకరపై జారిపడడంతో గాయపడిన వాహనదారుడు



హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వాహనదారుడికి చాక్లెట్ ఇస్తున్న డీటీసీ ఎ.మోహన్

## హెల్మెట్ పెట్టు..చాక్లెట్ పట్టు!

- హెల్మెట్ ధారణపై వినూత్నంగా అవగాహన

**కృష్ణలంక, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):** హెల్మెట్ ధరించడం భారం కాదని, అది బాధ్యతని, ప్రాణాలు కాపాడే అస్త్రమని ఉప రవాణా కమిషనర్ ఎ.మోహన్ పేర్కొన్నారు. బందరురోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం సమీపంలోని పెట్రోల్ బంక్ దగ్గర వాహనదారుల భద్రత కోసం రవాణాఅధికారులు 'హెల్మెట్ పెట్టుకో చాక్లెట్ పట్టుకో' అనే నినాదంతో అవగాహనా కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెల్మెట్ పెట్టుకుని వాహనాలు నడిపిన ప్రతి ఒక్కరికీ అధికారులు చాక్లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీటీసీ ఎ.మోహన్ హాజరయ్యారు. ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, వాహన తనిఖీ అధికారులు వి.పద్మాకర్, ఎ.ఉదయ్‌శివప్రసాద్, డీవీ రమణ, బి.శ్రావణి, గీతాంజలి, ప్రి యదర్శిని, కేవీ రవిగోపాల్, బి.ఉమామహేశ్వరరావు, రవాణా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.రాజుబాబు పాల్గొన్నారు.



మైలవరం సీఐ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, ధర్నాలో కూర్చున్న సంసోను

## సంసోనుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను సస్పెండ్ చేయాలి

- మైలవరం సీఐ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా

**మైలవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):** ములకలపెంట మర్డర్ ఘటనలో అనుమానితునిగా అదుపులోకి తీసుకున్న వడ్లపూడి సంసోనుపై థర్డ్ డిగ్రీ పయోగించిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు శుక్రవారం సీఐ కార్యాలయం ఎదుట మెరుపు ధర్నాకు దిగారు. ములకలపెంటలో తన తండ్రి కడియం శ్రీనివాసరావును కొడుకు కడియం పుల్లారావు మర్డర్ చేసి ఆ నేరం సంసోనుపై అతని యజమాని చల్లా సుబ్బారావుపై మోపితే అనుమానితులుగా ఇద్దరినీ అరెస్టు చేశారని, సుబ్బారావుకు రాచమర్యాదలు చేసి, దళితుడైన సంసోను చితకబాదారని, నేరం చేసినట్లు ఒప్పుకోమని థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, చెట్టుకు వేలాడదీసి కొట్టారని ఎమ్మార్పీఎస్ నేతలు ఆరోపించారు. బాధితుడు తమ ఎదుట బోరుమన్నాడని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రాణం పోతుందనే భయంతో నేరం చేసినట్లు ఒప్పుకొన్నానని, దైవం తన పక్షాన ఉండి నేరం చేసిన వ్యక్తి పట్టుబడ్డాడని సంసోను వాపోయాడు. దండం పెట్టినా పోలీసులు తనపై దయ చూపలేదని తెలిపాడు. ఏసీపీ ప్రసా దరావుకు వినతిపత్రం ఇచ్చి ధర్నాను విరమించారు. మందా వెంకటేశ్వరరావు మాదిగ, కోట దానియేలు మాదిగ, ఆదూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సీఎంకు ఎంప్లాయీస్ సమాఖ్య వినతి

**అమరావతి/జగ్గయ్యపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ సమాఖ్య ప్రతినిధులు సీఎం చంద్రబాబును కోరారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయంలో సీఎంకు వినతిపత్రం అందించారు. సచివాలయ ఉద్యోగులను హేతుబద్ధీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, తమకు చాలా సమస్యలు ఉన్నాయని వారు చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. ప్రొబేషన్ సమయంలో ఉన్న మూడు సంవత్సరాలకు మూడు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. జాబ్‌చార్ట్ ప్రకటించాలని, అందరికీ పదోన్నతి చానల్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయ ఉద్యోగుల్లో చాలా మంది ఉన్నత విద్యావంతులున్నారని, వారిని అర్హతకు తగినట్లుగా మాతృశాఖలో నియమించాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ సమాఖ్య కేలండర్‌ను సీఎం ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ ఆచారి పాల్గొన్నారు.

## అమరావతికి బ్రాండ్ అంబాసిడర్ నియామకానికి మార్గదర్శకాలు

**అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):** రాజధాని అమరావతి ప్రతిష్ఠను ఇనుమడింపచేసేలా ప్రచారం కల్పించేందుకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం బ్రాండ్ అంబాసిడర్ నియామకానికి తాజాగా మార్గదర్శకాలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. బ్రాండ్ అంబాసిడర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా సీఎం కార్యాలయం ఎంపిక చేస్తుంది. వారు ఏడాదిపాటు పదవిలో ఉంటారు, తదుపరి కొనసాగించవచ్చు. అమరావతి, ఏపీసీఆర్‌డీఏ ప్రతిష్ఠను ఇనుమడింపచేసేలా బ్రాండ్ అంబాసిడర్ కృషి చేస్తారు. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా చేసేందుకు ఇన్నోవేషన్, సుస్థిరత, సమ్మిళితాభివృద్ధిని ప్రచారం చేస్తారు.

## పైసలిస్తేనే పాస్‌పోర్టు వెరిఫికేషన్

### ఓ పోలీసు అధికారి అక్రమార్జన

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో చుక్కలు
- అన్నీ సక్రమంగా ఉన్నా ఏదో ఒక కొర్రీ పెట్టి వసూళ్లు

**(ఆంధ్రజ్యోతి-గన్నవరం):** అష్టకష్టాలు పడి పాస్‌పోర్టు కార్యాలయంలో ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని వస్తున్న అభ్యర్థుల జేబులకు చిల్లులు పడుతున్నాయని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో ఓ పోలీసు అధికారి వేలకువేలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేమని ప్రశ్నిస్తే ఫైల్ అప్రూవల్ చేయించాలా.. వద్దా? అంటూ భయపెడుతున్నారని, దిక్కుతోచక అడిగిన సొమ్ము చెల్లించి వెరిఫికేషన్ పూర్తి చేయించుకుంటున్నారని తెలుస్తోంది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మూడు మండలాల్లో ఎవరు పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నా ఎస్బీ అధికారులు వెరిఫికేషన్ చేయాలి. అయితే ఈ వెరిఫికేషన్ కిందిస్థాయి అధికారులు కూడా చేయొచ్చు. కానీ, గన్నవరంలో మాత్రం ఓ అధికారి రంగంలో దిగి పాస్‌పోర్టు వెరిఫికేషన్లు చేస్తున్నారు. వెరిఫికేషన్‌కు వచ్చిన అభ్యర్థులు పైసలు చెల్లిస్తేనే ఫైల్ పైకి వెళుతుంది. లేకుంటే వారికి చుక్కలే. ఫార్మాలిటీస్ పేరుతో యథేచ్ఛగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఫైల్ పంపాలంటే బోలెడంత ఖర్చు అవుతోంది..మీకేం తెలుసు అంటూ గట్టి స్వరంతో మాట్లాడడంతో భయపడి నగదు చెల్లిస్తున్నారు. నెలకు సుమారుగా వంద వెరిఫికేషన్ల వరకూ వస్తాయని సమాచారం. దీనిబట్టి చూస్తే ఆ అధికారి వసూళ్ల పర్వం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కనీసం రూ.500 నుంచి ఆ పైన అభ్యర్థి ఇచ్చుకునేంత వరకూ డిమాండ్ చేస్తున్నారని, ఇవ్వలేమని చెప్పినా ఇవ్వాల్సిందేనని గట్టిగా డిమాండ్ చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. పాస్‌పోర్టు వెరిఫికేషన్ ఇళ్ల వద్దకు వెళ్లి చేయాలి. కానీ ఈ అధికారి మాత్రం తాను ఎంచుకున్న ప్రాంతానికి పిలిపించి చేస్తున్నారు. పోలీసులు అధికారి అక్రమ వసూళ్లను నివారించాలని అభ్యర్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### పోలీసు అధికారి నిర్వాకాలు

- ఆయనొక ఉపాధ్యాయుడు. కుమార్తె పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నారు. అది గన్నవరంలోని పోలీసు అధికారి దగ్గరకు చేరింది. వెంటనే ఆ అధికారి దరఖాస్తులో ఉన్న నెంబర్‌కు ఫోన్ చేశారు. పాస్‌పోర్టు వెరిఫికేషన్‌కు వచ్చిందని ఒరిజనల్ చూపించి సంతకాలు చేసి వెళ్లాలని సూచించారు. ఉపాధ్యాయుడు కుమార్తెతో కలిసి వచ్చి ఒరిజనల్స్ చూపించి సంతకాలు చేశారు. వెనుదిరిగి వెళుతుండగా ఫార్మాలిటీస్ రూ.వెయ్యి ఇవ్వాలని పోలీసు అధికారి అడిగారు. అదేంటి సార్ మీ పని మీరు చేశారు. దానికి ఫార్మాలిటీ ఏమిటని ఉపాధ్యాయుడు ప్రశ్నించారు. కుదరదు ఇవ్వాల్సిందే ఈ ఫైల్ మొత్తం పంపించాలంటే ఖర్చవుతుంది అనడంతో తప్పక రూ.వెయ్యి ఇవ్వాల్సి వచ్చింది.
- ఆ విద్యార్థినిది మారుమూల గ్రామం. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకుంది. ఆ దరఖాస్తు పోలీసు అధికారి దగ్గరకు రాగానే ఫోన్ చేశారు. వచ్చి సర్టిఫికెట్లు చూపించి సంతకాలు చేసింది. ఆ అధికారి రూ.1500 అడిగారు. దీంతో వాళ్లు అవాక్కయ్యారు. వెరిఫికేషన్ ఉచితంగా ఉంటుంది అనుకుని వస్తే ఇదేంటని నోరెళ్లబెట్టారు. అడిగిన నగదు ఇస్తేనే ఫైల్ పైకి పంపిస్తా లేకుంటే మీ ఇష్టం అని అధికారి చెప్పారు. దీంతో తెలిసిన వారి దగ్గర అప్పు చేసి ఆ అధికారి చేతిలో నగదు పెట్టి వెళ్లిపోయారు.

## ఇంధనాన్ని పొదుపు చేద్దాం

- ఆర్థిక, పర్యావరణ వ్యవస్థలు పరిరక్షిద్దాం
- శక్షం ప్రారంభ కార్యక్రమంలో వక్తల పిలుపు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పౌరసరఫరాల రాష్ట్ర కమిషనర్, ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ సౌరభ్‌గౌర్

**వన్‌టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):** ఇంధన పొదుపు ద్వారా ఆర్థిక, పర్యావరణ వ్యవస్థలను పరిరక్షిద్దామని పలువురు వక్తలు పేర్కొన్నారు. భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శుక్రవారం శక్షం(సంరక్షణ క్షమత మహోత్సవం) పక్షోత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌరసరఫరాల రాష్ట్ర కమిషనర్, ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ సౌరభ్‌గౌర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇంధన పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. పెరుగుతున్న వాహనాల వినియోగానికి అనుగుణంగా పెట్రోలియం ఉత్పత్తులను సంరక్షించాలని, క్లీన్ అండ్ గ్రీన్ ఇంధనాలు, ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించాలని అని సౌరభ్ గౌర్ పిలుపునిచ్చారు. కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణపై వినియోగదారుల్లో అవగాహన కల్పించేందుకు 15 రోజుల పాటు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చమురు పరిశ్రమ ఆంధ్రప్రదేశ్ సమన్వయకర్త వి.వేణుమాధవ్ తెలిపారు. సైకిల్ ర్యాలీ, వాక్‌థాన్, సీఎన్‌జీ ఆటోలు, కార్ల ర్యాలీలు, ఎల్పీజీ డెలివరీ బాయ్‌లకు శిక్షణ, గృహిణులకు, పాఠశాల, కాలేజీ విద్యార్థులకు ఇంధన ఆదాపై చిట్కాలు తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. డ్రాయింగ్ పోటీల విజేతలకు, సాంస్కృతిక కార్యక్రమాల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవోసీఎల్ విజయవాడ డివిజనల్ రిటైల్ సేల్స్ హెడ్ ఎ.వి.అనిల్‌కుమార్, బీపీసీఎల్ విజయవాడ ప్రాంతీయ మేనేజర్ ప్రసాద్ రాజ్వాడే, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ అవినాష్ కుమార్, బీపీసీఎల్ ఎల్పీజీ రీజనల్ మేనేజర్ సీటీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

- మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు

**గుణదల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):** తలసేవియా బాధితులకు అండగా నిలిచేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్, ట్రస్టీ నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో యూఫోరియా మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్నందున శనివారం నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు హాజరవుతారని, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తామని సీపీ తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ముందుగా తెలియజేసిన ప్రదేశాల్లోనే వారి వాహనాలను పార్క్ చేయాల్సి ఉం టుందని, ఎక్కడపడితే అక్కడ పార్క్ చేయొద్దని సూచించారు.

### వాహనాల మళ్లింపు ఇలా..

- ఆర్టీసీ వై జంక్షన్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా స్వర్ణపాలెస్, దీప్తి సెంటర్‌చుట్టుగుంట, పడవలరేవు, గుణదల, రామవరప్పాడు రింగ్ మీదుగా బెంజిసర్కిల్ వైపు మళ్లిస్తారు
- ఆర్టీసీ వై జంక్షన్ నుంచి బందర్ లాకులు, రాఘవయ్య పార్క్, పాత ఫైర్‌స్టేషన్ రోడ్, అమెరికన్ హాస్పిటల్, మసీదు రోడ్డు, నేతాజీ బ్రిడ్జి, గీతానగర్, స్క్రూబ్రిడ్జి మీదుగా బెంజిసర్కిల్ వైపు మళ్లిస్తారు.
- బెంజిసర్కిల్ వైపు నుంచి బందర్ రోడ్డులోకి వచ్చే వాహనాలు బెంజిసర్కిల్ నుంచి ఫకీరుగూడెం-స్క్రూబ్రిడ్జి-నేతాజీబ్రిడ్జి- బస్టాండ్ వైపునకు మళ్లిస్తారు.
- రెడ్ సర్కిల్ నుంచి ఆర్టీఏ జంక్షన్-శిఖామణి సెంటర్ నుంచి వెటర్నరీ జంక్షన్ వరకు వాహనాలకు అనుమతి లేదు.
- బెంజి సర్కిల్ నుంచి డీసీపీ బంగ్లా కూడలి వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆహ్వానితులను మాత్రమే అనుమతిస్తారు.



అవార్డులు అందుకున్న సిబ్బందితో రైల్వే అధికారులు

## అన్ని విభాగాల్లో అద్భుత ప్రగతి

- విజయవాడ రైల్వే డివిజన్ సిబ్బందికి డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ప్రశంస

**రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):** విజయవాడ రైల్వే డివిజన్ అన్ని విభాగాల్లో అద్భుత ప్రగతి సాధించిందని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. రైల్వే వారోత్సవాల సందర్భంగా విజయవాడ రైల్వే ఆడిటోరియంలో 69వ రైల్వే వారోత్సవ వేడుకను శుక్రవారం నిర్వహించారు. డివిజన్ ప్రగతికి విజయవాడ రైల్వే డివిజన్‌లో పనిచేసే సిబ్బందే కారణమని ఆయన ప్రశంసించారు. డివిజన్ సమర్థవంతంగా పనిచేయడానికి జట్టు కృషి ఉందని రైల్వేలో పనితీరు మెరుగుకు ఇది ఉదాహరణ అని తెలిపారు. ఉద్యోగుల ఐక్య కృషి ప్రయాణికులకు సంతృప్తికరమైన సేవలను అందిస్తుందన్నారు. 2024-2025లో డివిజన్ రూ.5వేల కోట్ల స్థూల ఆదాయాన్ని అధిగమించిందని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనలో అమృత భారత్ పథకం కింద విజయవాడ డివిజన్‌లోని 20 స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ఎస్‌జీ-1లో రూ.500 కోట్ల ఆదాయం వచ్చిందని, దక్షిణ మధ్య రైల్వేలో రెండవ స్టేషన్‌గా నిలిచిందని పేర్కొన్నారు. 2024లో స్ఫూర్తిదాయక, ఆదర్శ సేవలను అందించిన 54 మందికి అవార్డులు ఇచ్చి సత్కరించారు. మౌలిక సదుపాయాల ఏడీఆర్ఎం పీఈ అడ్విన్, ఆపరేషన్స్ ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## గుంటూరు నుంచి పార్వతీపురానికి ఆర్టీసీ బస్సు

**బస్ స్టేషన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):** గుంటూరు నుంచి పార్వతీపురానికి రోజూ ఆర్టీసీ ఇంద్ర ఏసీ బస్సు నడుపుతున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని, ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.యేసుదానం శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. 3181 సర్వీసు నెంబరు బస్సు గుంటూరులో రాత్రి 7.15 గంటలకు బయలుదేరి 8.20 గంటలకు విజయవాడ, రాత్రి 10 గంటలకు ఏలూరు, 11.45కు రాజమండ్రి, అర్ధరాత్రి 1.30 గంటలకు అన్నవరం, మరునాడు తెల్లవారుజామున 4.15 గంటలకు విశాఖపట్నం, 5.30 గంటలకు విజయనగరం, 6 గంటలకు గజపతినగరం, 6.40 గంటలకు బొబ్బిలి, 7.15 గంటలకు పార్వతీపురం చేరుకుంటుందని ఆయన తెలిపారు. తిరిగి ఇదే రూటులో 3182 సర్వీసు నెంబరు బస్సు పార్వతీపురంలో సాయంత్రం 4.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటలకు గుంటూరు చేరుకుంటుందని తెలిపారు. విజయవాడ నుంచి పార్వతీపురానికి రూ.1,140 చార్జీ ఉంటుందన్నారు. సీఆర్డీయే ప్రాంతంలోని తాడేపల్లి క్రాస్ రోడ్, కుంచనపల్లి క్రాస్‌రోడ్, మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి, నిర్మలా కాన్వెంట్ బస్టాప్‌ల వద్ద ఎక్కేందుకు, దిగేందుకు సౌకర్యం ఉందని, అడ్వాన్స్ రిజర్వేషన్ ఆర్టీసీ వెబ్‌సైట్, బస్‌స్టేషన్లు, అధీకృత ఏజెంట్లవద్ద చేయించుకోవచ్చని సూచించారు.

## రంజాన్ మాసంలో మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

- ముస్లిం ఉద్యోగులు గంట ముందుగా వెళ్లొచ్చు
- మార్గదర్శకాలను వెల్లడించిన మంత్రి ఫరూక్

**అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):** రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సమాజానికి ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా, అన్ని సౌకర్యాలనూ కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మసీదులు, ఈద్గాలు తదితర ముస్లిం ప్రార్థన మందిరాల వద్ద నెల రోజులపాటు ఉపవాస దీక్షలు, ప్రార్థనలు జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు, మైనార్టీ సంక్షేమశాఖ అధికారులకు, వక్ఫ్ బోర్డు, అన్ని ప్రభుత్వ శాఖల విభాగాల అధిపతులకు ఈ మార్గదర్శకాలు విడుదల చేసినట్లు శుక్రవాంరం ఒక ప్రకటనలో వెల్లడించారు. రంజాన్ మాసంలో మార్చి 2 నుంచి 30 వరకు ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ముస్లిం ఉద్యోగులందరూ సాయంత్రం ఒక గంట ముందుగానే మతపరమైన ఆచారాలను నిర్వహించుకోవడం కోసం బయటికి వెళ్లేందుకు ప్రభుత్వం సడలింపు ఇచ్చినట్లు తెలిపారు. పురపాలకశాఖ, పంచాయతీరాజ్‌శాఖ విభాగాలు ఆయా ప్రార్థనా స్థలాల వద్ద ఆరోగ్య జాగ్రత్తలు అమలు చేయాలని, పారిశుధ్యం, భద్రతా ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. నిరంతరాయంగా మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆ నెల రోజుల వ్యవధిలో శుభరాత్రులు, సహేరీ సమయాల్లో దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, హోటళ్లను తెరిచి ఉంచేందుకు, ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించేందుకు పోలీస్‌శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.

## ఏపీయూడబ్ల్యూజే 2025 డైరీ ఆవిష్కరణ

**ధర్నాచౌక్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) విజయవాడ యూనిట్ రూపొందించిన 2025 మీడియా డైరీని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ, యూనియన్ నేతలతో కలిసి గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని శివాజీ అన్నారు. బుడమేరు వరదల సమయంలో జర్నలిస్టుల కృషిని ఆయన కొనియాడారు. డైరీ ముద్రణకు సహకారాలు అందించిన రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావుకు యూనియన్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ అర్బన్ అధ్యక్షుడు చావా రవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు షేక్ బాబు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచల జయరాజు, దాసరి నాగరాజు, యూనియన్ అర్బన్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఏపీ ఫోటో జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## చిట్టూరి భార్గవ్‌కు కన్నీటి వీడ్కోలు

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):** ఐర్లాండ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జగ్గయ్యపేటకు చెందిన చిట్టూరి భార్గవ్ భౌతికకాయానికి శుక్రవారం హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు నివాళులర్పించి, కన్నీటితో వీడ్కోలు పలికారు. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు భార్గవ్ తల్లిదండ్రులు చిట్టూరి సాయిబాబు, రాధికను పరామర్శించారు. భౌతికకాయానికి నివాళులర్పించారు. మధ్యాహ్నం ప్రత్యేక వాహనంపై అంతిమయాత్ర నిర్వహించారు. యాత్రలో భార్గవ్ స్నేహితులు, బంధువులు భారీగా పాల్గొన్నారు.



భార్గవ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

## ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

» హైకోర్టును ఆశ్రయించిన సినీనటి శ్రీరెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తనపై నమోదైన మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సినీనటి విమల మల్లిడి అలియాస్ శ్రీరెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాస రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

## మరో 12 మంది ఏజీపీలు నియామకం

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు మరో 12 మంది న్యాయవాదులను సహాయ ప్రభుత్వ న్యాయవాదులు(ఏజీపీ)లుగా నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎ.కృష్ణ కిషోర్, ఎం.నంద నాగ రవిశంకర్, పువ్వాడ ఎల్‌వీఎస్ ప్రసాద్ బాబు, పి.లక్ష్మి, డి.నాగ చంద్రిక, టి.సంజీవరావు, డి.వంశీ కృష్ణ, కె.భగత్ సింగ్, కట్టా విజయ్, గుడిపాటి నాగభూషణం, బేతపూడి రమేష్, ఓరుగంటి శాయమ్మ ఏజీపీలుగా నియమితులయ్యారు.

## పెట్టుబడిదారులకు కోసం మరో 12 సేవలు

» నోటిఫై చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారెంటీ రూల్స్-2018కు తీసుకువచ్చిన సవరణలను నోటిఫై చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పెట్టుబడిదారులకు సౌకర్యాలు, స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించడంతోపాటు మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రస్తుతం ఉన్న షెడ్యూలులో 12 సర్వీసులను చేరుస్తూ ప్రభుత్వం సవరణలు చేసింది. నిర్దేశిత కాలపరిమితి (7 నుంచి 21 రోజులు)లోగా సేవలు అందించకపోతే.. ఆ ఆలస్యానికి నష్టపరిహారంగా సంబంధిత శాఖలు రోజుకు రూ. 200 నుంచి 250 చొప్పున గరిష్ఠంగా రూ. 25 వేలు చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

## బర్డ్‌ఫ్లూ దెబ్బకు కార్మికుల విలవిల

» వేల మంది ఉపాధికి గండి

తణుకు రూరల్/పెంటపాడు ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల్లోని పౌల్ట్రీలో వ్యాపించిన బర్డ్‌ఫ్లూ వైరస్ రైతులతో పాటు కార్మికుల ఉపాధినీ దారుణంగా దెబ్బ తీసింది. బర్డ్‌ఫ్లూ కారణంగా రెడ్ జోన్ ప్రకటించిన తణుకు మండలం వేల్పూరు, ఉంగుటూరు మండలం బాదంపూడి, పెరవలి మండలం కానూరు అగ్రహారం గ్రామాల్లో సుమారు 40 ఫారాలు మూతపడ్డాయి. ఈ ఫారాల్లో పనిచేస్తున్న 3,200 మంది కూలీలు ఉపాధి కోల్పోతున్నారు.

## మార్చి 19న భూమిపైకి సునీతా విలియమ్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: అంతర్జాతీయ రోదసీ కేంద్రం (ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్-ఐఎస్ఎస్)లో గత ఎనిమిది నెలలుగా చిక్కుకుపోయిన వ్యోమగామి సునీతా విలియమ్స్ ఎట్టకేలకు భూమి మీదకి తిరిగి రానున్నారు. ఆమె మార్చి 19న తిరిగి రానున్నారు. గత ఏడాది వేసవిలో ఐఎస్ఎస్‌లో విధుల నిర్వహణ నిమిత్తం ఐఎస్ఎస్‌కు వెళ్లిన ఇద్దరు నాసా వ్యోమగాములు... సునీతా విలియమ్స్, బచ్ విల్‌మోర్‌లు సాంకేతిక సమస్యల కారణంగా అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. వారి ప్రయాణించిన బోయింగ్ సంస్థకు చెందిన స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో లోపాలు తలెత్తడంతో తిరిగిరాలేకపోయారు. ఇది అమెరికాలో తీవ్ర ఆందోళన కలిగించింది. దాంతో వారిని తిరిగి తీసుకు రావాలని స్పేస్ ఎక్స్ సంస్థ సీఈఓ ఎలాన్ మస్క్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టిగా డిమాండు చేశారు. ఆ ప్రయివేటు సంస్థ అంతరిక్షానికి వ్యోమనౌకలను పంపిస్తుండడంతో ట్రంప్ ఆ డిమాండు చేశారు. ఈ నేపథ్యంలో అంతరిక్ష కేంద్రంలో విధులు నిర్వర్తించేందుకు క్రూ-10 విభాగానికి చెందిన నలుగురు వ్యోమగాములను తీసుకెళ్తున్న డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ తిరుగు ప్రయాణంలో సునీత, విల్‌మోర్‌లను భూమిపైకి తీసుకురానుంది.

## పుల్వామా అమరులకు ఘన నివాళులు




» వీర జవాన్ల త్యాగాలను దేశం మరువదు: ప్రధాని

న్యూఢిల్లీ/శ్రీనగర్, ఫిబ్రవరి 14: అది భారతదేశ చరిత్రలో ఒక చీకటి రోజు.. 2019, ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో సైనిక కాన్వాయ్‌పై ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. ఈ ఘటన జరిగి శుక్రవారానికి ఆరేళ్లు అయిన సందర్భంగా దేశ సేవలో ప్రాణ త్యాగం చేసిన వీర జవాన్లకు దేశవ్యాప్తంగా ఘన నివాళులు అర్పించారు. అమర సైనికుల త్యాగం మరువలేనిదని ప్రజలు గుర్తుచేసుకున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సహా పార్టీలకు అతీతంగా నేతలు నివాళులు తెలిపారు. దేశం పట్ల అమర జవాన్ల అంకితభావం ఎన్నటికీ మరువలేనిదని మోదీ పేర్కొన్నారు. '2019 పుల్వామా దాడిలో అమరులైన మన వీర జవాన్లకు నివాళులు. మీ త్యాగం, దేశం పట్ల అచంచలమైన అంకితభావాన్ని రాబోవు తరాలు ఎన్నటికీ మరిచిపోవు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. పుల్వామా ఘటనను ఖండించిన అమిత్‌షా.. దేశం నుంచి ఉగ్రవాదాన్ని తరిమికొట్టేందుకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. పుల్వామా వీర జవాన్లకు దేశం రుణపడి ఉందని, వారి త్యాగాలకు హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నానని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు. అమర జవాన్లను స్మరించుకుంటూ సీఆర్‌పీఎఫ్ పుల్వామా జిల్లాలోని లెత్‌పోరాలో కార్యక్రమం నిర్వహించింది.

### నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం లేకున్నా..

## టెండర్లలో ఎలా పాల్గొన్నారు?

» కల్తీ నెయ్యి నిందితులపై సిట్ ప్రశ్నల వర్షం

తిరుపతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): టీటీడీకి నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం తమ డెయిరీకి లేదని తెలిసి కూడా ఎందుకు టెండర్లలో పాల్గొన్నారని ఏఆర్ డెయిరీ ఎండీ రాజురాజశేఖరన్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రశ్నించినట్లు తెలిసింది. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో అరెస్టయి జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న రాజురాజశేఖరన్ (ఏ-2), బోలేబాబా ఆర్గానిక్ డెయిరీ డైరెక్టర్లు పోమిల్ జైన్(ఏ-3) విపిన్ జైన్(ఏ-4), వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ వినయ్‌కాంత్ చావ్డా (ఏ-5)ను వారంపాటు కస్టడీలో విచారణకు అనుమతి కోరగా.. తిరుపతి రెండో ఏడీఎం కోర్టు ఐదు రోజులు అనుమతించిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఉదయం సిట్ అధికారులు రిజర్వు పోలీసు బలగాలతో తిరుపతి సబ్ జైలుకు చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుని రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు అనంతరం వారిని సిట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. వేర్వేరు గదుల్లో ఉంచి విచారణ చేపట్టారు. వారిని ప్రశ్నించేందుకు హైదరాబాద్ నుంచి సిట్ బృందానికి నాయకత్వం వహిస్తున్న సీబీఐ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు, విశాఖ నుంచి సీబీఐ డీఐజీ మురళీరాంబా తిరుపతి చేరుకున్నారు. తొలిరోజు విచారణ సందర్భంగా.. ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్‌తో ఎప్పటి నుంచి పరిచయమో బోలేబాబా, వైష్ణవి డెయిరీల డైరెక్టర్లను సిట్ ప్రశ్నించింది. 'బహిరంగ మార్కెట్ ధర కంటే తక్కువ ధర ఎందుకు కోట్ చేశారు? కల్తీ చేయాలని ప్రేరేపించింది ఎవరు? రాజకీయ నేతల నుంచి, టీటీడీ అధికారులు, ఉద్యోగుల నుంచి ఏమైనా సహకారం అందిందా? ఇందులో వారి పాత్ర ఏవిటి? నాణ్యత లేని నెయ్యి సరఫరా గురించి టీటీడీ అధికారులు ఎవరైనా, ఎప్పుడైనా ప్రశ్నించారా' అని రాజశేఖరన్‌ను అడిగి


తిరుపతి సెంట్రల్ జైలు నుంచి రాజశేఖరన్, పోమిల్ జైన్‌ను తీసుకెళుతున్న సిట్ అధికారులు

లోతుగా విచారించినట్లు సమాచారం. ఇంకో వైపు.. సిట్ బృందం టీటీడీ మార్కెటింగ్ విభాగం ప్రొక్యూర్‌మెంట్ జనరల్ మేనేజర్ మురళీకృష్ణతో పాటు ఆ విభాగం సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లను పిలిపించి విచారించింది. అలాగే నెయ్యి నాణ్యత నిపుణులు సురేంద్రనాథ్, విజయభాస్కర్‌రెడ్డిని కూడా ప్రశ్నించింది. అదే విభాగానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్‌ను విచారించారు. వారం తర్వాత మళ్లీ విచారణకు రావాలని ఆయనకు నోటీసిచ్చి పంపేశారు. మార్కెటింగ్ విభాగం గోదాముల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లనూ ప్రశ్నించి వివరాలు రికార్డు చేశారు.

### నకిలీ ల్యాబ్ రిపోర్టు!

ఏఆర్ డెయిరీ నిర్వాహకులు టీటీడీకి సరఫరా చేసిన నెయ్యి నాణ్యతకు సంబంధించిన సర్టిఫికెట్లు, ల్యాబ్ రిపోర్టులు అందజేశారు. వాటిలో చెన్నైకి చెందిన ప్రైవేటు ల్యాబ్ ఎస్ఎంఎస్ ల్యాబ్ జారీ చేసినట్లుగా సర్టిఫికెట్ సమర్పించారు. అందులో నెయ్యి నాణ్యత బాగుందని నిర్ధారించినట్లుగా ఉంది. దీనిపై దృష్టిసారించిన సిట్ అధికారులు.. ఏఆర్ డెయిరీలో ఎస్ఎంఎస్ ల్యాబ్ జారీ చేసిన ఒరిజినల్ రిపోర్టు ప్రతులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరిశీలిస్తే ఏఆర్ డెయిరీ సరఫరా చేస్తున్న నెయ్యిలో నాణ్యత లేదని స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిసింది. దీనినిబట్టి ఒరిజినల్ రిపోర్టును దాచి అదే ల్యాబ్ పేరిట నకిలీ రిపోర్టు సృష్టించి టీటీడీకి సమర్పించినట్లు భావిస్తున్నారు. కాగా.. ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీల నిర్వాహకులు నెయ్యి సరఫరా ట్యాంకర్లకు రెగ్యులర్ డ్రైవర్లయితే గుట్టు బయటపడుతుందని.. తాత్కాలిక డ్రైవర్లను నియోగించినట్లు సిట్ గుర్తించింది.

### టీటీడీ అధికారులు, పాలకవర్గాల పాత్రపై దృష్టి

టీటీడీలో నెయ్యి సేకరణలో మార్కెటింగ్ విభాగంలోని ప్రొక్యూర్‌మెంట్ సెక్షన్ పాత్ర కీలకం. నెయ్యి నాణ్యత, పరిమాణం మొదలైనవాటిని ఆ విభాగం అధికారులు, సిబ్బందే పరిశీలించాల్సి ఉంటుంది. దీనితో పాటు టీటీడీలో పర్చేజెస్ కమిటీలో ముఖ్య అధికారులు, పాలకవర్గం సభ్యులు కొందరు అందులో సభ్యులుగా ఉంటారు. ఇదికాక టెక్నికల్ కమిటీ ఉంటుంది. నెయ్యి సరఫరా చేసే డెయిరీలు, ప్లాంట్లు తనిఖీ చేసే బాధ్యత దానిదే. సమాంతరంగా విజిలెన్స్ వ్యవస్థ ఉంది. అయితే ఈ విభాగాలు, కమిటీలు స్పందించకపోవడంతో తెరవెనుక ఒప్పందాలు జరిగి ఉండొచ్చని సిట్ అనుమానిస్తోంది. రెండోదశ దర్యాప్తులో నెయ్యి నాణ్యత, తెర వెనుక ఒప్పందాలు, ఎవరు ఎంత లబ్ధి పొందారు.. కల్తీకి కారకులు, బాధ్యులెవరు అన్న అంశాలపై దృష్టి కేంద్రీకరించనుంది.

### సిట్‌కు అదనపు సిబ్బంది

సిట్‌లో సిబ్బంది చాలకపోవడంతో తిరుపతి ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ నరసింగప్ప, పల్నాడు జిల్లా కారంపూడి సీఐ శ్రీనివాసరావును అదనంగా కేటాయించారు.

## ఎన్‌టీఏ.. మళ్లీ అదే 'తప్పు'!

» జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షలో రికార్డు స్థాయిలో 12 ప్రశ్నలు తొలగింపు

» నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరుపై విమర్శలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: జాతీయ స్థాయి పోటీ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మరోసారి 'తప్పు'ల సుడిగుండంలో చిక్కుకుంది. గత నెల నిర్వహించిన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష జేఈఈ మెయిన్-2025 సెషన్-1 తుది ఆన్సర్ కీ నుంచి తప్పులు దొర్లిన కారణంగా రికార్డు స్థాయిలో 12 ప్రశ్నలను (మొత్తం ప్రశ్నలు 90) తొలగించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంత భారీగా తప్పులు చోటుచేసుకొన్న నేపథ్యంలో ఎన్‌టీఏపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రశ్నలను ఉపసంహరించుకున్నప్పటికీ, జేఈఈ పరీక్షలో 0.6 శాతం పరిమితిగా ఉన్న ఎర్రర్ రేట్ 1.6 శాతానికి పెరిగింది. దీంతో ఎన్‌టీఏ పారదర్శకతపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపసంహరించుకున్న ప్రశ్నల్లో సిలబస్ పరిధి దాటినవి, అనువాదాలు దోషాలు ఉన్నవి ఉన్నాయని చెబుతున్నారు. నీట్, నెట్, జేఈఈ వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షలు నిర్వహించే ఎన్‌టీఏ.. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసే విషయంలో మరింత బాధ్యతగా ఉండాలని శృతిషా అనే విద్యార్థిని అన్నారు. ఈ పరీక్షల కోసం తన లాంటి విద్యార్థులు ఏళ్లుగా కష్టపడి చదువుకుంటుంటారని, వారికి ప్రతి ప్రశ్నా ముఖ్యమైనదేనని, ఇలాంటి తప్పులను సహించలేమని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల్లో తప్పులు దొర్లడం ఇదే తొలిసారి కాదు. అయితే ఈసారి ఫైనల్ ఆన్సర్ కీ నుంచి తొలగించిన ప్రశ్నల సంఖ్య గత సంవత్సరాలతో పోలిస్తే ఎక్కువగా ఉండడం ప్రధానంగా చర్చకు దారితీసింది. దీంతో ఎన్‌టీఏ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తింది. గత ఏడాది జేఈఈ మెయిన్ సెషన్-1లో ఆరు, సెషన్-2లో నాలుగు ప్రశ్నలను తొలగించారు. 2021లో జరిగిన రెండు సెషన్లలో ప్రశ్నల్లో ఎలాంటి తప్పులు దొర్లలేదు.

### ఆన్సర్ కీలో తప్పులు

కాగా, భాషా అనువాద దోషాలు పరీక్షా ప్రక్రియపై విశ్వాసాన్ని మరింత తగ్గిస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. జేఈఈ మెయిన్-2025 సెషన్-1 ఆన్సర్ కీలో రెండు అనువాద లోపాలు ఉన్నాయని, ఇది గందరగోళానికి దారితీసిందని పేర్కొన్నారు. తప్పు సమాధానాలను సరైనవిగా గుర్తించడం వలన అదనపు వ్యత్యాసాలు ఏర్పడ్డాయని చెప్పారు. హిందీ, గుజరాతీ భాషల్లో పరీక్ష రాసే విద్యార్థులకు రెండు సమాధాన ఎంపికలు ఉండగా.. మిగతా విద్యార్థులకు ఒక ఆప్షన్ మాత్రమే ఉండడంతో న్యాయబద్ధతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 'చాలా తప్పులు ఉన్నాయి. ఎన్‌టీఏ బాధ్యత తీసుకోవడం లేదా దీనిపై స్పష్టత ఇవ్వడం చేయలేదు. ఏ పరిష్కారం కూడా చూపడం లేదు' అని ఢిల్లీలో జేఈఈ, నీట్ విద్యార్థులకు బోధించే జితేందర్ అహూజా అనే అధ్యాపకుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక ఏజెన్సీగా తప్పులు లేకుండా పరీక్ష నిర్వహించడం వారి బాధ్యత అని, గత అనుభవాల నుంచి ఏమీ నేర్చుకున్నట్లు కనిపించడం లేదని విమర్శించారు. సిలబస్‌లో లేని ప్రశ్నలు ఇవ్వడం ఎన్‌టీఏపై విశ్వాసాన్ని మరింత తగ్గించిందని అన్నారు. సిలబస్‌లోని ప్రశ్నల కారణంగా పరీక్షలో చాలా సమయం కోల్పోవాల్సి వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు. దీని పరీక్షలో తమ ప్రదర్శన, ర్యాంకుపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

# చిత్రజ్యోతి

SINCE 1965

## ప్రేమగాథల పరిచయం

కొత్త సినిమాల విడుదలతో పాటు ప్రేమికుల రోజు కలసి రావడంతో ఈ శుక్రవారం వినోదం రెండింతలైంది. కొత్త పోస్టర్స్‌తో ఇండస్ట్రీ కళకళలాడింది. రసవత్తరమైన ప్రేమగాథలను ప్రేక్షకులకు పరిచయం చేస్తూ తమ చిత్రాల నుంచి కొత్త పోస్టర్లను విడుదల చేశాయి చిత్రబృందాలు. అగ్రతారలు తమ సినిమా అప్డేట్స్‌తో అభిమానులను ఖుషీ చేశారు.

### నీ వెంటే నేనుంటా

నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈనెల 28న విడుదలవుతోంది. ప్రేమికుల రోజు సందర్భంగా ఈ చిత్రంలోని రెండో పాట 'వేర్ ఎవర్ యు గో...'ని మహేశ్ బాబు రిలీజ్ చేశారు. కృష్ణకాంత్ సాహిత్యానికి జి.వి.ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని అందించారు. అర్మాన్ మాలిక్ ఆలపించారు.



### మ్యాజిక్‌తో



ప్రముఖ నిర్మాణసంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై రూపుదిద్దుకుంటున్న చిత్రం 'మ్యాజిక్'. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. సారా అర్జున్, అన్మోల్ కజానీ, ఆకాశ్ శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సంగీత ప్రాధాన్యమున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ స్వరాలందిస్తున్నారు. శుక్రవారం చిత్రబృందం 'డోంట్ నో వై' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. ఐశ్వర్య సురేశ్‌తో కలసి అనిరుధ్ ఆలపించారు. తెలుగు వెర్షన్‌కు కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: గిరీష్ గంగాధరన్, ఎడిటర్: నవీన్ నూలి

### ప్రేమికుల పోరాటం



కథానాయకుడు నాని సమర్పకుడిగా రామ్ జగదీష్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కోర్ట్ -స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటిస్తున్నారు. ప్రియదర్శి ప్రధాన పాత్ర పోషించారు. ప్రశాంత్ త్రిపిర్నేని నిర్మాత. 'ప్రేమలో..' అంటూ సాగే పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, సమీరా భరద్వాజ్ ఆలపించారు. విజయ్ బుల్గానిన్ స్వరపరిచారు. ఈ చిత్రం మార్చి 14న విడుదలవనుంది.

### మహారాణి లుక్‌తో

దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కాంత'. స్పిరిట్ మీడియా, వేఫేరర్ ఫిల్మ్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్,ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. 1950 ల నాటి మద్రాస్ నేపథ్యంలో తెరకెక్కుతోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రేమికుల దినోత్సవం కానుకగా భాగ్యశ్రీ బోర్సే ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. బంగారు ఆభరణాలు, గులాబీ రంగు చీరలో మెరుపులీనుతూ మహారాణిలా కనిపించారు.

### ప్రేమలో రాశీ ఖన్నా

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నీరజా కోన దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా మేకర్స్ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. రాశీ ఖన్నా సిద్ధు బుగ్గపై ముద్దు పెడుతూ చిరునవ్వుతో కనిపిస్తుండగా, శ్రీనిధి శెట్టి అతని ముందు నిలబడి ఉండటం..ఒక పర్ఫెక్ట్ వాలెంటైన్స్ డే పోస్టర్‌ని ప్రజెంట్ చేస్తోంది.

### అందమైన జంట కథ

యువ కథానాయకుడు సుహాస్ తన విభిన్నమైన కథల ఎంపికతో ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఈసారి మరో అందమైన ప్రేమ కథా చిత్రం ' ఓ భామ అయ్యో రామ'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మలయాళ నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) కథానాయికగా పరిచయం అవుతున్నారు. రామ్ గోదల దర్శకత్వంలో హరిష్ నల్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటికి చెందిన స్పిరిట్ మీడియా విడుదల చేయనుంది. కాగా, ప్రేమికుల రోజు సందర్భంగా పోస్టర్‌ని విడుదల చేశారు.



ఇందులో సుహాస్, మాళవిక మనోజ్‌ల రొమాన్స్‌ను చూపిస్తూ, ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచారు.

### షూట్ మొదలు

సందీప్‌రాజ్ దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'మోగ్లీ 2025'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. అటవీ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ప్రేమకథా చిత్రమిది. సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయికగా పరిచయమవుతున్నారు. షూట్ మొదలు అంటూ చిత్రీకరణ ప్రారంభించిన విషయాన్ని తెలుపుతూ హీరో, హీరోయిన్లు తుపాకి గురిపెడుతున్న పోస్టర్‌ను యూనిట్ పంచుకుంది.

### హస్టల్‌లో లవ్‌స్టోరీ

రాయలసీమ భరత్, ప్రీతి జంటగా దర్శక ద్వయం భరత్, సంతోష్ తెరకెక్కిస్తున్న చిత్రం 'జగన్నాథ్'. పీలం పురుషోత్తం నిర్మాత. అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన కార్యక్రమంలో మూవీ టీజర్, పోస్టర్‌ను మంచు మనోజ్ రిలీజ్ చేశారు.

● వినయ్ గోను దర్శకత్వంలో దొమ్మరాజు అమరావతి, శ్రీకాంత్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'నా లవ్ స్టోరీ'. మోహిత్ పెద్దాడ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను 'ఆర్‌ఎక్స్ 100' దర్శకుడు అజయ్ భూపతి లాంచ్ చేశారు.


తెలుసు కదా


ఓ భామ అయ్యో రామ









నా లవ్ స్టోరీ

### ప్రభాస్ సినిమాలో అనుపమ్



ప్రభాస్ హీరోగా హనురాఘవపూడి దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు అనుపమ్‌ఖేర్ నటించనున్నారు. ఈ విషయాన్ని అనుపమ్ ఖేర్ తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'ఇండియన్ సినిమా బాహుబలి ప్రభాస్‌తో నా 544వ చిత్రాన్ని ప్రకటించినందుకు ఆనందంగా ఉంది. ఈ చిత్రానికి అద్భుతమైన ప్రతిభావంతులైన హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు' అని ఆయన పేర్కొన్నారు.

### కొత్త తేదీన దిల్ రూబా



'క' లాంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రూబా'. రుక్సర్ ధిల్లాన్ కథానాయిక. విశ్వకరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. ముందు ప్రకటించిన విధంగా ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న 'దిల్ రూబా' విడుదల కావాల్సి ఉండగా, బెటర్ అవుట్‌పుట్ కోసం సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు యూనిట్ శుక్రవారం ప్రకటించింది. మార్చి 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపింది.

## నాది ఆస్తుల గొడవ కాదు ఆత్మగౌరవ పోరాటం

-మంచు మనోజ్

తనది ఆస్తుల గొడవ కాదని, ఆత్మగౌరవం కోసం చేస్తున్న పోరాటమని సినీ నటుడు, మోహన్‌బాబు తనయుడు మంచు మనోజ్‌కుమార్ అన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం, ఎ. రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం వద్ద బౌన్సర్ల చేతిలో ధ్వంసమైన ఎఫ్5 రెస్టారెంట్‌ను చూసేందుకు శుక్రవారం ఉదయం మనోజ్ వచ్చారు. అయితే రెస్టారెంట్ మూసి ఉండడం చూసి మీడియాతో మాట్లాడారు. తనను అణగదొక్కాలనే ఉద్దేశంతో గురువారం రాయచోటిలో ఆడియో ఫంక్షన్‌కు వచ్చానని తెలిసి ఈ దాడి చేశారని తెలిపారు. తన అనుచరుడైన ఎఫ్5 రెస్టారెంట్ యజమాని అనిల్‌పై దాడి చేసిన బౌన్సర్లు రెస్టారెంట్‌నూ ధ్వంసం చేశారని సమాచారం అందిందన్నారు. మోహన్‌బాబు విశ్వవిద్యాలయం చుట్టుపక్కల ఎంతోమంది రుణాలు తీసుకుని హాస్టల్స్, హోటల్స్ పెట్టి బ్రతుకుతున్నారన్నారు. విశ్వవిద్యాలయంలో పనిచేసే హేమాద్రి నాయుడు, వినయ్ మహేశ్వరి, ఫొటోగ్రాఫర్ మౌళి వారిని కొట్టి బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వీరిని ప్రశ్నిస్తే బౌన్సర్ల చేత దాడులు చేయిస్తున్నారన్నారు. దీన్ని ప్రశ్నించినప్పటి నుంచే తనపై అభాండాలు మొదలయ్యాయన్నారు. అనంతరం మనోజ్‌కుమార్ మరో బాధితుడు, ప్రైవేటు హాస్టల్ యజమాని సురేష్‌రెడ్డితో పాటు చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు వచ్చి సీఐ సుబ్బరామిరెడ్డితో మాట్లాడారు.

చంద్రగిరి, (ఆంధ్రజ్యోతి)




### వీరుడి గాథ మొదలు



యూనివవర్సల్ క్రియేటివ్ స్టూడియోస్, శ్రీకర మూవీ మేకర్స్ బ్యానర్లపై శేషు బాబు, సీహెచ్ కాసుల రామకృష్ణ నిర్మిస్తున్న చిత్రం 'అరి వీర భయంకర'. కిషన్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. అక్సాఖాన్, వైదిక, ఐశ్వర్య, కనిక మోంగ్యా, అర్చనా రాయ్, డెబోర, అమిత శ్రీ, శృతి రాజ్, సోమదత్త, నాగ మహేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం లాంచనంగా ప్రారంభమైంది.

# స్పోర్ట్స్

విజయవాడ ● శనివారం 15 ఫిబ్రవరి 2025

## 'చాంపియన్స్' విజేతకు రూ.19.40 కోట్లు

**భారీగా పెరిగిన ప్రైజ్‌మనీ**

**దుబాయ్:** చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) ప్రైజ్‌మనీని ఐసీసీ ప్రకటించింది. దీనిలో భాగంగా విజేతకు రూ.19 కోట్ల 40 లక్షల మొత్తం దక్కనుంది. రన్నరప్‌నకు రూ.9 కోట్ల 70 లక్షలు అందుతాయి. ఇక సెమీస్‌లో ఓడిన జట్లకు రూ.4 కోట్ల 85 లక్షల చొప్పున ఇవ్వనున్నారు. మొత్తంగా సీటీ ప్రైజ్‌మనీ దాదాపు రూ.60 కోట్లుగా ఉంది. మరోవైపు 2017లో చివరిసారి జరిగిన సీటీతో పోలిస్తే తాజా ప్రైజ్‌మనీ 53శాతం పెరగడం విశేషం. అలాగే ప్రతీ గ్రూప్ మ్యాచ్ విజేతకు కూడా రూ.29 లక్షల 46 వేలు ఇవ్వనున్నారు. ఇది కాకుండా టోర్నీలో పాల్గొనే 8 జట్లకు ప్రాతినిధ్య ఫీజు కింద రూ. కోటీ 8 లక్షల చొప్పున ఇవ్వనున్నారు. ఈనెల 19 నుంచి మార్చి 9 వరకు పాక్, దుబాయ్‌ల్లో ఈ మెగా టోర్నీ జరుగనుంది.

## లంకదే వన్డే సిరీస్

**కొలంబో:** కుశాల్ మెండిస్ (101) తొలుత సెంచరీతో చెలరేగగా..యువ స్పిన్నర్ వెల్లలగే (4/35) మెరవడంతో ఆస్ట్రేలియాతో శుక్రవారం జరిగిన రెండో వన్డేలో శ్రీలంక 174 పరుగులతో ఘన విజయం సాధించింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను లంక క్లీన్‌స్వీప్ చేసింది. మొదట శ్రీలంక 50 ఓవర్లలో 281/4 స్కోరు చేసింది. ఛేదనలో వెల్లలగేతోపాటు మరో స్పిన్నర్ హసరంగ (3/23) తిప్పేయడంతో ఆసీస్ 24.2 ఓవర్లలో 107 రన్స్‌కే కుప్పకూలింది.

# ఆర్‌సీబీ అదిరే బోణీ

- రిచా, ఎలిస్, కనిక మెరుపులు
- గుజరాత్‌పై ఘనవిజయం
- గార్డ్‌నర్ ఆల్‌రౌండ్ షో వృథా

**డబ్ల్యూపీఎల్‌లో నేడు**
**ఢిల్లీ × ముంబై**
**రాత్రి 7.30 నుంచి**



రిచా ఘోష్ (27 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 నాటౌట్)

**వడోదర:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మూడో సీజన్‌కు అదిరే ఆరంభం. కీలక ఆటగాళ్లు గాయాలతో జట్టుకు దూరమైనా డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అద్వితీయ ఆటతీరుతో ఆకట్టుకుంది. గుజరాత్ జెయింట్స్‌పై 202 పరుగుల రికార్డు ఛేదనను సైతం మరో 9 బంతులుండగానే ముగించింది. చివర్లో రిచా ఘోష్ (27 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 నాటౌట్) బౌలర్లను చెడుగుడు ఆడేసుకుంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు చేసింది. గార్డ్‌నర్ (37 బంతుల్లో 3 ఫోర్లు, 8 సిక్సర్లతో 79 నాటౌట్), బెథ్ మూనీ (42 బంతుల్లో 8 ఫోర్లతో 56) అర్ధసెంచరీలు సాధించారు. పేసర్ రేణుకా సింగ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో బెంగళూరు 18.3 ఓవర్లలో 4 వికెట్లకు 202 పరుగులు చేసి గెలిచింది. ఎలిస్ పెర్రీ (34 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 57), కనికా అహూజా (13 బంతుల్లో 4 ఫోర్లతో 30 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. గార్డ్‌నర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రిచా ఘోష్ నిలిచింది.

**రిచా సూపర్:** భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన బెంగళూరుకు రెండో ఓవర్‌లోనే డబుల్ ఝలక్ తగిలింది. అయితే ఎలిస్ పెర్రీతో పాటు ఆఖర్లో రిచా ఘోష్ కళ్లు చెదిరే ఇన్నింగ్స్‌తో ఆదుకుంది. ఇన్నింగ్స్ తొలి రెండు బంతులను ఫోర్లుగా మలిచిన ఓపెనర్ మంధాన (9)తో పాటు మరో ఓపెనర్ వ్యాట్ హాడ్జ్ (4)లను గార్డ్‌నర్ పెవిలియన్‌కు చేర్చింది. ఈ దశలో 14/2 స్కోరుతో ఇబ్బందుల్లో పడిన జట్టును ఎలిస్ పెర్రీ, రాఘ్వి బిస్త్ (25) ఆదుకున్నారు. వీరి దూకుడుతో పవర్‌ప్లేలో జట్టు 51/2 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత కూడా అడపాదడపా బౌండరీలతో ఎలిస్ 27 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. కానీ స్కోరు 100కి చేరాక బిస్త్ వికెట్‌ను డాటిన్ పడగొట్టింది. దీంతో మూడో వికెట్‌కు 86 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక జోరు మీదున్న ఎలిస్‌ను 13వ ఓవర్‌లో పేసర్ సయాలి అవుట్ చేయడంతో ఆర్‌సీబీ తిరిగి కష్టాల్లో పడింది. అయితే 30 బంతుల్లో 60 రన్స్ కావాల్సిన వేళ 16వ ఓవర్‌లో రిచా విజృంభించింది. వరుసగా 4,6,4,4,4తో 23 రన్స్ రాబట్టడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. అటు సాధించాల్సిన రన్‌రేట్ కూడా భారీగా తగ్గింది. తర్వాతి ఓవర్‌లోనూ కనిక రెండు, రిచా ఓ ఫోర్‌తో 16 రన్స్ సమకూరాయి. ప్రియా మిశ్రా ఓవర్‌లోనూ చెలరేగిన రిచా 4,4,6తో 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేయగా.. సమీకరణం 12 బంతుల్లో 7కి మారడంతో ఆర్‌సీబీ సంబరాల్లో మునిగింది. ఓ భారీ సిక్సర్‌తో రిచా 19వ ఓవర్‌లోనే మ్యాచ్‌ను ముగించింది.

**గార్డ్‌నర్, మూనీ హవా:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్ ఆరంభంలో ఓపెనర్ బెథ్ మూనీ, డెత్ ఓవర్లలో కెప్టెన్ అష్లే గార్డ్‌నర్ బెంగళూరుపై విరుచుకుపడ్డారు. ఓ దశలో 150 కూడా కష్టమే అనుకున్నా.. వీరిద్దరి ఆటతో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. పేసర్ రేణుకా సింగ్ మాత్రమే పరుగులను కట్టడి చేయగలిగింది. పవర్‌ప్లేలో కేవలం 39/1 స్కోరు సాధించిన జెయింట్స్‌ను మూనీ ఆదుకునే ప్రయత్నం చేసింది. పదో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో తను 37 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. అయితే కాసేపటికే తను పెవిలియన్‌కు చేరినా.. ఆ తర్వాత ఆర్‌సీబీ బౌలర్లకు గార్డ్‌నర్ చుక్కలు చూపించింది. 14వ ఓవర్‌లో వరుసగా మూడు సిక్సర్లతో 21 పరుగులు రాబట్టింది. అదే జోరులో 25 బంతుల్లోనే హాఫ్ సెంచరీ కూడా పూర్తి చేసుకుంది. అటు డాటిన్ (25) కూడా వేగంగా ఆడడంతో ఇద్దరి మధ్య నాలుగో వికెట్‌కు 31 బంతుల్లోనే 67 పరుగులు సమకూరడం విశేషం. 18వ ఓవర్‌లో సైతం గార్డ్‌నర్ మరో మూడు సిక్సర్లతో 20 రన్స్ రాబట్టింది. ఆఖరి ఓవర్‌లో హర్లీన్ (9 నాటౌట్) రెండు ఫోర్ల సహాయంతో గుజరాత్ డబ్ల్యూపీఎల్‌లో రెండోసారి 200 స్కోరును అందుకుంది.



కనికా అహూజా (13 బంతుల్లో 4 ఫోర్లతో 30 నాటౌట్)

**సంక్షిప్త స్కోర్లు**

**గుజరాత్:** 20 ఓవర్లలో 201/5 (గార్డ్‌నర్ 79 నాటౌట్, మూనీ 56, డాటిన్ 25; రేణుకా సింగ్ 2/25).
**బెంగళూరు:** 18.3 ఓవర్లలో 202/4 (రిచా ఘోష్ 64 నాటౌట్, ఎలిస్ పెర్రీ 57, కనిక 30 నాటౌట్, బిస్త్ 25; గార్డ్‌నర్ 2/33).

**1**

లీగ్ చరిత్రలో అత్యధిక పరుగుల ఛేదన (202)ను పూర్తి చేసిన జట్టుగా ఆర్‌సీబీ.

డబ్ల్యూపీఎల్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (8) బాదిన ప్లేయర్‌గా సోఫీ డివైన్‌తో సంయుక్తంగా నిలిచిన గార్డ్‌నర్.

**2**

ఒకే ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (10) బాదిన రెండో జట్టుగా గుజరాత్. ఢిల్లీ (11) టాప్‌లో ఉంది.

డబ్ల్యూపీఎల్‌లో ఎక్కువ హాఫ్ సెంచరీలు (5) చేసిన రెండో బ్యాటర్‌గా హర్మన్, షఫాలీలతో సంయుక్తంగా నిలిచిన ఎలిస్ పెర్రీ. మెగ్ లానింగ్ (6) టాప్‌లో ఉంది.

## ఆ క్రికెటర్ లగేజి 250 కిలోలు

**లక్షలు చెల్లించిన బోర్డు**

**న్యూఢిల్లీ:** బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియాకు వెళ్లిన భారత బృందంలో ఓ స్టార్ క్రికెటర్ ఏకంగా 250 కిలోల లగేజీని తీసుకెళ్లడం చర్చనీయాంశమైంది. అతని లగేజీలో మొత్తం 27 బ్యాగులున్నాయట. అయితే ఇవన్నీ ఆటగాడికి సంబంధించినవే అనుకుంటే పొరపాటే. అతడి కుటుంబ సభ్యులు, వ్యక్తిగత సిబ్బంది లగేజిని కూడా తనదిగా చూపించి ఖర్చంతా బీసీసీఐపై వేశాడని సమాచారం. ఇందుకోసం బోర్డు లక్షల్లో ఖర్చు చేయాల్సి వచ్చింది. వాస్తవానికి బోర్డు నిబంధనల ప్రకారం ప్లేయర్ కుటుంబ సభ్యులు, అతని వ్యక్తిగత సహాయకుల లగేజీ వారి వెంటే ఉండాలి. కానీ ఆ క్రికెటర్ బోర్డుపై ఒత్తిడి తెచ్చి వాటన్నింటినీ తన సొంత లగేజీగా చూపించాడు. భారత్ నుంచి ఆసీస్‌కు, అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలోనే కాకుండా.. ఆసీస్‌లో వేదికలు మారినప్పుడు కూడా లగేజి ఖర్చును బోర్డు మీదే రుద్దాడు. అందుకే ఈ టూర్ పూర్తయ్యాక బీసీసీఐ నిబంధనలు కఠినతరం చేసింది. ఇప్పుడు ఏ ఆటగాడైనా 150 కిలోలకు మించి లగేజిని వెంట తీసుకెళ్లడానికి లేదు.

*250 కిలోల లగేజీ ప్రయాణ ఖర్చులు బోర్డు నెత్తిన రుద్దిన ఆ స్టార్ ఆటగాడు ఎవరనేది మాత్రం వెల్లడికాలేదు. కానీ ఆ లగేజీలో 17 బ్యాట్లు ఉండడాన్ని బట్టి చూస్తే...అతను ఖచ్చితంగా ఓ బ్యాటర్ అని మాత్రం తెలుస్తోంది. అయితే భారత స్టార్లలో ఒకడైన రోహిత్ శర్మ భార్య రితిక బిడ్డకు జన్మనిచ్చినందున అతని కుటుంబ సభ్యులు ఆస్ట్రేలియా వెళ్లలేదు. ఇక మిగిలిన ఒకరిద్దరు స్టార్లలో ఆ లగేజీ స్టార్ ఎవరో?*

## క్వార్టర్స్‌లో అవుట్

**ఆసియా మిక్స్‌డ్ బ్యాడ్మింటన్‌లో ముగిసిన భారత్ పోరు**

**కింగ్డావో (చైనా):** ద్వితీయ శ్రేణి జట్టుతో బరిలోకి దిగిన భారత్‌కు ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో నిరాశే మిగిలింది. 2023 టోర్నీ కాంస్య పతక విజేత అయిన భారత్ క్వార్టర్‌ఫైనల్లో 0-3తో జపాన్ చేతిలో ఓటమిపాలై టోర్నీలో తన పోరాటాన్ని ముగించింది. మొదట మిక్స్‌డ్ డబుల్స్ పోరులో ధ్రువ్ కపిల/తనీషా జోడీ 13-21, 21-17, 13-21తో హిరోకి/సయిటో జంట చేతిలో ఓడగా, స్టార్ షట్లర్ సింధు గైర్హాజరీలో మహిళల సింగిల్స్‌లో పోటీపడ్డ మాళవిక 12-21, 19-21తో ప్రపంచ 8వ ర్యాంకర్ టొమొకా మియాజకి చేతిలో పరాజయం పాలైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో వెటరన్ స్టార్ హెచ్‌ఎస్ ప్రణయ్‌పై 21-14, 15-21, 21-12తో ప్రపంచ 16వ ర్యాంకర్ కెంటా నిషిమొటో గెలిచాడు. దీంతో వరుసగా మూడు ఓటములతో భారత్ పరాజయం ఖరారవడంతో నామమాత్రమైన మిగతా రెండు మ్యాచ్‌లను ఆడించలేదు.

## ఐపీఎల్ మార్చి 22 నుంచి?

**మే 25న ఫైనల్!**
**తొలి పోరులో కోల్‌కతా × బెంగళూరు ఢీ**

**న్యూఢిల్లీ:** ఈ సీజన్ ఐపీఎల్ షెడ్యూల్‌ను పాలక మండలి ఖరారు చేసినట్టు తెలిసింది. కీలక మ్యాచ్‌లకు సంబంధించిన వివరాలను ఇప్పటికే ఆయా ఫ్రాంచైజీలకు బీసీసీఐ పంపినట్టు సమాచారం. త్వరలో పూర్తి వివరాలను వెల్లడించనుంది. ఖరారైన షెడ్యూల్ ప్రకారం..మార్చి 22న ఐపీఎల్ మొదలవనుంది. తొలి మ్యాచ్ డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా, బెంగళూరు మధ్య ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది. మరుసటిరోజు (మార్చి 23న) హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను రాజస్థాన్‌ను ఢీకొననుంది. ఫైనల్ పోరు మే 25న ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది. క్వాలిఫయర్-1, ఎలిమినేటర్‌కు హైదరాబాద్, క్వాలిఫయర్-2కు కోల్‌కతా ఆతిథ్యమివ్వనున్నాయి.



## చాంపియన్ న్యూజిలాండ్

**'ముక్కోణపు' ఫైనల్లో పాకిస్థాన్ ఓటమి**

**కరాచీ:** చాంపియన్స్ ట్రోఫీకి ముందు అత్యంత ఆత్మవిశ్వాసం లభించే విజయం న్యూజిలాండ్ అందుకుంది. ముక్కోణపు వన్డే సిరీస్ టైటిల్‌ను ఆ జట్టు దక్కించుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్లో ఆతిథ్య పాకిస్థాన్‌ను ఐదు వికెట్లతో కివీస్ ఓడించింది. తొలుత పాకిస్థాన్ 49.3 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రిజ్వాన్ (46), సల్మాన్ ఆఘా (45), తయ్యబ్ (38) రాణించారు. ఒరౌర్క్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో న్యూజిలాండ్ 45.2 ఓవర్లలో 243/5 స్కోరు చేసి నెగ్గింది. మిచెల్ (57), లాథమ్ (56), కాన్వే (48) అదరగొట్టారు. నసీమ్ షా రెండు వికెట్లు తీశాడు.

# బిజినెస్

## 17 ఏళ్ల తర్వాత లాభాల్లోకి బీఎస్ఎన్ఎల్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ రూ.262 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. బీఎస్ఎన్ఎల్ లాభాల్లోకి మళ్లడం దాదాపు 17 ఏళ్లలో ఇదే తొలిసారని, కంపెనీకిది కీలక మలుపు అని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. బీఎస్ఎన్ఎల్ పలు అంశాల్లో తన పనితీరును మెరుగుపరుచుకుందన్నారు. మొబిలిటీ, ఎఫ్‌టీటీహెచ్, లీజ్డ్ లైన్ సేవల్లో 14-18 శాతం వృద్ధి కనబరిచిందని, జూన్ నాటికి 8.4 కోట్లుగా ఉన్న కస్టమర్లను సైతం డిసెంబరు చివరినాటికి 9 కోట్లకు పెంచుకోగలిగిందన్నారు. చివరిసారిగా 2007లో లాభాలను నమోదు చేసుకున్న కంపెనీ.. ఆ తర్వాత వరుస నష్టాలు, ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ వచ్చింది.

## జనవరి ద్రవ్యోల్బణం 2.31%

న్యూఢిల్లీ: దేశంలో ఆహార వస్తువులు.. ప్రత్యేకించి కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం జనవరిలో 2.31 శాతానికి దిగివచ్చింది. గత డిసెంబరులో ఇది 2.37 శాతం ఉంది. ఆహార వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం డిసెంబరులో 8.47 శాతంతో పోల్చితే 5.88 శాతానికి తగ్గింది. కూరగాయల విభాగంలో ద్రవ్యోల్బణం 28.65 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గింది.

## చంద్రశేఖరన్‌కు నైట్‌హుడ్ అవార్డు

న్యూఢిల్లీ: టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌కు బ్రిటన్ గౌరవ నైట్‌హుడ్ అవార్డు అందచేసింది. భారత-బ్రిటన్ వ్యాపార సంబంధాల పటిష్ఠతకు కృషి చేసినందుకుగాను చంద్ర ఈ అవార్డును కింగ్ చార్లెస్ నుంచి అందుకున్నట్టు టాటా గ్రూప్ ఒక ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. చంద్ర దీనికి స్పందిస్తూ.. తమ గ్రూప్‌కి అందిస్తున్న ప్రోత్సాహానికి బ్రిటిష్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. యూకేలో తమ గ్రూప్ కార్యకలాపాలు మరింత పటిష్ఠం చేసేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# సుంకాల యుద్ధం మరింత తీవ్రం

**పరస్పర సుంకాలకు ట్రంప్ గ్రీన్‌సిగ్నల్ ▸▸ భారత్‌పైనా తీవ్ర ప్రభావం ▸▸ ఇప్పటికే 'బేర్'మంటున్న స్టాక్ మార్కెట్**

**మున్ముందు మరింత డౌన్‌ట్రెండ్ ఉండే చాన్స్**

కన్నుకి కన్ను.. పన్నుకి పన్ను. ఇదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నూతన వాణిజ్య విధానం. 'ఏ దేశంతో ఎంత దోస్తానా ఉన్నా.. వాణిజ్యంలో మాత్రం అది కుదరదు. మా ఉత్పత్తులపై మీరు ఎంత సుంకం విధిస్తే, మీ ఉత్పత్తులపై మేమూ అంతే (రెసిప్రోకల్) సుంకాలు విధిస్తాం. ఇది కూడా కాదని వాణిజ్యేతర రక్షణ విధానాలతో మా ఎగుమతులను కట్టడి చేస్తే, మీ ఎగుమతులపై మేమూ అదే పని చేస్తాం' అని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నా బెస్ట్ ఫ్రెండ్ అని చెప్పే ట్రంప్.. ఈ పరస్పర సుంకాల విషయాన్ని ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న మోదీ సమక్షంలోనే ప్రకటించడం విశేషం. ఏప్రిల్ 2 నుంచి ఈ కొత్త సుంకాల అమలు ప్రక్రియ ప్రారంభమవుతుందని అమెరికా నూతన వాణిజ్య మంత్రిగా నియమితులైన హోవార్డ్ లుట్నిక్ ప్రకటించారు.

**పరస్పర సుంకాలు అంటే?**

ఒక దేశం ఇంకో దేశం నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులపై ఎంత సుంకం విధిస్తుందో, ఆ దేశం నుంచి ఎగుమతయ్యే వస్తువులపై అవతలి దేశమూ అంతే సుంకం విధించడాన్ని పరస్పర సుంకాలు అంటారు. ఉదాహరణకు అమెరికా నుంచి దిగుమతయ్యే ఆటోమొబైల్స్‌పై చైనా 25 శాతం దిగుమతి సుంకం విధిస్తే, అమెరికా కూడా చైనా నుంచి దిగుమతయ్యే ఆటోమొబైల్స్‌పై అదే స్థాయిలో 25 శాతం దిగుమతి సుంకం విధిస్తుంది. ఇలా చేయకపోబట్టే ఇతర దేశాలు తమ ఉత్పత్తులను చౌకగా అమెరికా మార్కెట్లో కుమ్మరిస్తూ, తమ మార్కెట్లలో మాత్రం అధిక సుంకాలు లేదా వాణిజ్యేతర ఆంక్షలతో అమెరికా ఎగుమతులను అడ్డుకుంటున్నాయని ట్రంప్ ఆరోపణ. దీనికి చెక్ పెట్టాలంటే ఈ సుంకాలు తప్పవని ట్రంప్ మొదటి నుంచి చెబుతూనే ఉన్నారు. అధికారం చేపట్టి నెలైనా తిరక్కుండానే అందుకు శ్రీకారం చుట్టారు.

**దారికొస్తున్న దేశాలు**

ఈ హెచ్చరికలు ఫలిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈయూతో సహా అనేక దేశాలు 'ట్రంప్ మహాశయా, నీతో పెట్టుకోం. చర్చల ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకుందాం' అని ఇప్పటికే సంకేతాలు పంపించాయి. పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా చైనా కూడా ఏదోలా ట్రంప్‌తో వాణిజ్య 'సంధి'కే ప్రయత్నిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ కూడా ఇదే పనిలో ఉన్నారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అమెరికా నుంచి దిగుమతయ్యే హార్లే డేవిడ్‌సన్ బైక్స్‌పై మన దేశం ఇప్పటికే సుంకాలను భారీగా తగ్గించింది. వాణిజ్య లోటు తగ్గించేందుకు మరిన్ని అమెరికా వస్తువులపై దిగుమతి సుంకాలు తగ్గించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు సమాచారం. దీంతోపాటు పెద్దఎత్తున అమెరికా ఆయుధాలు, చమురు, ఎల్ఎన్‌జీ దిగుమతులకూ సై అనబోతోంది.




**మనకూ నష్టమే..**

ట్రంప్ సుంకాల ప్రభావం మన దేశంపైనా పడనుంది. కాకపోతే అది చైనా, జపాన్, ఈయూ దేశాలపై ఉన్నంత తీవ్రంగా ఉండకపోవచ్చని నిపుణుల అంచనా. గత ఏడాది భారత-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 19,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.16.49 లక్షల కోట్లు) చేరింది. ఇందులో దాదాపు 5,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.4.34 లక్షల కోట్లు) మన దేశానికి మిగులు ఉంది. అమెరికా మొత్తం ఎగుమతి, దిగుమతుల్లో మన వాటా అంతంత మాత్రమే. అయితే మన దేశానికి చెందిన కొన్ని రంగాలు ట్రంప్ సుంకాలతో దెబ్బతింటాయని భావిస్తున్నారు. అవేమిటంటే.

**ఫార్మా**

భారత ఫార్మాకు అమెరికా అతిపెద్ద మార్కెట్. గత ఏడాది మన ఫార్మా కంపెనీలు ఆ దేశానికి దాదాపు రూ.72,300 కోట్ల విలువైన ఔషధాలు ఎగుమతి చేశాయి. ఇందులో జెనరిక్ మందులదే అత్యధిక వాటా. ఇప్పుడు ఈ సుంకాలతో అమెరికాకు మన ఫార్మా ఎగుమతులు దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. శుక్రవారం నాట్కో, లారస్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వంటి దిగ్గజ ఫార్మా కంపెనీల షేర్లు భారీగా నష్టపోవడానికి ట్రంప్ సుంకాలే ప్రధాన కారణం.

**టెక్స్‌టైల్స్**

మన వస్త్ర పరిశ్రమ ఎగుమతులకూ అమెరికానే ప్రధాన కారణం. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, బంగ్లాదేశ్ పరిణామాలతో అనేక అమెరికా టెక్స్‌టైల్ కంపెనీలు మన దేశం నుంచి దిగుమతులు పెంచాయి. ట్రంప్ పరస్పర సుంకాలతో దీనికి బ్రేక్ పడే ప్రమాదం కనిపిస్తోంది.

**ఐటీ ఎగుమతులు**

మన ఐటీ ఎగుమతులకూ అమెరికానే అతిపెద్ద మార్కెట్. ట్రంప్ సుంకాల ప్రభావం నేరుగా మన ఐటీ ఎగుమతులపై ఉండకపోయినా, ఆ ఉద్రిక్తతల ప్రభావం మాత్రం మన ఐటీ పరిశ్రమపై బాగానే ఉంటుంది. ట్రంప్ తొలిసారిగా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తెచ్చిన హెచ్-1బీ వీసా నిబంధనలు, ఆ దేశంలో మన ఐటీ నిపుణుల ఉద్యోగ అవకాశాలను బాగా దెబ్బతీశాయి. ఇప్పుడు ఈ దుందుడుకు నిర్ణయాల ప్రభావం ఐటీ కంపెనీలపైనా కొద్దో గొప్పో పడక తప్పదు.

**స్టీల్ పరిశ్రమ**

అమెరికా మొత్తం స్టీల్ దిగుమతుల్లో మన వాటా 5 శాతానికంటే తక్కువే. అయినా డొనాల్డ్ ట్రంప్ మన దేశాన్నీ చైనా, కెనడా, మెక్సికో, బ్రెజిల్‌లా ఒకే గాటన కట్టేసి 25 శాతం సుంకం విధించారు. దీంతో టాటా స్టీల్, సెయిల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ వంటి కంపెనీల లాభాలకు ఇప్పటికే గండిపడి స్టాక్ మార్కెట్లో ఆ కంపెనీల షేర్లు కుదేలవుతున్నాయి. ట్రంప్ సుంకాలతో చైనా తన మిగులు స్టీల్‌ను భారత మార్కెట్లోకి డంప్ చేసే ప్రమాదం మరింత పెరిగిందని పరిశ్రమ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

## ఆరేళ్లలో రూ.100 కోట్ల పెట్టుబడులు

**ఎన్‌సీఎల్ వేకాలో 50% వాటా కొనుగోలు**
**జర్మనీ సంస్థ వేకా వెల్లడి**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జర్మనీకి చెందిన యూపీవీసీ ఉత్పత్తుల తయారీ సంస్థ వేకా.. భారత్‌లో ఎన్‌సీఎల్ లిమిటెడ్ భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌సీఎల్ వేకాలో వంద శాతం యాజమాన్య హక్కులను చేజిక్కించుకుంది. ఈ భాగస్వామ్య సంస్థలో వేకాకు 50 శాతం వాటాతో పాటు ఎన్‌సీఎల్, ఇతర వాటాదారులకు మరో 50 శాతం వాటాలున్నాయి. వ్యూహాత్మక టేకోవర్‌లో భాగంగా ఈ సంస్థలో ఎన్‌సీఎల్ సహా ఇతర వాటాదారుల నుంచి మిగిలిన 50 శాతం వాటాలను కొనుగోలు చేసినట్లు వేకా ఏజీ జర్మనీ సీఈఓ ఆండ్రెస్ హార్ట్‌లీఫ్ వెల్లడించారు. అయితే ఈ వాటాల కొనుగోలు కోసం ఎంత మొత్తం వెచ్చించారనేది మాత్రం ఆయన వెల్లడించలేదు. ఈ కొనుగోలుతో అంతర్జాతీయ, భారతీయ మార్కెట్లలో కంపెనీ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటుందన్నారు. ప్రస్తుతం కంపెనీ హైదరాబాద్ సమీపంలోని నర్సాపూర్ వద్ద ప్లాంట్‌ను నిర్వహిస్తోంది. ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 28,000 టన్నులు. కాగా వచ్చే ఆరేళ్ల కాలంలో విస్తరణ కోసం రూ.100 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ ఎండీ యుఎస్ మూర్తి చెప్పారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది రూ.16 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు మూర్తి తెలిపారు.

## అష్ట నష్టాలు

**8 రోజుల్లో రూ.25 లక్షల కోట్లు ఉఫ్**
**2,645 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్**

ముంబై: భారత స్టాక్ మార్కెట్‌పై బేర్ పట్టు బిగించింది. ట్రంప్ సుంకాల పోటు, తరలిపోతున్న విదేశీ సంస్థాగత పెట్టుబడులతో పాటు నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాల కారణంగా ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా 8వ రోజూ నష్టాల్లో పయనించాయి. శుక్రవారం సెన్సెక్స్ 76,000, నిఫ్టీ 23,000 స్థాయిలను కోల్పోయాయి. సెన్సెక్స్ 199.76 పాయింట్లు క్షీణించి 75,939.21 వద్దకు జారుకుంది. నిఫ్టీ 102.15 పాయింట్ల నష్టంతో 22,929.25 వద్ద ముగిసింది. చిన్న, మధ్య స్థాయి కంపెనీల ప్రాతినిధ్య సూచీలైన బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఏకంగా 3.24 శాతం, మిడ్‌క్యాప్ 2.59 శాతం నష్టపోయాయి. కాగా, గడిచిన 8 ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,644.6 పాయింట్లు (3.36 శాతం), నిఫ్టీ 810 పాయింట్లు (3.41 శాతం) పతనమయ్యాయి. ఎనిమిది రోజుల్లో రూ.25.31 లక్షల కోట్ల మార్కెట్ సంపద హరించుకుపోయింది. దాంతో బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.400.19 లక్షల కోట్లకు (4.61 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

## ఐపీఓకు యశోద హాస్పిటల్స్

**రూ.4,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం**

ముంబై: హైదరాబాద్‌కు చెందిన యశోద హాస్పిటల్స్ కూడా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు వచ్చే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఓ ద్వారా రూ.4,000 కోట్ల వరకు సమీకరించేందుకు ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, కంపెనీ విలువ తదితర అంశాలపై ఈ హాస్పిటల్ నెట్‌వర్క్.. బ్యాంకర్లతో ప్రాథమిక చర్చలు జరుపుతున్నట్లు ఎకనామిక్స్ టైమ్స్ కథనం పేర్కొంది. ఐపీఓలో భాగంగా తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ఇన్వెస్టర్లు కొంత వాటాను ఉపసంహరించుకునే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం యశోద హాస్పిటల్స్ మొత్తం 4,000 పడకల సామర్థ్యంతో కూడిన నాలుగు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు 4 హార్ట్ ఇన్‌స్టిట్యూట్లు, 4 క్యాన్సర్ కేర్ ఇన్‌స్టిట్యూట్లను నిర్వహిస్తోంది.

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 103 | విజయవాడ | 111 |
| వరంగల్ | 103 | గుంటూరు | 110 |
| కరీంనగర్ | 103 | ఒంగోలు | 110 |
| మహబూబ్‌నగర్ | 103 | చిత్తూరు | 80 |
| కర్నూలు | 103 | నెల్లూరు | 85 |
| విశాఖపట్నం | 103 | అనంతపురం | 85 |
| గోదావరి | 111 | | |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| 15వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 440 | విజయవాడ | 450 |
| వరంగల్ | 442 | గోదావరి | 455 |
| చిత్తూరు | 493 | విశాఖపట్నం | 465 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 87,160 ▲ | 79,900 ▲ | 1,08,000 ▲ |
| విజయవాడ | 88,700 ▲ | 82,500 ▲ | 98,300 ▲ |
| విశాఖపట్నం | 86,150 ▼ | 78,970 ▼ | 98,120 ▲ |
| రాజమండ్రి | 87,160 ▲ | 79,900 ▲ | 99,900 ▲ |
| ప్రొద్దుటూరు | 88,700 ▲ | 82,140 ▲ | 97,900 ▲ |
| ముంబై | 85,998 ▲ | 78,774 ▲ | 97,953 ▲ |

# తప్పు చేసి ఎదురుదాడి!

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరించేందుకు శుక్రవారమిక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ఆయన.. అందుబాటులో ఉన్న నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వంశీ అంశాన్ని నాయకులు ప్రస్తావించగా.. ఆయన పైవిధంగా స్పందించారు. 'అధికారంలో ఉన్నప్పుడు కిడ్నాపులు, దారుణాలు చేశారు. లా అండ్ ఆర్డర్‌ను పక్కనపెట్టేసి పోలీసులును ప్రతిపక్ష నాయకులపై దాడులకు ఉపయోగించారు. ఇప్పుడూ అదే కొనసాగిద్దామనుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి రాష్ట్రాభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిస్తుంది. తప్పు చేసిన వారి విషయంలో చట్టం కఠినంగా వ్యవహరిస్తుందనే సంకేతాలు పంపకపోతే నాయకుల ముసుగులో ఉన్న నేరగాళ్లు మరింత బరితెగిస్తారు' అని చంద్రబాబు స్పష్టం చేశారు. జంగిల్‌రాజ్ పోయి జనరాజ్యం వచ్చిందన్న స్పష్టమైన సంకేతాలు పంపాలన్న ఆయన అభిప్రాయంతో నేతలూ ఏకీభవించారు. ఓట్ల కోసం నా దళితులని ప్రచారం చేసుకున్న జగన్, ఆయన అనుచరులకు అప్పుడు, ఇప్పుడు ఆ దళితులే టార్గెట్‌గా మారారని వారు వ్యాఖ్యానించారు.

### ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికపై కమిటీ

ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికపై చర్చ జరిగింది. ఎవరికి మద్దతివ్వాలి.. బహిరంగంగా ఇవ్వాలా లేదా.. ఇలాంటి అంశాలపై క్షేత్రస్థాయి పరిస్థితులను నివేదించడానికి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, ఎంపీ భరత్‌తో ఓ కమిటీ వేశారు. ఈ కమిటీ శనివారం నివేదిక ఇస్తుంది. అలాగే కొత్తగా సభ్యత్వ నమోదు చేసుకున్న వారిలో కొందరు చనిపోయారని, సాంకేతిక కారణాల వల్ల వారిలో కొందరికి బీమా వచ్చే అవకాశం లేదని, అలాంటి వారికి పార్టీయే డబ్బులు చెల్లించాలని నిర్ణయించారు. భేటీలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, షరీఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

# మట్టికొట్టుకు పోతారు



గురువారం రాత్రి వల్లభనేని వంశీని విజయవాడలోని కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

- న్యాయాధికారి వింటుండగానే వంశీ నోటి దురుసు
- తనపై కేసు పెట్టిన, పెట్టించిన వారికి శాపనార్థాలు
- వాదనలు వాయిదా వేసిన కాసేపటికి రిమాండ్ విధింపు

విజయవాడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తనపై కేసు పెట్టినవారు, పెట్టించిన వారి కుటుంబాలు మట్టికొట్టుకుని పోతాయని మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ శాపనార్థాలు పెట్టారు. వాదనల అనంతరం న్యాయాధికారి చాంబర్ నుంచి బయటకు వస్తున్న సమయంలో ఆయన వింటుండగానే తన నోటి దురుసును ప్రదర్శించారు. గురువారం రాత్రి వంశీని విజయవాడలోని నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయాధికారి రామ్మోహన్ చాంబర్‌లోకి వంశీని పిలిచిన తర్వాత తాము చెప్పుకోవాల్సింది ఉందని ఆయన తరఫున న్యాయవాదులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, తానేటి చిరంజీవి కోరారు. దీంతో న్యాయాధికారి వాదనలకు అనుమతించారు. వంశీపై పోలీసులు నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ చెల్లదని, తనను కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదుదారుడు ఫిర్యాదులో ఎక్కడా రాయలేదని వాదించారు. దీంతో 'అసలు మీరు ఫిర్యాదును చదివారా? లేదా?' అని న్యాయాధికారి సూటిగా ప్రశ్నించారు. ఫిర్యాదులో ఏముందో చదవాలని వారికి సూచించారు. ఈ కేసులో ముదునూరి సత్యవర్ధన్ ఇప్పటికే న్యాయాధికారి ముందు 161 వాంగ్మూలం ఇచ్చాడని, అతడిని బాధితుడిగా ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. పొన్నవోలు పదేపదే ఇదే అంశంపై వాదిస్తుండటంతో న్యాయాధికారి స్పందించారు. 161 గురించి చాలా సార్లు చెప్పారని, కొత్త అంశం ఏమైనా ఉంటే దాని గురించి వాదించాలని సూచించారు.

### న్యాయాధికారి అసహనం

గురువారం రాత్రి 10 గంటలకు వంశీని కోర్టుకు తీసుకొస్తామని పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఆ సమయానికి న్యాయాధికారి చాంబర్‌కు చేరుకున్నారు. గంట దాటినా పోలీసులు రికార్డును తీసుకురాకపోవడంతో న్యాయాధికారి అసహనం వ్యక్తం చేశారు. రెండుసార్లు చాంబర్ నుంచి బయటకు వచ్చి వెళ్లిపోవడానికి సిద్ధమయ్యారు. పోలీసులు ఆయనకు నచ్చజెప్పుకున్నారు. గంట తర్వాత రికార్డులు కోర్టుకు వచ్చాయి. వాదనలు మొత్తం కోర్టు హాలులో జరుగుతాయని భావించారు. కానీ న్యాయాధికారి మాత్రం చాంబర్‌లోనే వాదనలు వింటానని చెప్పారు. వంశీ తరఫున మాజీ ఏజీ పొన్నవోలు, తానేటి చిరంజీవి, పోలీసు శాఖ తరఫున సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేంద్రప్రసాద్, సమీర, కల్యాణి వాదనలు వినిపించారు. సుదీర్ఘంగా వాదనలు జరుగుతుండగా నిందితుడ్ని శుక్రవారం కోర్టులో హాజరుపరచాలని న్యాయాధికారి ప్రకటించారు. దీంతో చాంబర్‌లో ఉన్న న్యాయవాదులు బయటకు వచ్చేశారు. చాంబర్ నుంచి బయటకు వస్తున్న సమయంలో వంశీ నోటి దురుసును ప్రదర్శించారు. తనపై కేసు పెట్టినవారు, పెట్టించిన వారి కుటుంబాలు మట్టికొట్టుకుని పోతాయని శాపనార్థాలు పెట్టారు. ఈ మాటలు చాంబర్‌లో ఉన్న న్యాయాధికారి విన్నారు. తర్వాత కాసేపటికి పోలీసులను, న్యాయవాదులను లోపలకు పిలిచి తీర్పు వెలువరిస్తానని, వేచి ఉండాలని చెప్పారు. వాదనలు వాయిదా వేసిన కాసేపటికే న్యాయాధికారి ఈ నిర్ణయం తీసుకోవడంతో ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. వంశీకి రిమాండ్ విధించినట్టు అర్ధరాత్రి 2.30 గంటల తర్వాత న్యాయాధికారి ప్రకటించారు. అయితే వంశీని ఏ జైలుకు తరలిస్తారన్న దానిపై కొంతసేపు సందిగ్ధత ఏర్పడింది. కొద్దినెలల క్రితం కారాగారాల పరిధిలో మార్పులు వచ్చాయి. విజయవాడ కోర్టుల్లో రిమాండ్ విధించిన నిందితులను నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో వంశీని కూడా నెల్లూరు జైలుకు తరలిస్తారని భావించారు. అయితే ఆయనను విజయవాడలోని జిల్లా జైలుకు తరలించాలని న్యాయాధికారి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జైలుకు తరలించడానికి ముందు సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న సీడీఐసీ (సెంట్రల్ డిటెక్షన్ ఇంటరాగేషన్ సెల్)లో వంశీ వేలిముద్రలు, ఐరిష్‌తో పాటు ఫొటోలు తీశారు.

### వంశీని పది రోజుల కస్టడీకి ఇవ్వండి

- ఎస్సీ, ఎస్టీ కోర్టులో పోలీసుల పిటిషన్

వల్లభనేని వంశీని పది రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టులో పటమట పోలీసులు శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడిగా ఉన్న ముదునూరి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి, బెదిరించి కేసు నుంచి తప్పుకునేలా చేశారని పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు వంశీని కస్టడీకి ఇవ్వాలని కోరారు. అలాగే సాంకేతిక ఆధారాల పరిశీలన కోసం వంశీ ఉపయోగించిన ఫోన్లను స్వాధీనం చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా కృష్ణాజిల్లా ఉంగుటూరు, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో వంశీ చేసిన అక్రమాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. వాటిలో విచారించేందుకు గాను అక్కడి పోలీసులు రెండు, మూడు రోజుల్లో ఎస్సీ, ఎస్టీ కోర్టులో పీటీ వారెంట్లు దాఖలు చేస్తారని సమాచారం.

### వంశీ సన్నిహితుడి ఇంట్లో
# సత్యవర్ధన్ నిర్బంధం?

- ముగ్గురిని బెజవాడకు తరలించిన పోలీసులు

వంశీ అరెస్టుకు కారణమైన కిడ్నాప్ కేసులో బాధితుడు సత్యవర్ధన్‌ను రెండు రోజులు విశాఖలోనే ఉంచడానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి జరిగింది. ఆ ఘటనపై కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిని వెనక్కి తీసుకోవాలని బెదిరించడానికి సత్యవర్ధన్‌ను వంశీ అనుచరులు కిడ్నాప్ చేసి విశాఖపట్నం తీసుకొచ్చి విశాఖలో వంశీకి పరిచయస్తులైన వ్యక్తుల ఇంట్లో దాచారు. దర్యాప్తు చేపట్టిన విజయవాడ పోలీసులు సత్యవర్ధన్ కోసం గురువారం ఉదయం విశాఖకు వచ్చారు. సత్యవర్ధన్‌ను, ఆయన్ను తీసుకొచ్చిన మరో ముగ్గురిని(వంశీ మనుషులు) అదుపులోకి తీసుకొని విజయవాడ తీసుకువెళ్లారు. వారికి ఆశ్రయం ఇచ్చిన వ్యక్తిని ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. విజయవాడ నుంచి వచ్చిన వారు తమ బంధువులని, తాము టీడీపీ అభిమానులమని ఇంటి యజమాని కుటుంబం చెబుతున్నట్టు సమాచారం.

# కోర్టులో తిట్లు.. జైల్లో చిందులు

(మొదటి పేజీ తరువాయి)

జైలుకు తరలించారు. జైలులో ఒకటో నంబర్ బ్యారక్‌లో గదిని ఇచ్చారు. 7641 రిమాండ్ ఖైదీ నంబర్‌ను కేటాయించారు. అయితే, బ్యారక్ ఏమాత్రం శుభ్రంగా లేదని, తనకు మరొకటి కేటాయించాలంటూ వంశీ వీరంగం చేసినట్టు తెలిసింది. జైలులో ఉన్న అన్ని బ్యారక్‌ల్లో ఖైదీలు ఉన్నారని, ఉన్నవాటిలో మంచి బ్యారక్‌నే కేటాయించామని అధికారులు నచ్చజెప్పాలని ప్రయత్నించినా, ఆయన శాంతించలేదు. బాత్‌రూంలో వెస్టర్న్ టాయ్‌లెట్ కావాలని పట్టుబట్టారు. అయితే, దాన్ని ఏర్పాటు చేయడం తమ వల్ల కాదని అధికారులు తేల్చి చెప్పేశారు. నిద్రపోవడానికి మంచం కావాలని అధికారులతో వాదనకు దిగారు. నడుము నొప్పి తీవ్రంగా ఉన్నందున తాను కింద పడుకోలేనని ఆయన అనగా, దీన్ని వైద్యులకు చెబుతామని, వారు సూచిస్తే మంచం ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. జైలులో ఉన్న అధికారులు వైద్యులతో వంశీకి పరీక్ష చేయించారు. ఆయనకు ఎలాంటి వెన్నునొప్పి లేదని వైద్యులు చెప్పడంతో మంచం ఏర్పాటు చేయలేమని వంశీకి అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఆయన అసహనంతో ఊగిపోయారు. జైలు అధికారుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. జైలులో ఉన్న సదుపాయాలనే తాము నిబంధనల ప్రకారం కల్పిస్తామని, అదనపు సౌకర్యాలు కావాలనుకుంటే న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసుకోవాలని అధికారులు సూచించారు. కోర్టు ఆదేశాలు ఇస్తే ఆవిధంగా చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అధికారులతో కాసేపు వాదన చేసిన వంశీ, ఆ తర్వాత బ్యారక్‌లోకి వెళ్లిపోయారని విశ్వసనీయంగా తెలిసింది.

### వంశీ పీఏ, డ్రైవర్ అరెస్టు

ముదునూరి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి, బెదిరించిన కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఏ4గా ఉన్న ఘంటా వీర్రాజు అలియాస్ రాజు, ఏ5గా ఉన్న వంశీబాబును అరెస్టు చేశామని పటమట పోలీసులు శుక్రవారం తెలిపారు. వంశీబాబు కారును సీజ్ చేశారు. వంశీకి వీర్రాజు పీఏ కాగా, వంశీబాబు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కాగా, కిడ్నాప్ కేసులో వల్లభనేని వంశీ పాత్రపై అన్ని ఆధారాలు ఉన్నాయని విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. టెక్నాలజీ సర్వైలెన్స్ నుంచి ఎవరూ తప్పించుకోలేరని, ఈ కేసులో మిగిలిన నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు.



వైసీపీ దాడిలో ధ్వంసమైన గన్నవరం టీడీపీ కార్యాలయంలో వస్తువులు (ఫైల్)

### ఈ రోజు వంశీ.. రేపు కొడాలి నాని

- తప్పు చేసిన వాళ్లెవరైనా జైలుకెళ్లాల్సిందే: ఎమ్మెల్యే చింతమనేని
- సైకో కోసం తాపత్రయపడిన వల్లభనేని జైలుకెళ్లాడు: కేఎస్ జవహర్



అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'తప్పు చేసినవారు ఎవరైనా జైలుకు వెళ్లాల్సిందే. ఈరోజు వల్లభనేని వంశీ, రేపు కొడాలి నాని. ఒకరి తర్వాత ఒకరు... అందరూ జైలుకు వెళతారు. చట్టం నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు' అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పేర్నినాని, అనంతబాబు వంటి వారిని ఇంకా జైలుకు పంపలేదని చాలామంది టీడీపీ అభిమానులు నిరుత్సాహంగా ఉన్నారు. అక్రమ కేసులు, కక్ష సాధింపులు, అవసరం అయితే ఎన్‌కౌంటర్లు చేయడాలు... అన్నీ వైసీపీకే సాధ్యం. మా పార్టీకి అలాంటి అలవాటు లేదు' అని చింతమనేని అన్నారు. మాజీ మంత్రి కేఎస్ జవహర్ మాట్లాడుతూ... 'తాడేపల్లి సైకో బాస్‌ను సంతృప్తిపర్చడానికి తాపత్రయపడిన వంశీ చివరికి జైలుపాలు కావల్సి వచ్చింది. వంశీలాంటివారిని బయటకు వదలకూడదు. జైల్లోనే ఉంచాలి. జగన్ రాష్ట్రాన్ని దోచుకుంటే వంశీ గన్నవరాన్ని దోచుకున్నాడు' అని విమర్శించారు.

### అంబటి, జగన్‌పై సెక్షన్ 306 పెట్టిస్తా

- కోడెల ఆత్మహత్యకు వారే కారణం: చింతమనేని



అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'కోడెల శివప్రసాద్ కుటుంబ సభ్యులతో మాట్లాడతాను. ఆయన చావుకు కారణమైన వారిపై 306 సెక్షన్ కింద కేసు నమోదు చేయించేవరకు ఊరుకోను' అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. 'కోడెలను ఆత్మహత్య చేసుకునేలా ప్రోత్సహించింది అంబటి రాంబాబు, జగన్‌లే. వారిపై సెక్షన్ 306కింద కేసు పెట్టాల్సిందే. కోడెల ఫర్నీచర్ దొంగతనం చేశారని అక్రమ కేసు బనాయించారు. ఇప్పుడు ఎంత విలువైన ఫర్నీచర్ కావాలో చెబితే ఇస్తా. కోడెల ప్రాణాలను తిరిగి తీసుకురాగలరా?' అని ప్రశ్నించారు. 'అబ్బయ్య చౌదరి కారు డ్రైవర్‌ను బూతులు తిట్టానని అంబటి రాంబాబు తెగ బాధపడుతున్నారు. అసలు జరిగింది ఏమిటో ఆయన తెలుసుకోవాలి. నా కారుకు, తన కారు అడ్డం పెట్టడంతో ప్రశ్నించా. అది తప్పా? అబ్బయ్య తిడితే తలవంచుకుని వెళ్లాలా? అబ్బయ్య చౌదరి పేరుకే సాఫ్ట్‌వేర్. మనిషి మాత్రం హార్డ్‌వేర్. అలాంటి క్రిమినల్‌కి అంబటి వత్తాసు ఏమిటి? అంబటి పగటి పూట మాత్రమే రాంబాబు... రాత్రిపూట కాంబాబు' అని చింతమనేని విమర్శించారు.

### ఆ ట్వీట్ జగన్ నేర స్వభావాన్ని చాటుతోంది

- దళితులు, మహిళలంటే ఆయనకు చిన్నచూపు: మంత్రి నిమ్మల



అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'వంశీ లాంటి వ్యవస్థీకృత నేరగాడిని సమర్థిస్తూ జగన్ ట్వీట్ చేయడం ఆయన నేర స్వభావాన్ని చాటుతోంది. దళితులు, మహిళలంటే జగన్‌కు చిన్న చూపు. వారికన్నా వంశీలాంటి రౌడీలు జగన్‌కు ఎక్కువయ్యారా? తప్పుని తప్పని ఖండించకపోగా సమర్థించడం ఏమిటి?' అని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. 'దళిత బిడ్డను బెదిరించి సాక్ష్యాన్ని తారుమారు చేయడానికి వంశీ కుట్రపన్నారు. ఇంత బరితెగించిన వ్యక్తిని జగన్ ఎలా సమర్థిస్తారు? ఇకపై వైసీపీ నాటి అరాచకాలు పునరావృతం కానివ్వబోం' అని నిమ్మల స్పష్టం చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... 'రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని జగన్ అనడం హాస్యాస్పదం. టీడీపీ కార్యాలయంపై దాడులు చేసిన వారి విషయంలో చట్టప్రకారం నడుచుకుంటున్నాం. నేరగాళ్లను సమర్థించడం జగన్ నైజాన్ని బయటపెట్టింది. అధికారంలో ఉన్నా లేకున్నా దళితులను వైసీపీ వారు టార్గెట్ చేయడం దారుణం' అని పల్లా అన్నారు.

# తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు



- గత 6 నెలల్లో క్రైం రేటు 9% తగ్గింది
- యువతిపై యాసిడ్ ఘటన దురదృష్టకరం
- చిన్నారులు, మహిళల రక్షణకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటుకు కృషి: హోం మంత్రి అనిత

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'వల్లభనేని వంశీ అరెస్టు విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. వంశీ అరెస్టు ఆయన చేసిన కర్మ ఫలం. తప్పు చేసినవారికి ఎప్పటికైనా శిక్షపడుతుంది' అని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. "వంశీ అరెస్టు అక్రమం కాదు, సక్రమమే. అన్ని ఆధారాలూ ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలో డీజీపీని కలిసి వినతిపత్రాలు ఇస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మమ్మల్ని డీజీపీ ఆఫీస్ గేట్ కూడా దాటనీయలేదు. వైసీపీ నాయకులను అరెస్టు చేస్తే అక్రమం... మమ్మల్ని చేస్తే సక్రమమా? 'కీలక కేసుల్లో కూటమి ప్రభుత్వం నిర్లిప్తత' అన్న ఆరోపణలు సరికాదు. గత ప్రభుత్వ కక్షసాధింపు విధానాలు కూటమి ప్రభుత్వ వైఖరి కాదు. బాధితులకు అండగా ఉంటూ తప్పు చేసినవారు తప్పించుకోకుండా శిక్షపడేలా చేస్తాం. విజయనగరం జిల్లాలో 3 నుంచి 6నెలల కాలంలోనే రెండు కేసుల్లో పోక్సో చట్టం ప్రకారం శిక్షపడేలా చేశాం. పోలీస్, న్యాయ విభాగాలను సమన్వయం చేసి మరింత వేగంగా శిక్షలను అమలు చేస్తాం. గత ఆరు నెలల్లో రాష్ట్రంలో క్రైం రేటు 9శాతం తగ్గింది. నిందితులను పట్టుకొని, రిమాండ్‌కు పంపడంలో వేగం పెంచాం. టెక్నాలజీని వినియోగించి కేసులను ఛేదిస్తున్నాం. అన్నమయ్య జిల్లాలో యువతిపై యాసిడ్ దాడి ఘటన దురదృష్టకరం. బాధితురాలి తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి మాట్లాడి ధైర్యం చెప్పాం. యువతికి మెరుగైన చికిత్స కోసం బెంగుళూరు ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే మంత్రి నారా లోకేశ్ స్పందించారు. మరో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎట్టి పరిస్థితుల్లో నిందితుడిని వదిలిపెట్టం. కఠినంగా శిక్షిస్తాం. చిన్నారులు, యువతులు, మహిళల రక్షణ కోసం ప్రత్యేక కోర్టులు ఏర్పాటుకు కృషి చేస్తాం' అని అనిత అన్నారు.

### కేటాయింపుల్లో హోంకు పెద్ద పీట

కూటమి ప్రభుత్వంలో హోం శాఖకు కేటాయింపుల్లో పెద్దపీట వేయనుందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సచివాలయంలో ప్రీ బడ్జెట్ సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'గత ఐదేళ్లలో బడ్జెట్‌లో కేటాయింపులు లేక హోం శాఖ నిర్వీర్యం అయ్యింది. ఫింగర్ ప్రింట్ అథెంటికేషన్ సిస్టం, సీసీ కెమెరాల నిర్వహణకూ నిధుల్విలేదు. పోలీస్ స్టేషన్లు అధ్వానంగా తయారయ్యాయి. హోం శాఖ ప్రతిపాదనలు, అంచనాలపై గతంలో దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం శాంతిభద్రతలకు అవసరమైన నిధులు, వసతులు కేటాయిస్తుంది. ఈగల్ వ్యవస్థ, జైళ్ల నిర్మాణం, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఉంటుంది. ఆక్టోపస్, అప్పా, గ్రే హౌండ్స్ ఏర్పాటుకు బడ్జెట్‌లో పెద్దపీట వేయాలని కోరాం. కేంద్ర ప్రభుత్వ నిధులు రాబట్టి పోలీస్ శాఖను పటిష్ఠం చేయడంపైనా దృష్టి సారించాం. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గన్‌మ్యాన్ గన్ మ్యాగ్జైన్ మిస్ అవ్వడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. విచారణ చేసి చర్యలు తీసుకుంటాం' అని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

# చంద్రబాబూ... మీ తప్పులను ప్రజలు రికార్డు చేస్తున్నారు

- తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిస్తున్నా
- వంశీ అరెస్టును, అబ్బయ్యపై అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తున్నా: మాజీ సీఎం జగన్

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబూ... మీ తప్పులను ప్రజలే తమ డైరీల్లో రికార్డు చేసుకుంటున్నారు. తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిస్తున్నా' అని మాజీ సీఎం జగన్ హెచ్చరించారు. వంశీ అరెస్టు, అబ్బయ్య చౌదరిపై కేసు ఘటనలపై శుక్రవారం ఆయన స్పందించారు. 'చంద్రబాబూ... ప్రజలకు ఇచ్చిన సూపర్ 6 సహా మొత్తం 143 హామీలను నిలబెట్టుకోలేక, ఒక్కదాన్ని కూడా అమలు చేయక, అంతకుముందున్న పథకాలను సైతం రద్దుచేసి, ప్రజలను సంక్షోభంలోకి నెట్టారు. ప్రజల దృష్టి మళ్లించడానికి మా పార్టీకి చెందిన నాయకులను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు, తప్పుడు సాక్షులతో అక్రమ అరెస్టులకు దిగుతున్నారు. మాజీ ఎమ్మెల్యే వంశీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నా. వంశీ భద్రతకు ఎలాంటి సమస్య వచ్చినా ఈ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలి. టీడీపీ కార్యకర్తలు దళిత యువకుడి ఇంటికి వెళ్లి బెదిరించి, భయపెట్టం కరెక్టేనా? ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమేనా? కొఠారు అబ్బయ్య చౌదరిపై తప్పుడు కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. తప్పులు టీడీపీవారు చేస్తే అబ్బయ్య చౌదరిపై పోలీసులు కేసు పెడతారా? ఇది రాజ్యాంగానికి తూట్లు పొడవడం కాదా?' అని జగన్ ప్రశ్నించారు.

# అదానీకి అడ్డు లేదా?

- జగన్ పాలనలో మన్యంలో 3 హైడ్రో ప్రాజెక్టులు
- మొత్తం 2 వేల ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా చర్యలు కరువు

(రంపచోడవరం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం వచ్చాక జగన్ పాలనలోని అక్రమ నిర్ణయాలన్నీ రద్దు చేస్తారని అందరూ భావించారు. ఈ దిశగా కూటమి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. అయితే మన్యంలో గిరిజన చట్టాల ఉల్లంఘనతో మంజూరైన పవర్ ప్రాజెక్టుల విషయంలో చర్యలు కొరవడ్డాయి. గత ప్రభుత్వంలో మాదిరిగానే ఇప్పుడు కూడా గిరిజన చట్టాల ఉల్లంఘనను కొనసాగిస్తున్న అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జగన్ హయాంలోని పలువురు అధికారులే కూటమి ప్రభుత్వంలో కూడా అక్కడ కీలకంగా కొనసాగుతుండడమే ఇందుకు కారణమన్న విమర్శలు కూడా ఉన్నాయి. గత జగన్ పాలనలో గిరిజన చట్టాలను ఉల్లంఘించి మరీ మన్యంలో అదానీ పవర్ వంటి సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్టులను కట్టబెట్టారు. అప్పట్లో చట్టవిరుద్ధంగా భూములు కేటాయించడం తీవ్ర వివాదాస్పదమైంది. గిరిజన ప్రయోజనాల కోసం గతంలో బాక్సైట్ లీజులను రద్దు చేసిన చంద్రబాబు.. అలాగే మన్యంలో భూ కేటాయింపుల విషయంలోనూ గిరిజన చట్టాలను కాపాడాలని కోరుతున్నారు.

### 2022లో కేటాయింపులు

దేశవ్యాప్తంగా పునరుత్పాదక విద్యుదుత్పత్తి కోసం రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక విధానాలను రూపొందించి అనేక రాయితీలతో ఆయా సంస్థలకు ప్రాజెక్టులు కట్టబెడుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో 2022లో జగన్ సర్కార్ పలు సంస్థల కోసం ప్రత్యేక విధానాన్ని అమలులోకి తెచ్చింది. 14,680 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసి నిల్వ చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రాజెక్టులను వివిధ సంస్థలకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేటాయించింది. వీటిలో నాలుగు ప్రాజెక్టులు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం గిరిజన జిల్లాల్లోనే ఉన్నాయి. 1970 తర్వాత మన్యంలో ఒక్క అంగుళం భూమి కూడా గిరిజనేతరులకు బదలాయించేందుకు వీలులేని విధంగా చట్టాలు అమలులో ఉన్నాయి. అయితే జగన్ సర్కారు ఇక్కడ హైడ్రో ప్రాజెక్టులను, అందుకు అవసరమైన భూములను చట్టవిరుద్ధంగా గిరిజనేతర సంస్థలకు కేటాయించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రద్దు దిశగా చర్యలు లేకపోగా, గత ప్రభుత్వం మాదిరిగానే మన్యంలో మరో రెండు పవర్ ప్రాజెక్టులను గిరిజనేతర సంస్థలకు కట్టబెట్టే చర్యలు మొదలయ్యాయి.

### నాడు బాక్సైట్ లీజుల రద్దు

హైడ్రో పవర్ ప్రాజెక్టుల కేటాయింపు తరహాలో గతంలో బాక్సైట్ తవ్వకాల విషయంలోనూ ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయి. వ్యవహారం వివాదాస్పదంగా మారి సుప్రీం కోర్టు వరకు కేసు నడిచింది. సమతా కేసుగా ప్రాచుర్యం పొందిన ఆ కేసులో గిరిజన ప్రాంతాలలో స్థిరాస్తులను గిరిజనేతరులెవ్వరికీ కట్టబెట్టేందుకు వీల్లేదని, ప్రభుత్వాన్ని కూడా గిరిజనేతరునిగానే పరిగణించాలని సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. 2014కు ముందు బాక్సైట్ లీజులను అప్పటి ప్రభుత్వం ఇస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కారు ఆయా లీజులను రద్దు చేసింది. చంద్రబాబు స్ఫూర్తితో ప్రస్తుతం ఉన్న అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వంలోని చాలా మంది ఉన్నతాధికారులకు ఈ విషయాలు తెలిసినా.. ఇంకా గత ప్రభుత్వ పోకడలు వదిలించుకోలేక చట్టవిరుద్ధ నిర్ణయాలను కొనసాగిస్తున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా..

జగన్ ప్రభుత్వం అల్లూరి జిల్లాలోని కొయ్యూరు మండలం ఎర్రవరంలో 1200 మెగావాట్లతో, అనంతగిరి మండలం పెదకోటలో 1000 మెగావాట్లతో, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలోని కురుకుట్టిలో 1200 మెగావాట్లతో, కర్రివలసలో 1000 మెగావాట్లతో పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టులను కేటాయించింది. ఇందులో మూడు ప్రాజెక్టులను అదానీ పవర్ కంపెనీకి, ఒక ప్రాజెక్టును షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్‌కు కట్టబెట్టింది. ఈ ప్రాజెక్టుల కోసం మొత్తం సుమారు 2 వేల ఎకరాలకు పైగా భూమి కావాలి. వీటిలో 25 శాతం దాకా అటవీ భూములు ఉండగా, మిగిలినవి పట్టా భూములు, ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ భూములను విక్రయం ద్వారా గానీ, లీజు ద్వారా గానీ ఆ సంస్థలకు కట్టబెట్టే వివాదాస్పద నిర్ణయాలను గత ప్రభుత్వం తీసుకుంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఏ విధమైన ప్రాజెక్టులు చేపట్టాలన్నా ఆయా గ్రామసభల తీర్మానాలు, రాష్ట్ర గిరిజన సలహా మండలి ఆమోదం అవసరం. కానీ ఇవేమీ లేకుండానే గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను మంజూరు చేసింది. ఈ మేరకు భూ కేటాయింపులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టుల రద్దు దిశగా చర్యలు తీసుకోవడంలో గిరిజన సంక్షేమం, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

# తగ్గేదే లే!



వైట్ హౌస్‌లో ప్రధాని మోదీ కుర్చీలో నుంచి లేస్తుండగా ఆ కుర్చీని వెనక్కి జరుపుతున్న ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

మోదీకి ట్రంప్ 'అవర్ జర్నీ టుగెదర్' పేరిట.. తమ ఇద్దరి ఫొటోలతో కూడిన పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు. దానిపై "మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, యు ఆర్ గ్రేట్ (మీరు చాలా గొప్ప)" అని రాసి సంతకం పెట్టారు. ట్రంప్ మొదటిసారి అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మోదీ అక్కడ పర్యటించినప్పటి ఫొటోలు, ట్రంప్ భారత్‌కు వచ్చినప్పుడు ఇక్కడ మోదీతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఫొటోలూ అందులో ఉన్నాయి. కుశలప్రశ్నలు, పరస్పర పొగడ్తల అనంతరం.. ఇరువురు నేతలూ వాణిజ్యం, దౌత్యం, రక్షణ, ఇంధన భద్రత, హెచ్1బీ వీసాలు, వలస విధానం, కృత్రిమ మేధ, నవకల్పనలు, తదుపరి తరం టెక్నాలజీలు సహా పలు రంగాలకు సంబంధించిన కీలక అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. ఇరు దేశాల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న పలు అంతర్జాతీయ అంశాలు కూడా వారి భేటీలో ప్రస్తావనకు వచ్చాయి. అనంతరం వైట్‌హౌస్‌లోని ఈస్ట్ రూమ్‌లో నిర్వహించిన 44 నిమిషాల సంయుక్త పత్రికా సమావేశంలో ఇద్దరు నేతలూ మాట్లాడారు. భేటీలో తాము తీసుకున్న పలు నిర్ణయాల గురించి వెల్లడిస్తూ సంయుక్త ప్రకటన చేశారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య 500 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యంగా 'మిషన్ 500' ప్రకటించారు. 'యూఎస్-ఇండియా 123 పౌర అణు ఒప్పందం' అమలుకు కట్టుబడి ఉన్నామని ఇరువురు నేతలూ వెల్లడించారు. అమెరికా, ఇండియాల మధ్య అంతరిక్ష రంగంలో సహకారానికి సంబంధించి 2025 మార్గదర్శిగా నిలవబోతోందని.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తొలి భారతీయ వ్యోమగామిని పంపడానికి నాసా-ఇస్రో కలిసి పనిచేస్తాయని వెల్లడించారు. అంతరిక్ష పరిశోధనల్లో ఇరు దేశాలూ సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. డిఫెన్స్, ఏఐ, క్వాంటమ్, బయోటెక్నాలజీ, స్పేస్ తదితర రంగాలకు సంబంధించి కీలకమైన, అత్యంత అధునాతన పరిజ్ఞానాలపై కలిసి పని చేసేలా.. 'ట్రాన్స్‌ఫార్మింగ్ ద రిలేషన్‌షిప్ యుటిలైజింగ్ స్ట్రాటజిక్ టెక్నాలజీ (ట్రస్ట్)' అనే కార్యక్రమాన్ని ప్రకటించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రత సహకారాన్ని పెంపొందించుకోవాలనే నిర్ణయానికి వచ్చారు.

### ట్రంప్ అలా.. మోదీ ఇలా..

భారత్ అధిక సుంకాలు విధిస్తే తామూ విధిస్తామంటూ సంయుక్త పత్రికా సమావేశంలో ట్రంప్ కుండబద్దలు కొడితే.. అదే వేదికపై, ట్రంప్ సాక్షిగా.. అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను తిరిగి తీసుకోవడానికి భారత్ సిద్ధంగా ఉన్నదని మోదీ ప్రకటించారు. అమెరికాతో భారత్‌కు 50 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉందని.. దాన్ని పూడ్చడానికి భారత్ అమెరికా నుంచి మరింతగా చమురు, గ్యాస్, మిలటరీ హార్డ్‌వేర్‌ను కొనుగోలు చేస్తుందని ట్రంప్ తెలిపారు. ఈమేరకు ప్రధాని మోదీ, తాను ఒక ఒప్పందానికి వచ్చామని.. దీనివల్ల భారత్‌కు అమెరికా నంబర్ వన్ ఆయిల్, గ్యాస్ సరఫరాదారుగా నిలుస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. అమెరికాకు చెందిన కొన్ని ఉత్పత్తులపై సుంకాలను తగ్గించడంతోపాటు, అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను అనుమతిస్తూ న్యూఢిల్లీ ఇటీవల తీసుకున్న చర్యలను కొనియాడారు. ఇరు దేశాలూ రక్షణ భాగస్వామ్యాన్ని కూడా మరింత విస్తరించుకోవాలని నిర్ణయించినట్టు తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది నుంచి భారతదేశానికి రక్షణ ఉత్పత్తుల విక్రయాలను వందల కోట్ల డాలర్ల మేర పెంచుతామని.. అంతిమంగా ఎఫ్-35 స్టెల్త్ ఫైటర్లను కూడా విక్రయించేందుకు మార్గం సుగమం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే, మునుపెన్నడూ లేని విధంగా.. ప్రపంచవ్యాప్తంగా రాడికల్ ఇస్లామిక్ తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు భారత్, అమెరికా కలిసి పనిచేస్తాయని ట్రంప్ ప్రకటించారు. ప్రపంచంలోని అత్యంత దుష్టులలో ఒకడు.. 2008 నవంబరు 26న ముంబైపై జరిగిన దాడి సూత్రధారుల్లో కీలక వ్యక్తి అయిన తహవ్వుర్ రాణాను భారత్‌కు తక్షణమే అప్పగించనున్నట్టు ట్రంప్ వెల్లడించారు. "అతడు చట్టం ముందు నిలబడడానికి ఇండియాకు వెళ్తున్నాడు" అని పేర్కొన్నారు. అంతేనా.. భారత్ నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు త్వరలో మరికొంతమందిని కూడా అప్పగిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. ఇక.. పౌర-అణు ఇంధన రంగంలో కూడా ఇరు దేశాల మధ్య సానుకూల కదలిక వచ్చిందని.. అమెరికా అణు పరిజ్ఞానాన్ని భారత మార్కెట్లలోకి ఆహ్వానించేందుకు ఇండియా తన చట్టాలను సంస్కరిస్తోందని ప్రెసిడెంట్ ట్రంప్ పేర్కొన్నారు. భారత్-చైనా సంబంధాలపై విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు.. ఇరు దేశాల మధ్య సరిహద్దు సంఘర్షణలను తాను గమనిస్తున్నట్టు చెప్పారు. అయితే, ఆ ఘర్షణను ఆపడానికి తాను ఏమైనా సాయం చేయగలిగితే ఆనందంగా చేస్తానన్నారు. చైనా, భారత్, అమెరికా, రష్యా కలిసికట్టుగా ముందుకెళ్లాలన్నది తన కోరిక అని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారత్-మధ్యప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ గురించి ప్రశ్నించగా.. చరిత్రలోనే అత్యంత గొప్ప వాణిజ్య మార్గాల్లో ఒకదాన్ని నిర్మించడానికి కలిసి పనిచేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.



వైట్‌హౌస్‌లోని ఈస్ట్ రూమ్‌లో ఇరుదేశాల విలేకరుల సమావేశంలో ట్రంప్ భుజం తడుతున్న ప్రధాని మోదీ

### ట్రంప్ నుంచి నేర్చుకున్నది అదే..

ట్రంప్‌ను మరోసారి అమెరికా అధ్యక్షుడిగా శ్వేతసౌధంలో చూడడం ఆనందంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు జాతీయ (అమెరికా) ప్రయోజనాలే ముఖ్యమని, ఆయన్నుంచి తాను నేర్చుకున్నది అదేనని కొనియాడారు. ట్రంప్‌లాగానే తాను కూడా భారత దేశ ప్రయోజనాలనే అన్నింటికన్నా ముఖ్యంగా భావిస్తానని పేర్కొన్నారు. రక్షణ రంగానికి సంబంధించి రెండు దేశాలూ వచ్చే దశాబ్దకాలంపాటు పరస్పర సహకారంతో పనిచేస్తాయని.. ఇరు దేశాల మధ్య సహకార సంబంధాలు మరింత మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ తొలివిడత పాలన సమయంతో పోలిస్తే ఇప్పుడు రెట్టింపు వేగంతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని.. అంటే 500 బిలియన్ డాలర్లకు చేర్చాలన్న ఉమ్మడి లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు వెల్లడించారు. ఈమేరకు ఇరుదేశాలకూ ప్రయోజనకరంగా ఉండే ఒప్పందాన్ని రూపొందించేందుకు ఇరు దేశాల యంత్రాంగాలూ కృషి చేస్తాయని తెలిపారు. అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను వెనక్కి తీసుకోవడానికి అంగీకరిస్తున్నట్టు చెప్పారు. అయితే.. అలా అక్రమంగా ఉంటున్నవారంతా సాధారణ కుటుంబాలకు చెందినవారేనని, వారందరికీ ఎన్నో కలలు ఉంటాయని.. కొందరి మాటలు విని తప్పుదోవన అమెరికాకు వచ్చి ఉంటారని మోదీ వివరించారు. అలా మానవ అక్రమ రవాణాకు పాల్పడే వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని.. అందుకు ఇరు దేశాలూ కలిసి పనిచేయాలని అభిప్రాయపడ్డారు (అమెరికా ఇప్పటికే అలా 104 మంది అక్రమ వలసదారులను భారత్‌కు పంపిన సంగతి తెలిసిందే. అలా పంపిస్తున్నవారికి సంకెళ్లు వేసి పంపించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. త్వరలో మరికొందరు భారతీయులను రెండు విమానాల్లో పంపేందుకు అమెరికా సిద్ధమైంది. ఈ నేపథ్యంలో.. వారికి సంకెళ్లు వేసి పంపే విషయమై ట్రంప్-మోదీ మధ్య ఎలాంటి చర్చా జరిగినట్టు సమాచారం లేదు. సంయుక్త పత్రికా సమావేశంలో కూడా దీనిపై ఎవరూ ప్రశ్నించకపోవడం గమనార్హం). ఒక దేశంలో అక్రమంగా ప్రవేశించే వ్యక్తికి అక్కడ నివసించే హక్కు ఉండదని.. ఇది ప్రపంచంలో ఎవరికైనా వరిస్తుందని మోదీ స్పష్టం చేశారు. అలాగే.. తహవ్వుర్ రాణాను భారత్‌కు అప్పగించాలనే నిర్ణయం తీసుకున్నందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భారత కోర్టులు అతడికి తగిన శిక్ష విధిస్తాయని పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపే పరిష్కారమార్గాల దిశగా ట్రంప్ చేస్తున్న కృషికి తన మద్దతు ఉందని మోదీ పేర్కొన్నారు. "ఎందుకో.. ఈ యుద్ధం విషయంలో భారత్ తటస్థ వైఖరి అవలంబిస్తోందని ప్రపంచం అనుకుంటోంది. కానీ, వాస్తవానికి భారతదేశం ఈ యుద్ధం విషయంలో 'శాంతి' వైపు ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై తాను ఇరు దేశాల నేతలనూ కలిసి మాట్లాడినట్టు చెప్పారు. గతంలో తాను పుతిన్‌ను కలిసినప్పుడు.. ఇది యుద్ధాల యుగం కాదని, సమస్యలకు పరిష్కారాలను యుద్ధరంగంలో కనుగొనలేమని.. చర్చల ద్వారానే శాంతి సాధ్యమని చెప్పినట్టు వెల్లడించారు. ఢిల్లీలో జరగనున్న క్వాడ్ నేతల సమావేశంలో ట్రంప్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి ఎదురుచూస్తున్నట్టు ప్రధాని మోదీ తెలిపారు. 2020లో ట్రంప్ భారత పర్యటనను భారతీయులు ఇప్పటికీ గుర్తుచేసుకుంటారని పేర్కొన్నారు. "మీరు మళ్లీ వస్తారని వారంతా ఎదురుచూస్తున్నారు. 140 కోట్ల మంది భారతీయుల తరఫున నేను విమ్మల్ని ఇండియాకు ఆహ్వానిస్తున్నా" అన్నారు. కాగా, ట్రంప్‌తో సమావేశానికి ముందు ప్రధాని మోదీ అమెరికా జాతీయ భద్రత సలహాదారు మైక్ వాల్ట్జ్, ఆ దేశ జాతీయ నిఘా సంస్థ డైరెక్టర్ తుల్సీ గబ్బార్డ్, టెక్ బిలియనీర్, స్పేస్ ఎక్స్ చీఫ్ ఈలన్ మస్క్, రిపబ్లికన్ లీడర్ వివేక్ రామస్వామితో విడివిడిగా భేటీ అయ్యారు. ఇక, ట్రంప్‌తో జరిగిన అద్భుతమైన సమావేశం.. ఇరు దేశాల మధ్య స్నేహానికి గణనీయమైన ఉరవడినిస్తుందని పేర్కొంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ట్రంప్‌తో భేటీ అనంతరం అమెరికా నుంచి భారత్‌కు ఆయన తిరిగొచ్చారు.

## అమెరికాలో మరో రెండు కాన్సులేట్లు

భారతదేశం త్వరలోనే అమెరికాలోని బోస్టన్, లాస్‌ఏంజెలెస్ నగరాల్లో రెండు దౌత్యకార్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఇరు దేశాల ప్రజల మధ్య బంధాలను ఈ కాన్సులేట్లు బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయ సమాజం రెండు దేశాలనూ కలిపే అత్యంత కీలకమైన బంధమని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే.. భారత్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ప్రారంభించాల్సిందిగా అమెరికన్ యూనివర్సిటీలను కోరినట్టు మోదీ తెలిపారు. కాగా, అమెరికాలో ఏర్పాటు చేయబోయే రెండు కాన్సులేట్ల గురించి గత ఏడాది సెప్టెంబరులో న్యూయార్క్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మోదీ ప్రకటించడం గమనార్హం.



ట్రంప్‌తో చర్చల సమయంలో ఆయన వెంట భారత విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్

## మీ ఇంగ్లిష్ యాస అర్థం కావడం లేదు

### భారతీయ విలేకర్ల ప్రశ్నలు దాటేసిన ట్రంప్

» అనువాదకులతో సాఫీగా సాగిన మోదీ ప్రసంగం



అవర్ జర్నీ టుగెదర్ పుస్తకంలో 'హౌడీ మోదీ' ఫొటోలను చూస్తున్న ట్రంప్, ప్రధాని మోదీ

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: ప్రధాని మోదీతో నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో భారతీయ విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ట్రంప్.. భాష అర్థం కావడం లేదంటూ సమాధానాలు దాటవేశారు. అమెరికా గడ్డ మీద భారత్‌కు వ్యతిరేకంగా గళమెత్తుతున్న వర్గాలను దేశంలో కొనసాగనిస్తారా? అని విలేకరి ప్రశ్నించారు. ఉగ్రవాది తహావుర్ రాణాను భారత్ పంపించాలన్న ట్రంప్ నిర్ణయాన్ని భారతీయులు స్వాగతిస్తారని కూడా విలేకరి చెప్పారు. కాస్త గట్టిగా మాట్లాడాలని ట్రంప్ సదరు విలేకరిని కోరారు. విలేకరి మరోసారి అదే ప్రశ్నను అడుగుతుండగా ట్రంప్ మధ్యలో కలుగజేసుకున్నారు. ఆయన చెప్పేది ఒక్క ముక్క అర్థం కావడం లేదన్నారు. విలేకరి యాస అర్థం చేసుకోవడం కాస్త కష్టంగా ఉందని చెప్పారు. ఖలిస్థానీ ఉగ్రవాదుల అణచివేతలో అమెరికా భారత్‌కు ఎలా సహకరించబోతోందో చెప్పాలని మరో విలేకరి అడిగారు. భారతదేశంలో వందకు పైగా కేసులను ఎదుర్కొంటున్న ఉగ్రవాది పన్నూన్‌ను దృష్టిలో పెట్టుకొని విలేకరి ఈ ప్రశ్న అడిగారు. బైడెన్ ప్రభుత్వంలో భారత నిఘా సంస్థలపై పలు ఆరోపణలు చేశారని, ఇప్పుడు తులసీ గబ్బార్డ్ నేతృత్వంలోని అమెరికా నిఘా విభాగం దీన్ని ఎలా చూస్తుందని అదే విలేకరి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకూ ట్రంప్ సమాధానం దాటేశారు. రాణాను అప్పగించడంపై ట్రంప్ స్పందిస్తూ, అత్యంత హింసాత్మక వ్యక్తిని తక్షణమే భారత్‌కు అప్పగిస్తున్నామని తెలిపారు. ఇంకా చాలా మంది ఉగ్రవాదులను దేశం నుంచి పంపించనున్నామని, ఈ మేరకు భారత్ నుంచి పలు విజ్ఞప్తులు వచ్చాయని వివరించారు. ట్రంప్ సమాధానాలు దాటవేసిన వ్యవహారంపై సోషల్ మీడియా సరదాగా స్పందించింది. ఉత్తర భారతీయ జర్నలిస్టు ఇంగ్లిష్ అర్థం కాక ట్రంప్ దుబాసీని పెట్టుకుంటే దక్షిణ భారతదేశంలో మూడో తరగతి పిల్లాడికి కూడా అర్థమయ్యే ట్రంప్ ఇంగ్లిష్ అర్థం కాక ప్రధాని మోదీ మరో దుబాసీని పెట్టుకున్నారని ఒక నెటిజన్ వ్యాఖ్యానించారు. విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీకి భాషా సమస్య ఎదురవలేదు. హిందీలో, ఇంగ్లిష్‌లో అనువాదం చేయడానికి ఆయన ఇద్దరు ట్రాన్స్‌లేటర్లను పక్కనే పెట్టుకోవడంతో ఇబ్బంది లేకుండా మాట్లాడారు.

## అదానీ అంశం వ్యక్తిగతం

» ట్రంప్‌తో చర్చించే విషయం కాదది: మోదీ

» మోదీ వ్యాఖ్యల్ని తప్పుబట్టిన రాహుల్

» అమెరికాలోనూ అదానీని రక్షిస్తున్నారని ఫైర్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14 : వ్యాపారవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదైన అవినీతి కేసు గురించి భారత్ ప్రధాని నరేంద్రమోదీని అక్కడ మీడియా ప్రశ్నించింది. అదానీ కేసు విషయం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చర్చించారా అని ప్రశ్నించగా, రెండు దేశాల అధినేతలు కలుసుకున్నప్పుడు వ్యక్తిగత అంశాలు చర్చకు రావని మోదీ సమాధానమిచ్చారు. "భారతదేశం ప్రజాస్వామ్యదేశం. విశ్వాన్నంతా కుటుంబంగా భావించే వసుదైక కుటుంబం అనే భావనే మా సంస్కృతికి, తాత్వికతకు, ఆలోచనలకు మూలం. ప్రతి భారతీయుడూ నా కుటుంబసభ్యుడే. ఇక వ్యక్తిగత విషయాలకు వస్తే, రెండు దేశాలకు చెందిన ఇద్దరు నాయకులు వ్యక్తిగత అంశాలపై చర్చించేందుకు కలుసుకోరు" అని మోదీ వివరించారు. మోదీ సమాధానం హిందీలో ఉండటంతో వ్యక్తిగత్ అనే మాటను వైట్‌హౌస్ అనువాదకుడు వ్యక్తిగతం అంటూ అనువదించారు. అయితే, హిందీలో ఈ మాటకు ప్రైవేటు, అంతర్గతం అనే అర్థాలు కూడా ఉన్నాయి. అంతకుముందు..ఇదే ప్రశ్న ట్రంప్‌ను అడగ్గా, ఆయన స్పందించలేదు. కాగా, మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. దేశంలోనే కాకుండా, అమెరికాలోనూ అదానీని మోదీ రక్షిస్తున్నారని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. "ఇక్కడ అడిగితే మోదీ మౌనంగా ఉంటారు. అక్కడ అడిగితే వ్యక్తిగత విషయం అంటూ దాటవేస్తున్నారు" అని 'ఎక్స్'లో హిందీలో రాహుల్ ట్వీట్ చేశారు. అదానీ అనే మాట వినగానే మోదీ ముఖం మాడిపోయిందని, పొంతన లేని విషయాలేవో మాట్లాడారని కాంగ్రెస్‌కు చెందిన మరో నేత జైరామ్ రమేశ్ విమర్శించారు. మరోవైపు, భాషతో సంబంధం లేకుండా చెప్పాలనుకున్న విషయాన్ని పార్లమెంటులో బలంగా ముందుపెట్టాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు రాహుల్ సూచించారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన కాంగ్రెస్ ఎంపీలతో సమావేశమయ్యారు. పార్లమెంటులో హిందీ లేక ఇంగ్లిష్‌లో మాట్లాడాలనే పట్టింపు అక్కర్లేదని, బాగా తెలిసిన భాషలోనే చర్చల్లో పాల్గొనవచ్చునని రాహుల్ సూచించారు. వచ్చే నెల 10 నుంచి మొదలయ్యే బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో ప్రతి సభ్యుడూ పాల్గొనాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

## ఉగ్రవాదంపై సంయుక్త ప్రకటన ఏకపక్షం

» అమెరికా-భారత్ ప్రకటనపై పాక్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: సీమాంతర ఉగ్రవాదంపై అమెరికా-భారత్ సంయుక్త ప్రకటన ఏకపక్షం అని పాకిస్థాన్ ఆరోపించింది. ద్వైపాక్షిక సంబంధాలు మూడో పక్షానికి హాని చేయకూడదని చైనా వ్యాఖ్యానించింది. ట్రంప్‌తో మోదీ భేటీ నేపథ్యంలో సంయుక్త ప్రకటన విడుదల చేశారు. గతంలో ఒప్పందం మేరకు తమ భూభాగం సీమాంతర ఉగ్రదాడులకు వేదిక కాకుండా చూసుకోవాలని ఆ ప్రకటనలో పాక్‌కు సూచించారు. దీనిపై పాక్ విదేశీ వ్యవహారాల ప్రతినిధి షఫ్‌ఖత్ ఆలీ ఖాన్ వెంటనే స్పందించారు. ఇది ఏకపక్షమని, తప్పుదారి పట్టించారని, దౌత్య నిబంధనలను విరుద్ధమంటూ విమర్శించారు. తమ త్యాగాలను గుర్తించకుండా ఇలాంటి ప్రకటనలు చేయడం ఆశ్చర్యానికి గురిచేసిందని ఆక్రోశం వెళ్లగక్కారు.

### త్వరలోనే ఐఎస్‌ఎస్‌కు 'నిసార్'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: నాసా, ఇస్రో ఉమ్మడిగా రూపొందించిన భూపరిశీలన ఉపగ్రహం నిసార్‌ను త్వరలోనే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్‌ఎస్)కి పంపుతామని మోదీ వెల్లడించారు. 'నిసార్ ఉపగ్రహం త్వరలో భారతీయ వాహక నౌక ద్వారా అంతరిక్షానికి చేరుతుంది' అని చెప్పారు. వాస్తవానికి దీనిని గత ఏడాదే ప్రయోగించాల్సి ఉండగా.. 12 మీటర్ల రిఫ్లెక్టర్ యాంటెనాలో లోపాల కారణంగా వాయిదా పడింది.

# పరస్పర పన్నుతో నష్టమే!

### అమెరికా-భారత్ వాణిజ్యంలో ఇప్పటి వరకూ భారత్‌దే పైచేయి

» ఎగుమతులు ఎక్కువ, దిగుమతులు తక్కువ

» అమెరికా కంటే మన సుంకాలు అధికం

» పరస్పర పన్నుతో పరిస్థితి మారే అవకాశం

» ఆటోమొబైల్స్, ఇంధనం, రక్షణ రంగాలపై తీవ్ర ప్రభావం!

(సెంట్రల్‌డెస్క్)







ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 50,000 కోట్ల డాలర్లకు పెంచాలని అమెరికా, భారత్ నిర్ణయించిన నేపథ్యంలో ఆ భారీ నిర్ణయం భారత్‌పై ఎటువంటి ప్రభావం చూపనుంది అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ నిర్ణయం అనుకూలమా? ప్రతికూలమా? అనే అంశంపై పలు విశ్లేషణలు వెలువడుతున్నాయి. అయితే, అసలు రెండు దేశాల మధ్య వాణిజ్యం ఏ స్థాయిలో ఉందో ముందు తెలుసుకోవటం అవసరం. 2023లో సరుకులు, సేవలకు సంబంధించి అమెరికా-భారత్ ద్వైపాక్షిక వాణిజ్యం 19,008 కోట్ల డాలర్లుగా నమోదైంది. దీంట్లో సరుకుల వాటా 12,389 కోట్ల డాలర్లు కాగా, సేవల వాటా 6,619 కోట్ల డాలర్లు. ఆ ఏడాది అమెరికాకు భారత్ నుంచి ఎగుమతి అయిన సరుకుల విలువ 8,377 కోట్ల డాలర్లు, దిగుమతుల విలువ 4,012 కోట్ల డాలర్లు. సేవల విషయానికొస్తే.. ఎగుమతుల విలువ 3,633 కోట్ల డాలర్లు. దిగుమతులు 2,986 కోట్ల డాలర్లు. సరుకులైనా, సేవలైనా భారత్ నుంచి అమెరికాకు ఎగుమతులే ఎక్కువగా ఉన్నాయి. దిగుమతులు తక్కువ. ఇది భారత్‌కు అనుకూలమైన పరిస్థితి. గత ఏడాది కూడా ఇదే పరిస్థితి పునరావృతమైంది. ఇరుదేశాల వాణిజ్యం 13,000 కోట్ల డాలర్లకు పెరగగా.. 4500 కోట్ల డాలర్ల మేర భారత్‌కే అనుకూలంగా వాణిజ్యలోటు (ట్రేడ్ గ్యాప్) ఉంది. అయితే, ప్రస్తుతం ఈ పరిస్థితి మారే సూచనలు కనిపిస్తున్నాయి. కారణం, ట్రంప్ ప్రకటించిన పరస్పర పన్నులే (రెసిప్రోకల్ ట్యాక్స్).

### మనం విధించే పన్నే అధికం

ప్రస్తుతం అమెరికా ఉత్పత్తులపై (దిగుమతుల మీద) భారత్ సగటున 9.5 శాతం పన్ను విధిస్తుంటే.. భారత్ ఉత్పత్తుల మీద అమెరికా సగటున 3 శాతమే విధిస్తోంది. అంటే, దాదాపు ఆరున్నర శాతం పన్ను భారత్ అధికంగా విధిస్తోంది. పరస్పర పన్ను విధానం అమలులోకి వస్తే.. ఇకపై ఈ రెండూ సమానం అవుతాయి. ఇది రెండు రకాలు.. భారత ఉత్పత్తుల మీద అమెరికా పన్ను భారం పెరగవచ్చు లేదా అమెరికా ఉత్పత్తుల మీద భారత్ సుంకాలు తగ్గవచ్చు. దీని ప్రభావం భారత్‌కు చెందిన ఆటోమొబైల్, టెక్స్‌టైల్ పరిశ్రమల మీద తీవ్రంగా ఉంటుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉదాహరణకు, అమెరికా ఆటోమొబైల్స్ మీద వాటి ఇంజిన్ సామర్థ్యం, విడిభాగాలా లేక పూర్తి వాహనమా అన్న ప్రాతిపదికల ఆధారంగా భారత్ 205 శాతం నుంచి 50 శాతం వరకూ పన్ను విధిస్తోంది. అమెరికాలో తయారయ్యే హార్లీ డేవిడ్సన్ బైకుల మీద భారత్ భారీస్థాయిలో పన్ను వేస్తోన్న అంశాన్ని ట్రంప్ గతంలో కూడా ఓసారి లేవనెత్తారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విదేశాల నుంచి దిగుమతి అయ్యే ప్రీమియం బైకుల మీద సుంకాలను కొంత తగ్గించారు. పరస్పర పన్ను విధానం అమలైతే అమెరికా వాహనరంగం దిగుమతుల మీద పన్నును భారత్ మరింత తగ్గించాల్సి ఉంటుంది. రక్షణ, ఇంధన రంగాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. మొత్తమ్మీద 30కిపైగా ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను తగ్గించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మోదీతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కూడా దీనికి అద్దం పడుతున్నాయి. 'రానున్న రోజుల్లో అమెరికా చమురు, సహజవాయువులను భారత్ మరింత అధికంగా దిగుమతి చేసుకునే విధంగా మేం ఒప్పందం కుదుర్చుకున్నాం. దీనివల్ల అమెరికా వాణిజ్యలోటు గణనీయంగా తగ్గుతుంది' అని పేర్కొన్నారు.

### అమెరికా సుంకాలు పెంచే అవకాశం

ప్రస్తుతం ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం, ట్రంప్ చెబుతున్న పరస్పర పన్నుల నేపథ్యంలో అమెరికా కూడా భారత ఉత్పత్తులపై సుంకాలను పెంచే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా భారత్ నుంచి తమ దేశానికి ఎగుమతి అయ్యే టెక్స్‌టైల్స్, ఔషధాలు, ముత్యాలు, ఆభరణాలు, స్టీలు, అల్యూమినియం ఉత్పత్తుల మీద అమెరికా సుంకాలు పెంచే అవకాశం ఉంది.

## మోదీ... మీరు గొప్ప వారు!

### ప్రధానికి 'అవర్ జర్నీ టుగెదర్' పుస్తకం ఇచ్చిన ట్రంప్

*వాషింగ్టన్, ఫిబ్రవరి 14: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలకు కూర్చునే ముందు.. స్వహస్తాలతో సంతకం చేసిన తన పుస్తకం 'అవర్ జర్నీ టుగెదర్' పుస్తకాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా 'మిస్టర్ ప్రైమ్‌మినిస్టర్! యువార్ గ్రేట్' అని దానిపై రాశారు. ఇది 320 పేజీల పుస్తకం. గతంలో అధ్యక్ష పదవిలో ఉన్నప్పటి జ్ఞాపకాలను ట్రంప్ అందులో పొందుపరిచారు. ఆన్‌లైన్‌లో ఈ పుస్తకం ఖరీదు రూ.6,000-6,873 వరకు ఉంది. 2019 సెప్టెంబరు 22న హ్యూస్టన్‌లో ఇద్దరు నేతలు పాల్గొన్న 'హౌడీ మోదీ', 2020 ఫిబ్రవరి 24, 25 తేదీల్లో అహ్మదాబాద్‌లో నిర్వహించిన 'నమస్తే ట్రంప్' కార్యక్రమాల తాలూకు ఫొటోలను కూడా ఇందులో ముద్రించారు. అలాగే మెక్సికోతో సరిహద్దులో గోడ నిర్మాణం, ఫెడరల్ జడ్జీల ధ్రువీకరణ, అంతరిక్ష బలగం ఏర్పాటు, ఉత్తర కొరియా, చైనా, రష్యా అధినేతలు కిమ్ జోంగ్-ఉన్, జీ జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్‌లతో అత్యున్నత స్థాయి సమావేశాల గురించీ అందులో వివరించారు. కాగా.. శుక్రవారం వైట్‌హౌస్‌లో మోదీని ఆలింగనం చేసుకున్న ట్రంప్.. ఆయన్ను ఇక్కడ మళ్లీ కలుస్తున్నందుకు ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు. అనంతరం జరిగిన ఉమ్మడి విలేకరుల సమావేశంలో.. 2020లో భారత్‌లో జరిపిన తన చరిత్రాత్మక పర్యటన సందర్భంగా తాజ్‌మహల్‌ను సందర్శించినప్పుడు తీసుకున్న చిరస్మరణీయ ఫొటోను కూడా ట్రంప్ ప్రధానికి అందించారు. తనకు, తన భార్య మెలానియాకు అప్పట్లో మోదీ ఇచ్చిన ఆతిథ్యాన్ని గుర్తు చేసుకున్నారు. తాను కూడా ఇప్పుడు ఆతిథ్యం ఇస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మోదీని ప్రత్యేక వ్యక్తిగా అభివర్ణించారు. తమ సుదీర్ఘ మైత్రిని, గతంలో జరిపిన భేటీలను కూడా ప్రస్తావించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో, ఎలాన్ మస్క్‌లను మోదీకి ట్రంప్ పరిచయం చేశారు.*

# ఎఫ్-35 డీల్ జరిగే పనేనా?

## మన రష్యన్ క్షిపణి వ్యవస్థ ఓ అడ్డంకి.. సొంత తయారీకే భారత్ మొగ్గు?

### ట్రంప్‌ది ప్రతిపాదన మాత్రమేనన్న భారత విదేశాంగ కార్యదర్శి

ఒక అత్యాధునిక ఆయుధాన్ని ఒక దేశం మరో దేశానికి అమ్మాలంటే? అది ఒక ప్రకటనతో అయ్యేది కాదు. మొదటి దేశం తన ఆయుధాన్ని అమ్మడానికి సిద్ధంగా ఉండాలి. రెండో దేశం దానిని కొనడానికి సిద్ధంగా ఉండాలి. అంతేకాదు... అంతర్జాతీయ పరిస్థితులు, టెక్నాలజీలో వచ్చే మార్పులు ఇవన్నీ అందుకు అనుకూలించాలి. ఎఫ్-35 యుద్ధ విమానాల్ని భారత్‌కు అమ్ముతామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ అది వాస్తవ రూపం దాల్చే విషయంలో ఎన్నో అనుమానాలు, అవాంతరాలు ఉన్నాయి. వాటన్నింటినీ పరిశీలిస్తే ఎఫ్-35 కొనుగోలు ఒప్పందం జరగడానికంటే జరగకపోవడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తుంది.



ఎఫ్-35ఎ ఎయిర్‌ఫోర్స్ వెర్షన్
ఎఫ్-35బి మెరీన్ వెర్షన్
ఎఫ్-35సి నేవీ వెర్షన్

#### అమెరికా అమ్ముతుందా?

శుక్రవారం ట్రంప్ చేసిన ప్రకటనలో భారత్‌కు ఎఫ్-35 విమానాల్ని అమ్ముతామని సూటిగా చెప్పలేదు. "అంతిమంగా ఎఫ్-35లను భారత్‌కు అమ్మడానికి మార్గం సుగమం చేస్తాం" అని మాత్రమే అన్నారు. ఇందులో చాలా అంతరార్థం ఉంది. ఎందుకంటే ఎఫ్-35 అయిదో తరం యుద్ధ విమానం. ఇందులోని స్టెల్త్ టెక్నాలజీ చాలా అత్యాధునికమైనది. రాడార్లకు దొరకకుండా ప్రయాణించగల ఈ విమానాల పరిజ్ఞానం శత్రు దేశాల చేతికి ఎట్టి పరిస్థితుల్లోనూ చేరకుండా అమెరికా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలూ తీసుకుంటుంది. దానిని ఎవరికి అమ్మాలనే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. ఎఫ్-35 యుద్ధ విమానాల తయారీలో అమెరికాదే ప్రధాన పాత్ర అయినప్పటికీ అందులో అనేక నాటో దేశాల భాగస్వామ్యం ఉంది. నాటో దేశమైన తుర్కియే కూడా ఒకప్పుడు ఎఫ్-35 ప్రాజెక్టులో భాగంగా ఉండేది. అయితే రష్యాకు చెందిన ఎస్-400 విమాన విధ్వంసక క్షిపణి వ్యవస్థను కొనడానికి తుర్కియే సిద్ధమవ్వడంతో తుర్కియేకు, అమెరికాకు మధ్య విభేదాలు తలెత్తాయి. ఎస్-400లను కొంటే ఎఫ్-35 ప్రాజెక్టు నుంచి మిమ్మల్ని సాగనంపుతామని అమెరికా హెచ్చరించింది, అయినా తుర్కియే అది లెక్క చేయకుండా రష్యా క్షిపణి వ్యవస్థ కొనుగోలుకే మొగ్గుచూపింది. దీంతో టర్కీని అమెరికా బహిష్కరించింది. ఎఫ్-35లు రాడార్లకు దొరకని స్టెల్త్ విమానాలే అయినప్పటికీ రాడార్లను కొన్ని విపరీతమైన ఫ్రీక్వెన్సీల్లో ఆపరేట్ చేసినప్పుడు వాటిని కనిపెట్టే అవకాశం ఉంది. ఒకే దేశం వద్ద ఎఫ్-35 విమానం, ఎస్-400 రాడార్లు ఉన్నప్పుడు ఏయే ఫ్రీక్వెన్సీల్లో దానిని కనిపెట్టవచ్చునే ప్రయోగాలు ఇబ్బడిముబ్బడిగా చేసే అవకాశాలు ఉంటాయి. తద్వారా ఎఫ్-35కు సంబంధించిన బలహీనతలేమిటనే సమాచారం బయటపడి, అది అంతిమంగా రష్యా చేతికి చేరే ప్రమాదం ఉంటుంది. (గతంలో యుగోస్లావియాలో ఒక రాడార్ ఆపరేటర్ ఇలాగే అనూహ్యమైన ఫ్రీక్వెన్సీల్లో రాడార్‌ను ఆపరేట్ చేసి ఎఫ్-117 అనే అమెరికన్ స్టెల్త్ విమానాన్ని కూల్చివేయగలిగాడు) అందువల్లనే టర్కీ విషయంలో అమెరికా అంత కఠినంగా వ్యవహరించింది. ఇప్పుడు భారత్ విషయంలో కూడా అమెరికా ఇదే ప్రశ్నను ఎదుర్కోబోతోంది. రష్యా నుంచి అయిదు ఎస్-400 క్షిపణి వ్యవస్థల్ని కొనడానికి భారత్ 2018లోనే ఒప్పందం కుదుర్చుకుంది. వీటిని కొనవద్దని అప్పట్లోనే అమెరికా చాలా ఒత్తిడి తెచ్చినా భారత్ పట్టించుకోకుండా రష్యాతో ఒప్పందం చేసుకుంది. మూడు రష్యన్ ఎస్-400 వ్యవస్థలు ఇప్పటికే భారత్‌కు అందాయి. మరో రెండు వ్యవస్థలు 2026లోగా డెలివరీ కానున్నాయి. ఈ పరిస్థితుల్లో భారత్‌కు ఎఫ్-35 విమానాల్ని అమెరికా ఎలా అమ్మగలదు? అనేది చాలా పెద్ద ప్రశ్న. భారత్ ఎస్-400 ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని, తన వద్ద ఇప్పటికే ఉన్న మూడు వ్యవస్థల్ని వేరే దేశానికి అమ్మేయాలని అమెరికా షరతు విధించే అవకాశాలు లేకపోలేదు. "ఎఫ్-35లను అంతిమంగా భారత్‌కు అమ్మడానికి మార్గం సుగమం చేస్తాం" అన్న ట్రంప్ మాటల్లో మతలబు ఇదే అయి ఉండవచ్చనే అనుమానాలు ఉన్నాయి. ఒకవేళ అమెరికా ఇలాంటి షరతు విధిస్తే భారత్ అందుకు అంగీకరిస్తుందా? రష్యాతో దీర్ఘకాలంగా ఎంతో బలమైన రక్షణ సంబంధాలు ఉన్న భారత్.. "మీ క్షిపణి వ్యవస్థలు మాకు వద్దు. మీతో ఒప్పందం రద్దు చేసుకుంటున్నాం" అని రష్యాకు తెగేసి చెప్పి అమెరికన్ విమానాల్ని కొంటుందా? అంటే అది జరిగే అవకాశాలు చాలా చాలా తక్కువేనని చెప్పవచ్చు.

#### భారత్ కొంటుందా?

ఒకవేళ అమెరికా ఎఫ్-35 యుద్ధ విమానాల్ని భారత్‌కు బేషరతుగా అమ్మడానికి సిద్ధపడినా భారత్ వాటిని కొనడానికి సిద్ధంగా ఉంటుందా? అనేది కూడా మరో పెద్ద ప్రశ్న. భారత్ ఇంతవరకూ ఎప్పుడూ ఎఫ్-35లను తమకు అమ్మాలని అమెరికాను కోరలేదు. అమెరికా కూడా వాటిని భారత్‌కు ఆఫర్ చేయలేదు. అయితే ఎఫ్-35 అభివృద్ధి ప్రాజెక్టులో భారత్ కూడా భాగస్వామి అయితే బాగుంటుందన్న ఆకాంక్షను మాత్రం అమెరికా ఒకటి, రెండుసార్లు వ్యక్తం చేసింది. కానీ భారత్ దానిపై ఎలాంటి ఆసక్తినీ చూపించలేదు. 126 మధ్యశ్రేణి యుద్ధ విమానాల్ని కొనుగోలు చేయాలని 2001లో భారత వాయుసేన ప్రతిపాదించింది. ఆ ప్రకారం కొన్నేళ్ల తర్వాత భారత ప్రభుత్వం వివిధ దేశాల నుంచి ఆఫర్లు కోరింది. భారత్ పిలుపునకు స్పందించి అమెరికా తమ ఎఫ్-16, ఎఫ్-18 విమానాల్ని భారత్‌కు అమ్మజూపింది తప్ప ఎఫ్-35ను ఆఫర్ చేయలేదు. (అప్పటికే ఎఫ్-35 విమానం అనేక ప్రయోగాలు పూర్తి చేసుకుని తయారీలో తుది దశకు చేరుకుంటోంది) 2012లో అంతిమంగా రాఫెల్ విమానాన్ని భారత్ ఎంచుకుంది. అయితే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మోదీ ఫ్రాన్స్ పర్యటనకు వెళ్లి రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందాన్ని 126 నుంచి కేవలం 36కు కుదించారు. ఆ తర్వాత 2018లో భారత వాయుసేన మరో 114 విదేశీ విమానాల కొనుగోలుకు ఆఫర్లు కోరింది. అమెరికా మళ్లీ దీనికి స్పందించి పాత ఎఫ్-16 (ఎఫ్-21 అని పేరు మార్చారు), ఎఫ్-18లతోపాటు ఎఫ్-15ఈఎక్స్ అనే మరో విమానాన్ని బరిలోకి దించింది తప్ప ఎఫ్-35ను మాత్రం భారత్‌కు అమ్మజూపలేదు. భారత్ కూడా మాకు ఎఫ్-35లు అమ్ముతారా అని అమెరికాను అడగలేదు. భారత వాయుసేన తన చరిత్రలో ఇంతవరకూ ఒక్క అమెరికన్ యుద్ధ విమానాన్ని కూడా కొనలేదు. హెలికాప్టర్లు, రవాణా విమానాలు మాత్రమే కొనుగోలు చేసింది. ఎందుకంటే... అమెరికా తన ఆయుధాలను నాటోయేతర దేశాలకు అమ్మేటప్పుడు చాలా ఆంక్షలు విధిస్తుంటుంది. అంతేకాకుండా తన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర దేశాలతో పంచుకోవడానికి ఎంతమాత్రం ఇష్టపడదు. అందువల్లనే భారత్ అమెరికా ఆయుధాల కొనుగోలు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంటుంది. ఒకవేళ అమెరికా భారత్‌కు ఎఫ్-35లను అమ్మజూపినా... అనేక సాంకేతికపరమైన ఆంక్షలు పెడుతుంది. వాటి వినియోగం విషయంలో కూడా షరతులు పెట్టే అవకాశం ఉంది. అందువల్ల అమెరికా ఇస్తామన్నా ఎఫ్-35ల కొనుగోలుకు భారత్ సిద్ధపడుతుందా అనేది అనుమానమే! అదీ రష్యాతో ఎస్-400 ఒప్పందాన్ని తెగతెంపులు చేసుకుని వీటిని కొనుగోలు చేస్తుందా అంటే మరీ అనుమానమే!! కానీ ట్రంప్ నేరుగా ఆఫర్ చేయడంతో ఈ విషయంలో కొంతమేర కదలిక ఏర్పడి ఒక స్థాయి వరకూ చర్చలు జరిగే అవకాశం మాత్రం ఉంది. ఆ చర్చలు ఫలప్రదమయ్యే స్థాయికి వెళితే మాత్రం అది నిజంగా అద్భుతమే. తాజాగా ట్రంప్ ప్రకటన తర్వాత భారత విదేశాంగ కార్యదర్శి మాట్లాడుతూ ట్రంప్‌ది ఒక ప్రతిపాదన మాత్రమేనని వ్యాఖ్యానించడం భారత వైఖరికి అద్దం పడుతోంది.

#### ఎఫ్-35 విశిష్టతలివీ...

అమెరికాకు చెందిన మూడు సాయుధ దళాలు ప్రధానంగా యుద్ధ విమానాలను ఉపయోగిస్తుంటాయి. ఒకటి వైమానిక దళం... ఇది నేలపై రన్‌వే నుంచి గాలిలోకి లేచే యుద్ధ విమానాల్ని ఉపయోగిస్తుంది. రెండోది మెరీన్స్.. ఈ దళం చిన్న చిన్న యుద్ధ నౌకల నుంచి హెలికాప్టర్ల మాదిరిగా పైకి ఎగిరే వెర్టికల్ టేకాఫ్ విమానాల్ని ఉపయోగిస్తుంది. మూడోది... నౌకాదళం... ఇది కాటాపల్ట్ (వంగలకర్ర వంటి పరికరం) సాయంతో విమాన వాహక యుద్ధ నౌకల నుంచి టేకాఫ్ అయ్యే విమానం. అయితే ఈ మూడు దళాలూ మూడు భిన్న రకాలైన యుద్ధ విమానాలను ఉపయోగిస్తుండేవి. మొత్తం మూడు దళాలకూ ఉపయోగపడేలా (కొన్ని చిన్న మార్పులతో) ఒకే విమానాన్ని రూపొందించాలన్న ప్రయత్నంలో తయారైనదే ఈ ఎఫ్-35! "మూడు దళాలకూ ఒకే విమానం" అనే కాన్సెప్టను అనుసరించి మొదట్లో దీనికి "జాయింట్ స్ట్రయిక్ ఫైటర్" అని పేరు పెట్టారు. దీని తయారీ కాంట్రాక్టు కోసం అమెరికాకు చెందిన బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు పోటీ పడగా చివరికి లాక్‌హీడ్ సంస్థ కాంట్రాక్టును దక్కించుకుంది. సింగిల్ ఇంజిన్‌తో నడిచే ఈ విమానం రాడార్లకు చిక్కని స్టెల్త్ టెక్నాలజీతో రూపొందింది. ఇందులో ఎయిర్‌ఫోర్స్ వెర్షన్‌కు ఎఫ్-35ఎ, మెరీన్ వెర్షన్‌కు ఎఫ్-35బీ, నేవీ వెర్షన్‌కు ఎఫ్-35సీ అని పేరు పెట్టారు. వీటిలో వాయుసేన వెర్షన్‌ను మాత్రమే భారత్ కొనే అవకాశం ఉంది. ఎందుకంటే నేవీ కోసం ఫ్రెంచి రాఫెల్ (ఎం) విమానాల కొనుగోలుకు భారత్ ఇప్పటికే దాదాపు ఒప్పందం కుదుర్చుకుంది. ఎఫ్-35 విమానం వివిధ సెన్సర్ల ద్వారా అందే సమాచారాన్ని కలిపి విశ్లేషించి పైలట్‌కు కచ్చితమైన సమాచారం, సూచనలు ఇవ్వడం.. అలాగే ఇతర విమానాలు, నేల మీద ఉండే రాడార్ల నుంచి సమాచారాన్ని సేకరించడం, వాటికి సమాచారం ఇవ్వడం (డేటా లింక్స్) ద్వారా గొప్ప నెట్‌వర్కింగ్ చేయగలదు. ఇతర ఆయుధ వ్యవస్థలన్నింటినీ శక్తిమంతంగా మార్చగలదు. తనతో నెట్‌వర్క్ అయిన ప్రతి ఆయుధమూ స్వీయ శక్తిసామర్థ్యాలకు మించి శత్రువుపై దాడి చేసేలా ఇది తోడ్పడగలదు.



సుఖోయ్ 57 స్టెల్త్ విమానం

#### భారత్ కొంటేే మంచిదే!

అమెరికా ఎఫ్-35లను భారత్‌కు అమ్ముతుందా, వారు అమ్మినా భారత్ కొంటుందా అనే ప్రశ్నలు ఎలా ఉన్నా వీటి కొనుగోలు భారత్‌కు మేలు చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే ఎఫ్-35 అనేది అయిదో తరం స్టెల్త్ విమానం. భారత్ అయిదో తరం విమాన టెక్నాలజీల్లో బాగా వెనుకబడి ఉందని, ఇది దేశ భద్రతకు అంత మంచిది కాదని పలువురు రక్షణ నిపుణులు ఇటీవల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల భారత వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ కూడా ఈ తరహాలో కొన్ని వ్యాఖ్యలు చేశారు. అయిదో తరం స్టెల్త్ విమానాల తయారీలో చైనా ముందుకు దూసుకువెళుతోంది. జే 20 అనే స్టెల్త్ విమానాలు ఇప్పటికే చైనా వాయుసేనలో పెద్దసంఖ్యలో సేవలు అందిస్తున్నాయి. జే 31 అనే మరో స్టెల్త్ విమానాన్ని కూడా చైనా అభివృద్ధి చేసింది. ఈ జే 31 విమానాల్ని తాము చైనా నుంచి కొనబోతున్నట్లు పాకిస్థాన్ ఇటీవల ప్రకటించింది. 2028 నుంచి ఈ విమానాలు పాక్‌కు అందనున్నాయి. అయితే భారత్ వద్ద ఒక్క అయిదో తరం స్టెల్త్ విమానం కూడా లేదు. మన వద్ద ఉన్న విమానాలన్నీ మూడో తరం, నాలుగో తరం, లేదా 4.5 జనరేషన్ విమానాలే. ఏవీ స్టెల్త్ విమానాలు కావు. భారత్ వద్ద ఉన్న అత్యాధునిక రాఫెల్ (ఫ్రెంచి) విమానంలో కూడా స్టెల్త్ పరిజ్ఞానం లేదు. స్టెల్త్‌కు ప్రత్యామ్నాయంగా అందులో "యాక్టివ్ కాన్సిలేషన్" అనే పరిజ్ఞానం ఉన్నట్లు చెబుతున్నా దాని పనితీరుపై రక్షణ నిపుణులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆమ్కా (ఏఎంసీఏ) పేరుతో అయిదో తరం స్టెల్త్ విమానం తయారీని భారత్ ప్రారంభించింది. అయితే దీని తయారీకి చాలా కాలం పట్టనుంది. మొదటి విమానం 2036 నాటికి వాయుసేనకు చేరవచ్చని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) అధికారులు చెబుతున్నారు. అయితే గతానుభవాల్ని బట్టి చూస్తే ఆ గడువు 2040 వరకూ పాకినా పాకవచ్చు. అంటే మరో 15 సంవత్సరాలపాటు చైనా నుంచి, పాకిస్థాన్ నుంచి స్టెల్త్ విమానాల ముప్పును ఎదుర్కొంటూ భారత్ అతి జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో అమెరికా నుంచి ఎఫ్-35లను భారత్ త్వరగా కొనుగోలు చేయగలిగితే ఆ ముప్పును దీటుగా ఎదుర్కొనే అవకాశం ఏర్పడుతుంది. మన వాయుసేనకు స్టెల్త్ విమానాలను నడపడంలో, నిర్వహించడంలో తగిన అనుభవం వస్తుంది. అలాగే స్టెల్త్ విమానాల అభివృద్ధి విషయంలో మన రక్షణ పరిశోధన సంస్థలకు మరింత అవగాహన కూడా ఏర్పడుతుంది. అయితే తన సొంత స్టెల్త్ విమానం ఆమ్కా అందుబాటులోకి వచ్చేవరకు ఒక స్టాప్ గ్యాప్ ఏర్పాటుగా మాత్రమే భారత్ ఎఫ్-35ల కొనుగోలుకు మొగ్గు చూపవచ్చు. అంటే చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే ఈ విమానాల్ని కొనాల్సి ఉంటుంది. కానీ ఈ విమానాల కొనుగోలు ఖర్చు కంటే వీటిని నిర్వహించడానికి అయ్యే ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. తక్కువ సంఖ్యలో విమానాల్ని కొంటే తలసరి నిర్వహణ వ్యయం తడిసి మోపెడవుతుంది. అందువల్ల తాత్కాలిక అవసరాల కోసం భారత్ వీటిని కొనే అవకాశాలు చాలా తక్కువనే చెప్పాలి.



ఎస్-400 విమాన విధ్వంసక క్షిపణి

#### హఠాత్తుగా అమెరికా ఆఫర్ ఎందుకొచ్చింది?

ఎఫ్-35 విమానాల్ని భారత్‌కు అమ్మడానికి ఇంతకాలం ఆసక్తి చూపని అమెరికా ఇప్పుడు అకస్మాత్తుగా ఆ ప్రతిపాదన ఎందుకు చేసిందనేది ఆసక్తికరం. ప్రపంచంలో ఏటా అత్యధికంగా ఆయుధాల్ని కొనుగోలు చేసే దేశం భారత్. అయితే ఇటీవల విదేశీ కొనుగోళ్లు తగ్గించి స్వదేశీ విమానాల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. కానీ అయిదో తరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ విషయంలో మన దేశం వెనకబడింది. ఆ లోటును పూడ్చుకోవడం కోసం విదేశాల నుంచి వాటి కొనుగోలుపై ప్రభుత్వం దృష్టి పెట్టబోతోందనే వార్తలు ఇటీవల వస్తున్నాయి. తాజాగా బెంగళూరులో జరిగిన ఏరో ఇండియా ప్రదర్శనలో ఎఫ్-35తోపాటు రష్యాకు చెందిన సుఖోయ్ 57 స్టెల్త్ విమానం కూడా పాల్గొంది. గతంలో సుఖోయ్ 57 విమానం అభివృద్ధి ప్రాజెక్టులో భారత్ కూడా రష్యాతో కలిసి భాగస్వామిగా ఉండేది. అయితే ఆ విమానానికి సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌తో పూర్తిగా పంచుకోవడానికి రష్యా ఇష్టపడకపోవడంతో భారత్ ఆ ప్రాజెక్టు నుంచి వైదొలగింది. ప్రస్తుతం వైదొలగినా తర్వాతి దశలో భారత్ తిరిగి అందులో పాలుపంచుకునే అవకాశం ఉన్నట్టు నాడు రక్షణ మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్ అప్పట్లో చెప్పారు. ఇటీవల ఏరో ఇండియా ప్రదర్శన నేపథ్యంలో భారత్ సుఖోయ్ 57 విమానాలను కొనబోతోందనే వార్తలు బాగా జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో భారత్ రష్యా వైపు వెళ్లకుండా తమ వైపు ఆకర్షించేందుకే ట్రంప్ ఈ ప్రకటన చేసి ఉండవచ్చనే అభిప్రాయం రక్షణ నిపుణుల్లో వ్యక్తమవుతోంది.

- రక్షణ ప్రత్యేక ప్రతినిధి, ఆంధ్రజ్యోతి

---

#### ముంబై ఉగ్ర దాడి కేసు నిందితుడు

## రాణా అప్పగింతకు అమెరికా ఓకే

» 26/11 ఉగ్రదాడి వెనక పాక్ నేతల పాత్రను వెలుగులోకి తెచ్చే అవకాశం!



న్యూఢిల్లీ/వాషింగ్టన్ డీసీ, ఫిబ్రవరి 14: ముంబై 26/11 ఉగ్ర దాడుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక సూత్రధారిగా దర్యాప్తు సంస్థలు పేర్కొంటున్న తహవుర్ హుస్సేన్ రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా అంగీకరించింది. రాణాను విచారిస్తే ముంబై దాడుల వెనక పాకిస్థాన్ నాటి ప్రభుత్వ పెద్దల హస్తంపైనా దర్యాప్తు అధికారులు ఆధారాలు సంపాదించే అవకాశం ఉంటుందని సమాచారం. దాడుల వెనక పాక్ పాత్రను కూడా బయటపెడతారని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. 2008 నవంబరు 26న 10 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సముద్ర మార్గంలో ముంబై చేరుకొని.. తాజ్‌మహల్, ఒబెరాయ్ హోటళ్లు, రైల్వే స్టేషన్, యూదుల సెంటర్‌పై విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో 166 మంది మరణించగా.. వారిలో అమెరికన్లు, బ్రిటిషర్లు, ఇజ్రాయెలీలు కూడా ఉన్నారు. దాదాపు 60 గంటల పాటు జరిగిన భీకర దాడులతో యావత్ దేశమే వణికిపోయింది. ఒక దశలో భారత్.. పాకిస్థాన్‌పై యుద్ధానికి కూడా సన్నద్ధమైంది. ముంబైలో ఉగ్రవాదులు దాడులకు ఎంచుకున్న ప్రాంతాల్లో చాలా ముందుగానే డేవిడ్ కోల్మన్ హెడ్లీ రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. అతడికి పాకిస్థాన్‌కు చెందిన కెనడా దేశస్థుడు తహవుర్ రాణా సహకరించినట్లు గుర్తించారు. రాణ ట్రావెల్ ఏజెన్సీ నిర్వహిస్తున్న సమయంలో అతనికి హెడ్లీ పరిచయమయ్యాడు. ముంబైలో ఉగ్రవాదుల దాడులకు అవసరమైన బ్లూప్రింట్ తయారీలో రాణా హస్తం ఉంది. రాణా, హెడ్లీపై ఉగ్రదాడులు, కుట్ర కేసులు నమోదు చేశారు. రాణాకు పాక్‌కు చెందిన ఐఎస్ఐతోనూ సంబంధాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. 2008 నవంబరు 11న భారత్‌కు వచ్చిన రాణా.. 21వ తేదీ వరకు దేశంలోనే ఉన్నాడు. మధ్యలో రెండు రోజులు ముంబైలోని ఓ హోటల్‌లో బస చేసినట్లు దర్యాప్తు అధికారులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. రాణా, హెడ్లీ ఈ మెయిల్ ద్వారా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారని.. వాటిలో 26/11 దాడుల సమాచారం కూడా ఉందని వెల్లడించారు. 26/11 ముంబై ఉగ్రదాడులు జరిగిన ఏడాది తర్వాత.. 2009 అక్టోబరులో షికాగో ఎఫ్‌బీఐ అధికారులు రాణాను అదుపులోకి తీసుకున్నారు. అతను ప్రస్తుతం లాస్ ఏంజెలెస్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. రాణాకు పాక్ ఉగ్ర సంస్థలు లష్కరే తాయిబా, హర్కతుల్ జిహాదీ ఇస్లామీతో సంబంధాలు ఉన్నాయని, ముంబై దాడుల్లో అతని భాగస్వామ్యం ఉందని భారత్ ఆరోపించింది. రాణాను అప్పగించాలంటూ చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తోంది.

---

#### హెచ్-1బీ పునరుద్ధరణలో

## మరింత జాప్యం

» డ్రాప్‌బాక్స్ అర్హత 12 నెలలకు కుదింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: అమెరికా వీసాలను రెన్యూవల్ చేసుకోవాలనుకొనే భారతీయ దరఖాస్తుదారులకు సరికొత్త చిక్కులు ఎదురుకానున్నాయి. వీసా ఇంటర్వ్యూ మినహాయింపుల(డ్రాప్‌బాక్స్) అర్హతను అమెరికా విదేశాంగ శాఖ 48నెలల నుంచి ఒక్కసారిగా 12నెలలకు కుదించింది. తాజా నిబంధన ప్రకారం గత 12 నెలల్లో గడువు తీరిన వీసాలను మాత్రమే ఇంటర్వ్యూ లేకుండా రెన్యూవల్ చేసుకొనే అవకాశం ఉంటుంది. తక్షణమే అమలులోకి రానున్న ఈ మార్పుతో హెచ్-1బీ, బీ1/ బీ2 తదితర నాన్‌ఇమిగ్రెంట్ వీసాదారులపై తీవ్ర ప్రభావం పడనుంది. దీనికి సంబంధించి ఇంకా అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ వీసా దరఖాస్తు కేంద్రాలు(వీఏసీ) ఇప్పటికే కొత్త నిబంధనలు అమలు చేయడం ప్రారంభించాయి. తాజా మార్పులతో భారత దరఖాస్తుదారులకు వీసా రెన్యూవల్ మరింత ఆలస్యం కానుంది. ఇప్పటికే ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా వంటి ప్రధాన నగరాల్లో వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ల కోసం దరఖాస్తుదారులు 400 రోజులకుపైగా నిరీక్షిస్తున్నారు. ఇప్పుడు వీసా గడువు తీరి ఏడాది దాటిన వారంతా మళ్లీ వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్న నిబంధనతో అమెరికా కాన్సులేట్లలో ఇంటర్వ్యూలకు డిమాండ్ పెరగడంతో పాటు వాటికోసం అభ్యర్థులు వేచి చూడాల్సిన సమయం కూడా పెరగనుంది.

---

## అక్రమ వలసదారులు ఇంటికే!

#### ట్రంప్ నిర్ణయానికి మోదీ మద్దతు

» 119 మందితో నేడు భారత్‌కు విమానం





అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను వారి స్వదేశాలకు పంపే విషయంలో ట్రంప్ తీసుకుంటున్న చర్యలకు ప్రధాని మోదీ మద్దతు పలికారు. చట్టవిరుద్ధంగా అమెరికాలో నివసిస్తున్న భారతీయులను స్వదేశానికి పంపిస్తే వెనక్కి తీసుకుంటామని ప్రకటించారు. దీంతో అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులంతా కాస్త ఆలస్యంగానైనా తిరిగి స్వదేశానికి తరలివచ్చే పరిస్థితి నెలకొంది. అమెరికాలో మొత్తం 1.4 కోట్ల మంది అక్రమ వలసదారులు ఉన్నట్టు అంచనా. ఇందులో సుమారు 7,25,000 మంది భారతీయులు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. గుజరాత్, పంజాబ్‌లోని కొందరు ఏజెంట్ల ద్వారా 2021-24 మధ్యలోనే దాదాపు 4,300 మంది భారతీయులు అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఇటీవల ప్రకటించింది. ఏదేమైనా అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 7,25,000 మంది భారతీయులంతా స్వదేశానికి తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. మరోపక్క, తమ దేశంలో 2.5 కోట్ల మంది అక్రమ వలసదారులు ఉన్నారని అంటున్న ట్రంప్ ప్రభుత్వం దాదాపు 14 లక్షల మందికి ఇప్పటికే డిపోర్టేషన్ నోటీసులు కూడా పంపింది. చాలా మందిని స్వదేశాలకు తరలించింది. ఇందులో భాగంగా ఇటీవల 104 మంది అక్రమ వలసదారులను భారత్‌కు తిరిగి పంపింది. 119 మంది అక్రమ వలసదారులతో శనివారం మరో విమానం అమృత్‌సర్‌కు చేరుకోనుండగా.. ఆదివారం మరికొంతమందితో ఇంకో విమానం కూడా రాబోతుంది. అమెరికా భారతీయ అక్రమ వలసదారులను వెనక్కి పంపడం కొత్తేమీ కాదు. 2024లో బైడెన్ ప్రభుత్వం 1529 మంది భారతీయులను తమ దేశం నుంచి వెనక్కి పంపింది.

#### మోదీ ప్రకటనతో ఏం అవుతుందంటే...

అక్రమ వలసదారుల అంశంలో ట్రంప్ చర్యలకు మోదీ మద్దతు పలకడంతో అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయుల గుర్తింపు, వారిని స్వదేశానికి పంపించే ప్రక్రియ వేగవంతం కానుంది. ఆయా వ్యక్తుల పౌరసత్వ నిర్ధారణకు భారత ప్రభుత్వం కూడా అమెరికాకు సహకరిస్తుంది. ఈ సహకారం వల్ల అమెరికా-భారత్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయి. అక్రమ వలసదారులను తిరిగి స్వదేశానికి రానివ్వడం వల్ల భారత ప్రభుత్వం కూడా ప్రతిపక్షాల నుంచి కొన్ని ఒత్తిడులు ఎదుర్కొనే అవకాశముంది.

---

## భారత్‌లో మీ క్యాంపస్‌లు తెరవండి

» అమెరికా వర్సిటీలకు మోదీ ఆహ్వానం



అమెరికా పర్యటన ముగించుకొని భారత్ చేరుకున్న మోదీ

వాషింగ్టన్, ఫిబ్రవరి 14: భారత్‌లో క్యాంపస్‌లను తెరవాలంటూ అమెరికాలోని విశ్వవిద్యాలయాలకు మోదీ ఆహ్వానం పలికారు. తద్వారా భారతీయ విద్యార్థులకు స్వదేశంలోనే నాణ్యమైన విద్యావకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. తమ విద్యాసంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి, విదేశీ విద్యను సులభతరం చేయడానికి, మనదేశంలో అమెరికా విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లను నెలకొల్పే అవకాశాలను పరిశీలించడానికి భారత్-అమెరికా దేశాలు అంగీకరించాయి. గురువారం వైట్‌హౌస్‌లో ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య జరిగిన సుదీర్ఘ చర్చల్లో భాగంగా విద్యార్థులు, పరిశోధకులు, ఉద్యోగుల రాకపోకల కారణంగా ఇరుదేశాలూ లబ్ధిపొందాయని గుర్తించారు. 'ఓపెన్ డోర్స్' నివేదిక ప్రకారం.. ఉన్నత విద్య కోసం అమెరికా వెళుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. 2023-24 విద్యాసంవత్సరంలో అమెరికాలో చదువుకుంటున్న భారతీయుల సంఖ్య 3,31,602. ఇది 2022-23 విద్యాసంవత్సరంతో పోల్చితే 23శాతం ఎక్కువ. ఆ సంవత్సరంలో ఈసంఖ్య 2,68,923 మాత్రమే! ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధాలకు ప్రాముఖ్యత ఉందనే విషయాన్ని నొక్కి చెబుతూ.. 3లక్షలకు పైగా భారతీయ విద్యార్థుల కారణంగా.. ప్రతి ఏడాది అమెరికా ఆర్థిక వ్యవస్థకు 8 బిలియన్ డాలర్ల మేర లబ్ధి కలుగుతోందని, ఫలితంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీస్థాయిలో ఉద్యోగాల కల్పనకు అవకాశం కలుగుతోందని ఇరుదేశాధినేతలు పేర్కొన్నారు.

---

## బంగ్లాదేశ్‌పై నిర్ణయం మోదీదే!

» అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: "బంగ్లాదేశ్‌పై నిర్ణయాన్ని మోదీకే వదిలేస్తున్నా..." ఇది ప్రధాని మోదీ అమెరికా పర్యటన ముగింపు సందర్భంగా... శుక్రవారం ఏర్పాటు చేసిన సంయుక్త విలేకరుల సమావేశంలో బంగ్లాదేశ్ విషయమై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందన. మరోవైపు బంగ్లాదేశ్‌లో గత ఏడాది షేక్ హసీనా పాలనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలను అదుపు చేసే క్రమంలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందంటూ ఐక్యరాజ్య సమితి(యూఎన్) ఇటీవల ఒక నివేదిక విడుదల చేసింది. దీంతో ఆ దేశ రాజకీయం వేడెక్కింది. బంగ్లాదేశ్ ప్రతిపక్ష పార్టీ బీఎన్‌పీ.. హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించాలని భారత్‌ను కోరింది. హసీనా సామూహిక హత్యలకు పాల్పడ్డారని, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామిక వ్యవస్థలను నాశనం చేశారని యూఎన్ నివేదిక ఆరోపించిందని ఆ పార్టీ కీలక నేత చెప్పారు.

---

## మస్క్ పిల్లలకు 'పంచతంత్ర'!

#### అమూల్య బహుమతులిచ్చిన మోదీ



వాషింగ్టన్, ఫిబ్రవరి 14: ఎలాన్ మస్క్ సంతానానికి ప్రధాని మోదీ అమూల్యమైన బహుమతులను అందజేశారు. విష్ణుశర్మ నీతికథలు 'పంచతంత్ర' అందులో ప్రముఖమైనది. అలాగే రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన 'క్రిసెంట్ మూన్', ది గ్రేట్ ఆర్కే నారాయణన్ కలెక్షన్స్'లను కూడా అందించారు. గురువారం వాషింగ్టన్ డీసీలోని బ్లెయిర్‌హౌస్‌లో మస్క్ తన భాగస్వామి షివోన్ జిలిస్, ముగ్గురు పిల్లలతో తనను కలిసినప్పుడు.. తానిచ్చిన పుస్తకాలను ఆ పిల్లలు చదువుతున్నప్పటి ఫొటోలను మోదీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. మస్క్‌తో అంతరిక్షం, మొబిలిటీ, టెక్నాలజీ, ఆవిష్కరణలపై తాను చర్చించానన్నారు. 'కనిష్ఠ ప్రభుత్వం.. గరిష్ఠ పాలన' సూత్రాల ఆధారంగా దేశ పాలనకు కొత్త రూపు ఇచ్చేందుకు చేస్తున్న కృషిని వివరించినట్లు తెలిపారు. ఎలాన్ మస్క్ కూడా ప్రధాని మోదీకి అరుదైన బహుమతి ఇచ్చారు. తన స్పేస్‌ఎక్స్ రాకెట్ హీట్‌షీల్డ్ టైల్‌ను కానుకగా ఇచ్చారు. షడ్భుజాకారంలో ఉండే ఈ సెరామిక్ టైల్స్.. అంతరిక్షంలోకి వెళ్లిన రాకెట్ తిరిగి భూమి మీదకు వచ్చే క్రమంలో కీలకంగా మారతాయి. రాకెట్ తిరిగి భూవాతవరణంలోకి వచ్చే సమయంలో విపరీతమైన ఘర్షణ ఏర్పడుతుంది. ఆ సమయంలో దాని నుంచే పుట్టే వేడి నుంచి ఈ సిరామిక్ టైల్స్ దానిని రక్షిస్తాయి.



# ఈసారి సెగలే!

## మార్చి 15 తరువాత మరింత వేడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఈ వేసవిలో ఎండ తీవ్రంగా ఉంటుందని, ఉష్ణోగ్ర తలు గత రికార్డులను తిరగరాసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేడి సంవత్సరంగా గత ఏడాది నమోదైందని, ఈ ఏడాది కూడా ఉష్ణోగ్రతల్లో కొత్త రికార్డుల నమోదుకు అవకాశాలున్నాయని అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులే ఇందుకు కారణం. కార్బన్ డయాక్సైడ్, మిథైన్, భారీగా పెరుగుతున్న నీటి ఆవిరితో ఏర్పడే గ్రీన్‌హౌస్ వాయువులతో భూమి మండుతోంది. ఈ ఏడాది జనవరిలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయి. గత 124 సంవత్సరాల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదైన జాబితాలో జనవరి చేరింది. ప్రస్తుత ఫిబ్రవరిలో గడిచిన 13 రోజుల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ 13 రోజుల్లో 11 రోజులు దేశంలోనే అత్యధిక పగటి ఉష్ణోగ్రతలు మన రాష్ట్రంలోనే నమోదయ్యాయి. ఉత్తరాదిలో వెస్టర్న్ డిస్టబెన్స్ ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిశాయి. 13వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా 70 శాతం వర్షపాతం లోటు నమోదైంది. రానురాను ఎండ తీవ్రత పెరిగి, ఉష్ణోగ్రతల్లో కొత్త రికార్డులు నమోదవుతాయని, రాత్రి వాతావరణం వేడిగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం భూమధ్య రేఖకు ఆనుకుని ఉన్న పసిఫిక్ మహాసముద్రంలో లానినా కొనసాగుతోంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ వరకు లానినా కొనసాగుతుందని వాతావరణ శాఖ బులెటిన్‌లో పేర్కొంది.

### నైరుతిలో వర్షాలూ ఎక్కువే!

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల నేపథ్యంలో ఉష్ణోగ్రతలపై లానినా/ఎల్‌నినో/తటస్థ పరిస్థితులు ప్రస్తుతం ప్రభావం చూపే అవకాశం తక్కువేనని ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ విభాగం విశ్రాంత ఆచార్యుడు భానుకుమార్ చెప్పారు. భూమధ్యరేఖ సమీపాన లానినా కొనసాగితే వచ్చే నైరుతి రుతు పవనాలపై ప్రభావం ఉంటుందని, దీంతో మంచి వర్షాలు పడతాయన్నారు. గత 20 ఏళ్ల నుంచి వేసవిలో ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే రెండు మూడేళ్లు తప్ప మిగిలిన సంవత్సరాల్లో కొత్త రికార్డులు నమోదయ్యాయన్నారు. ఉత్తరాదిలో కొన్నిచోట్ల 50 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. వచ్చే నెల 15వ తేదీ తర్వాత ఎండలు బాగా పెరుగుతాయని, తద్వారా ప్రీమాన్‌సూన్ వర్షాలు సంభవిస్తాయన్నారు.



# ఇటు మంచు.. అటు ఎండ మంట




తెల్లవారుజామున మంచుదట్టంగా కురుస్తోంది. ఏలూరు నగర సమీపంలో ఉదయం 8 గంటలకూ మంచు కురుస్తుండటంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతూనే ప్రయాణం సాగించారు. మధ్యాహ్నం అయ్యేసరికి ఎండ మండిపోతోంది. నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థినులు 12 గంటల సమయంలో ఎండ తీవ్రతకు ఇలా గొడుగులు వేసుకుని వెళ్లారు.

### పగలు ఎండ, రాత్రి చలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగింది. శుక్రవారం కర్నూలులో 37.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అదే సమయంలో వాయువ్య భారతం నుంచి మధ్యభారతం మీదుగా పొడిగాలులు వీస్తుండడంతో రాత్రి పూట చలి పెరిగింది. శివారు, ఏజెన్సీ ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో ఎండ ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

# తులసిబాబుకు నో బెయిల్

» పిటిషన్ కొట్టేసిన హైకోర్టు



రిమ్స్‌లో వైద్యపరీక్షల అనంతరం తులసిబాబును గుంటూరుకు తరలిస్తున్న ఒంగోలు పోలీసులు

అమరావతి/ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన వ్యవహారంలో నిందితుడు తులసిబాబుకు హైకోర్టు షాక్ ఇచ్చింది. తులసిబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కొట్టేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ తులసిబాబు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల వాదనలు జరిగాయి. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. "రఘురామను చిత్రహింసలకు గురిచేసిన వ్యవహారంలో తులసిబాబు పాత్ర ఉందని నిర్ధారిస్తూ ఆయన స్నేహితులే వాంగ్మూలం ఇచ్చారు. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే సీఐడీ, పిటిషనర్‌కు ఉన్న సాన్నిహిత్యం తెలుస్తుంది. రఘురామను చిత్రహింసలకు గురిచేసిన వ్యవహారంలో పిటిషనర్ పాత్రపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి" అని న్యాయమూర్తిని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. తులసిబాబు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు. కాగా, తులసిబాబును కస్టడీలోకి తీసుకుని విచారించిన ఒంగోలు పోలీసులు శుక్రవారం తిరిగి గుంటూరు జైలులో అప్పగించారు. తులసిబాబును గురువారం ఉదయం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం ఒంగోలుకు తరలించారు. విచారణాధికారి, ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం రాత్రి వరకు ఆయనను విచారించారు. అనంతరం, తాలూకా పోలీసుస్టేషన్‌కు తరలించారు. శుక్రవారం ఉదయం ఒంగోలు రిమ్స్‌లోపరీక్షల అనంతరం గుంటూరు సీఐడీ కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి తిరిగి జైలుకు తరలించాలని ఆదేశించారు.



# పళని-తిరుమల

## రవాణా సదుపాయంపై దృష్టి పెడతా



» ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

» పళని, తిరుప్పరంకుండ్రం మురుగన్, మదురై మీనాక్షి ఆలయాల సందర్శన

చెన్నై, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 'పళని సుబ్రహ్మణ్య స్వామి క్షేత్రం నుంచి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు సులభంగా వచ్చేలా రవాణా సదుపాయం కల్పించడంపై దృష్టిపెడతాం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియజేసి, కేబినెట్ దృష్టికి తీసుకెళ్తా' అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. శుక్రవారం షష్ఠ షణ్ముఖ క్షేత్రాల్లో ఒక్కటైన పళని మురుగన్ ఆలయాన్ని సందర్శించుకున్న అనంతరం పవన్ మీడియాతో మాట్లాడారు. 'ఇటీవల మహారాష్ట్రలో పర్యటించినప్పుడు కూడా అక్కడి నుంచి తిరుపతి వచ్చేందుకు ప్రత్యేక రైలు వేయాలని అక్కడి ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరారు. దీనిపై ఇప్పటికే రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లా. అలాగే పళని-తిరుమల మధ్య రవాణాపై కూడా దృష్టిపెడతా. తమిళనాడులోని ఆరు ప్రసిద్ధ సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను దర్శించుకోవాలన్న తలంపుతో ఇక్కడికి వచ్చా. రాజకీయ అంశాలపై మాట్లాడేందుకు ఇది తగిన సమయం కాదు' అని పవన్ స్పష్టం చేశారు.

### భక్తి పారవశ్యంలో పవన్ కల్యాణ్



తిరుపరన్‌కుండ్రంలోని మురుగన్ శివ ఆలయంలో పవన్ కల్యాణ్, అకిర



మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలోకి వెళ్తున్న పవన్, అకిర

దండాయుధపాణిగా, పళనిస్వామిగా, మురుగన్‌గా పిలుచుకునే సుబ్రహ్మణస్వామి సేవలో తరించిన పవన్ భక్తిపారవశ్యంలో ఓలలాడారు. దక్షిణ భారత ఆలయాల సందర్శనలో భాగంగా బుధవారం కేరళ వెళ్లిన పవన్.. గురువారం తమిళనాడులోని తంజావూరు, కుంభకోణం, తిరుచ్చెందూర్ ఆలయాలను సందర్శించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆర్మూలిగు దండాయుధపాణి స్వామి వారి క్షేత్రంలో ఉచ్చకాల పూజలో పాల్గొన్నారు. రోప్ వే ద్వారా ఆలయానికి చేరుకున్న పవన్‌కు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. పళనిలోని అత్యంత ముఖ్యమైన పండుగగా పరిగణించే తాయ్-పూసం, తమిళ్ తాయ్ నెల (జనవరి 15 - ఫిబ్రవరి 15) పౌర్ణమి రోజున జరుపుకుంటారు. ఈ కీలకమైన పండుగ పౌర్ణమి రోజుల్లో మురుగన్‌ను దర్శించుకున్న పవన్.. ఆధ్యాత్మికానందంలో తేలియాడారు. ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పవన్‌కు ఆలయ పండితులు దైవిక మిశ్రమంగా పిలిచే తేనె, ఖర్జూరం, అరటిపండు, ఎండుద్రాక్ష, బెల్లం కలిపిన పంచమిర్దం అందించారు. అనంతరం పవన్ అదే ఆవరణలో వున్న శివాలయంలోనూ పూజలు నిర్వహించారు.

### తిరుప్పరంకుండ్రం మురుగన్ సేవలో...

శివుడు, విష్ణువు అభిముఖంగా శ్రీవల్లి దేవసేన సమేతంగా శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారు వెలసిన తిరుప్పరంకుండ్రం దివ్యక్షేత్రాన్ని కూడా పవన్‌కల్యాణ్ సందర్శించారు. శ్రీదుర్గా శక్తితో పాటు సోదరుడైన శ్రీసత్య గణపతి స్వామివారి చెంతనే ఈ క్షేత్రంలో వెలసిన సుబ్రహ్మణ్యుడు భక్తులను కటాక్షిస్తున్నారు. మదురై సమీపంలో వున్న ఆ ఆలయాన్ని పవన్.. శుక్రవారం సందర్శించుకున్నారు. అక్కడున్న శ్రీవల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి పవన్ మోకరిల్లి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, ద్రవిడ వారస ప్రతీకగా, దక్షిణ భారదేశంలోని అత్యంత అపురూపమైన దేవాలయంగా పరిగణించే మదురై మీనాక్షి ఆలయాన్నిపవన్ కల్యాణ్ దర్శించుకున్నారు. మీనాక్షి సోమ సుందరేశ్వరన్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులో భాగంగా అమ్మవారికి సారె, చీరను, పుష్పాలు, ఫలాలను సమర్పించారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన సమన్వయకర్తలు

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి జనసేన పార్టీ తరఫున పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా సమన్వయకర్తలను నియమించారు. తొమ్మిది నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించినట్లు ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్ తెలిపారు. కాకినాడకి తుమ్మల రామస్వామి, రాజమండ్రికి యర్నాగుల శ్రీనివాసరావు, అమలాపురంకి బండారు శ్రీనివాసరావు, నరసాపురంకి చన్నమల్ల చంద్రశేఖర్, ఏలూరుకి రెడ్డి అప్పలనాయుడు, విజయవాడకి వాసు, మచిలీపట్నంకి బండి రామకృష్ణ, గుంటూరుకి నయబ్‌కమల్, నరసరావుపేటకి మార్కండేయ బాబును నియమించారు.

# అగ్రిగోల్డ్ బినామీ ఆస్తుల గుర్తింపు!

» 4 రాష్ట్రాల్లో స్థిర, చరాస్తులు కంపెనీల్లో షేర్లు కూడా..

» వీటి విలువ రూ.వేల కోట్లపైనే!

» వాటి జప్తునకు హోం శాఖ ఉత్తర్వులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ సంస్థ యజమానులు.. బినామీల పేరుతో దాచుకున్న రూ.వేల కోట్ల విలువైన ఆస్తులను రాష్ట్ర సీఐడీ అధికారులు గుర్తించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో స్థిర, చరాస్తులు, కంపెనీల్లో షేర్లు ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశిస్తూ రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజీత్ శుక్రవారం రాత్రి జీవో 21 విడుదల చేశారు. దీంతో వీటిని కూడా జప్తు చేసేందుకు అనుమతి కోసం సీఐడీ అధికారులు కోర్టులో పిటిషన్ వేయనున్నారు. అగ్రి గోల్డ్ సంస్థపై 2015 జనవరిలో ఏలూరు జిల్లా పెదపాడు పోలీసు స్టేషన్‌లో మొట్టమొదటి కేసు నమోదైన సంగతి తెలిసిందే. పెదపాడు మండలం వడ్డిగూడేనికి చెందిన ఘంటసాల వెంకటేశ్వరమ్మ ఈ సంస్థలో రూ.20 వేలు డిపాజిట్ చేశారు. గడువు తీరిపోయాక 2014 అక్టోబరులో ఆమెకు రూ.40 వేలను చెల్లించాల్సి ఉంది. ఆమె మనవడు వెంకన్నబాబు డిపాజిట్ బాండ్‌ను తీసుకుని ఏలూరు అగ్రిగోల్డ్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ నగదు ఇవ్వకపోవడంతో 2015 జనవరిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలా అగ్రిగోల్డ్‌పై తొలి ఎఫ్ఐఆర్ నమోదైంది. తర్వాత ఏడు రాష్ట్రాల్లో ఆ సంస్థపై కేసులు దాఖలయ్యాయి. మొత్తం 40 లక్షల మంది బాధితుల నుంచి రూ.వేల కోట్లు డిపాజిట్లుగా సేకరించారని ఫిర్యాదులు అందడంతో 2016లోనే ఆ సంస్థ చైర్మన్ అవ్వా వెంకట రామారావు సహా మొత్తం 25 మందిని సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లోని అగ్రిగోల్డ్ కేసులపై ఏలూరు జిల్లా కోర్టులోనే విచారణ సాగుతోంది. పెదపాడు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో అగ్రిగోల్డ్ ఆస్తుల జప్తునకు ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు ఇచ్చింది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, కర్నూలు, ప్రకాశం, కడప, చిత్తూరు, నెల్లూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మొత్తం 15 కేసులు నమోదయ్యాయి. అప్పట్లో ఈ కేసులకు సంబంధించి సీఐడీ పోలీసులు రూ.6 వేల కోట్ల విలువైన స్థిర, చరాస్తులను జప్తు చేశారు. ఇవికాకుండా పలువురు బినామీల పేర్లతో ఆస్తులు ఉన్నట్లు వచ్చిన సమాచారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టారు. 179 స్థిరాస్తులు (విశాఖపట్నం జిల్లా సౌభాగ్యపురం, గండిగుండంలోని 26 స్థిరాస్తులతో కలిపి), 16చరాస్తులు, 17కంపెనీల పేరిట షేర్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఖరీదైన వ్యాపార కాంప్లెక్స్‌లు, కమర్షియల్ సైట్లు, గ్రీన్ సిటీలు, వెంచర్స్ కూడా ఉన్నాయి.

# యూట్యూబ్ చూసి మర్డర్ స్కెచ్!

» ఒక్క దెబ్బతో ఎలా చంపొచ్చో తండ్రిపై ప్రయోగం.. ఆస్తి కోసం కన్న తండ్రి దారుణ హత్య

» ఎన్టీఆర్ జిల్లాలో సుపుత్రుడి ఘాతుకం

మైలవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఒక్క దెబ్బతో మనిషిని ఎలా చంపొచ్చే యూట్యూబ్ చూసి మర్డర్ స్కెచ్ వేశాడు. కన్నతండ్రిని కర్రతో తలపై కొట్టి చంపేశాడు. ఆ నేరాన్ని పొలం సరిహద్దు యజమానిపై నెట్టేశాడు. వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మైలవరం సీహెచ్‌సీలో ఉన్న తండ్రి మృతదేహానికి మూడు రోజుల పాటు పోస్టుమార్టం కాకుండా అడ్డుపడ్డాడు. అయితే, ఇంత చేసినా పోలీసుల కన్ను మాత్రం కప్పలేకపోయాడు. తాను వాడిన సెల్ ఫోన్ సిగ్నల్ అతడ్ని పట్టించేలా చేశాయి. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం మొర్సుమల్లి శివారు ములకలపెంట గ్రామంలో ఈ నెల 8న జరిగిన జరిగిన కడియం శ్రీనివాసరావు మర్డర్ మిస్టరీని పోలీసులు ఛేదించారు. నిందితుడు కడియం పుల్లారావును శుక్రవారం మైలవరం పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ ప్రసాదరావు మీడియా ముందు ఉంచి వివరాలు వెల్లడించారు. పుల్లారావు ఆన్‌లైన్ బెట్టింగులు, షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చేందుకు ఆస్తి అమ్మాలని తండ్రి కడియం శ్రీనివాసరావుపై ఒత్తిడి చేస్తున్నాడు. ఆయన ససేమిరా అనడంతో ఈ నెల 8న తండ్రి పొలంలో ఉండగా ఆయనను కర్రతో తల పగలగొట్టి హత్యచేశాడు. సరిహద్దు వివాదం ఉన్న చల్లా సుబ్బారావు, అతడి అనుచరుడే తన తండ్రిని హత్య చేశారని అందరినీ నమ్మించాడు. అయితే, పోలీసు దర్యాప్తులో సెల్ సిగ్నల్ ఆధారంగా పుల్లారావే నిందితుడిగా నిర్ధారించారు. మనిషి ఒక్క దెబ్బతో ఎలా చనిపోతారో తెలుసుకునేందుకు యూట్యూబ్‌లో పలు నేర కథనాలను చూసి, చివరికి తలపై కర్రతో కొట్టి చంపినట్లు విచారణలోతెలిపాడు. దీంతోఅతడిని అరెస్టుచేసి మైలవరం కోర్టుకు తరలించినట్లు సీఐ దాడి చంద్రశేఖర్ తెలిపారు.

# ఇంట్లోవాళ్లే చంపేశారు!!

» తల, మొండెం ఒక సంచిలో..కాళ్లూ, చేతులు మరో సంచిలో..కాలువలో గిరాటు

» కంభంలో యువకుడి దారుణ హత్య



మృతుడు శ్యాంప్రసాద్

కంభం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని ముక్కలుగా నరికి గోతాల్లో కట్టి పంట కాలువ పక్కన పడేసిన ఘటన ప్రకాశం జిల్లా కంభంలో ఆలస్యంగా వెలుగుచూసింది. కుటుంబ సభ్యులే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దీంతో పట్టణ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. కంభం పట్టణం మేదరవీధికి చెందిన కందం సుబ్బారావు, లక్ష్మీదేవి దంపతులకు నలుగురు కుమారులు. వీరిలో మూడో కుమారుడైన శ్యాంప్రసాద్(34)ఆటోడ్రైవర్‌గా ఉంటూ కూలి పనులూ చేస్తున్నాడు. అవివాహితుడు. సుబ్బారావు నాలుగేళ్ల క్రితమేమృతిచెందాడు. శ్యాంప్రసాద్‌కు మిగిలిన ముగ్గురు అన్నదమ్ములతో తరచూ ఘర్షణ జరిగేది. ఈ నేపథ్యంలోనే గురువారం తెల్లవారుజామున శ్యాంప్రసాద్ హత్య ఇంటిలోనే జరిగింది. అతడి శరీరాన్ని ముక్కలుగా నరికి తల, మొండెం ఒక ప్లాస్టిక్ సంచిలో కుక్కారు. కాళ్లు, చేతులు మరో సంచిలో ఉంచి గురువారం రాత్రి ఇంటి సమీపంలోని పంట కాలువ వద్ద పడేశారు. శుక్రవారం మధ్యాహ్నం తర్వాత హత్య విషయం బయటకు పొక్కింది. విషయం తెలుసుకున్న కంభం సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ నరసింహరావు సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చారు. మృతదేహం ఉన్న సంచులను పోలీసులు పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు వివరాలు రాబట్టి, వారే హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మద్యానికి బానిసైన శ్యాంప్రసాద్.. కుటుంబ సభ్యురాలైన ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఇంట్లోని వారే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం. అయితే, ఇంకా కేసుదర్యాప్తులో ఉందని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ నాగరాజు తెలిపారు.

# వణికిస్తున్న జీబీఎస్..!

» ఏడాది వ్యవధిలో జీజీహెచ్‌లో 115 కేసులు

» ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 17 జీబీఎస్ కేసులు



గుంటూరు జీజీహెచ్‌లో జీబీఎస్ రోగులను పరామర్శిస్తున్న ఎంటీ కృష్ణబాబు

గుంటూరు మెడికల్, విశాఖపట్నం, ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్).. మొన్నటి వరకూ మహారాష్ట్ర తెలంగాణల్లో కలకలం రేపిన ఈ అరుదైన నరాల వ్యాధి ఇప్పుడు ఏపీని కూడా వణికిస్తోంది. తాజాగా గుంటూరు, విశాఖపట్నంలో ఈ కేసులు వెలుగుచూడడం ఆందోళన కలిగిస్తోంది. పదేళ్ల కిందట గుంటూరు జీజీహెచ్‌లో ఏడాది మొత్తం మీద 10-15 జీబీఎస్ కేసులు నమోదయ్యేవి. అవి కూడా తీవ్ర రూపం దాల్చకుండానే తగ్గేవి. అయితే కొవిడ్ తర్వాత నుంచి వీటి ఉధృతి అనూహ్యంగా పెరిగింది. ముఖ్యంగా 2024 మార్చి నుంచి ఇప్పటివరకు.. ఏడాది వ్యవధిలో ఏకంగా 115 జీబీఎస్ కేసులు నమోదవడం ఇక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గతంలో ఈ జబ్బు బారిన పడిన రోగుల్లో 15 శాతం మందికి మాత్రమే ఇమ్యునోగ్లోబిలిన్ వంటి శక్తివంతమైన మందులు ఇవ్వాల్సి వచ్చేది. మిగిలిన 85 శాతం మంది సపోర్టివ్ థెరపీ, యాంటీ బయోటిక్ మందులతోనే కోలుకునే వారు. అయితే ఈ ఏడాదికాలంలో నమోదైన 115 కేసుల్లో తీవ్రత అధికంగా ఉండటంతో ఏకంగా 65 మందికి ఇమ్యునోగ్లోబిలిన్ మందులు వాడాల్సి వచ్చింది. ఇవి ఖరీదైనవి కావడంతో ఆరోగ్య శాఖపై ఆర్థిక భారం తప్పడం లేదు. ఏకంగా 50 శాతం మందికిపైగా రోగులకు ఐజీజీ ఇంజెక్షన్లు వినియోగించాల్సి వచ్చింది. రోగ లక్షణాలు కూడా విభిన్నంగా ఉంటున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. కాగా, జీబీఎస్ అంటువ్యాధి కాదని, కాబట్టి ప్రజలు ఆందోళన చెందవద్దని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు.

### విశాఖలో ఐదుగురికి..ఏలూరులో బాలికకు...

విశాఖపట్నంలోనూ జీబీఎస్ కలకలం రేపుతోంది. విశాఖలో గత నాలుగు రోజుల్లో ఐదు కేసులు బయటపడ్డాయి. ప్రస్తుతం బాధితులంతా కేజీహెచ్‌లోని జనరల్ మెడిసిన్ విభాగం పరిధిలోని ఎక్యూట్ మెడికల్‌కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు. అయితే, ఈ వ్యాధి పట్ల ఆందోళన వద్దని, కేజీహెచ్‌లో ఈ తరహా కేసులు నెలకు పది వరకు నమోదవుతుంటాయని న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ గోపి వెల్లడించారు. కాగా, ఏలూరు జిల్లా చింతలపూడి మండలం యర్రగుంటపల్లిలో ఐదేళ్ల బాలికకు జీబీఎస్ లక్షణాలు నిర్ధారణ అయ్యాయి.

### సాధారణ వ్యాధే.. ఆందోళన వద్దు: కృష్ణబాబు

గులియన్ బారే సిండ్రోమ్ సాధారణ వ్యాధని, దీని గురించి ప్రజలు ఆందోళన చెందవద్దని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పర్యటనలో ఉన్న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఎంటీ కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం శుక్రవారం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిని సందర్శించి ఏడుగురు జీబీఎస్ బాధితులను పరామర్శించారు. 'గుంటూరులో జీబీఎస్ కలకలం' పేరిట శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి ఆరోగ్య శాఖ స్పందించింది. శుక్రవారం ఉదయమే అధికారులు గుంటూరు ప్రభుత్వాస్పత్రి న్యూరాలజీ విభాగానికి వచ్చి చికిత్స పొందుతున్న జీబీఎస్ రోగులను పరామర్శించారు. వైద్య అధికారులతో చర్చించారు. అనంతరం కృష్ణబాబు మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17 మంది జీబీఎస్‌తో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఏడుగురిలో కోలా మెర్సీ (19), శ్రేష్ఠ (7) కోలుకోవడంతో డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. బి కమలమ్మ (40) వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారని, వి.ఆశీర్వాదం (50) ఐసీయూలో కోలుకుంటున్నారని తెలిపారు. షేక్ గోర్బాన్, వి.నాగవేణి (20), ఎస్‌కే రమీజా (44) జీబీఎస్‌కు చికిత్సలు పొందుతున్నారని ఎంటీ కృష్ణబాబు ప్రకటించారు. అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఇమ్యునో గ్లోబిలిన్ ఇంజెక్షన్లు అందుబాట్లో ఉంచాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారని తెలిపారు.

# మీకొక బాయ్‌ఫ్రెండ్ కావాలా..!

» బెంగళూరులో బాడుగకు బాయ్‌ఫ్రెండ్ కాన్సెప్ట్

» ప్రేమికుల రోజున సోషల్ మీడియాలో హాట్‌టాపిక్

బెంగళూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'బాయ్‌ఫ్రెండ్ కావాలా..? క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. కేవలం రూ.389 మాత్రమే..' అనే పోస్టర్ ప్రేమికుల రోజు సందర్భంగా బెంగళూరు అందరి దృష్టినీ ఆకర్షించింది. వాలెంటైన్స్ డే సందర్భంగా షాపింగ్ మాల్స్, బేకరీలు, పబ్‌లు, ఆన్‌లైన్ వ్యాపార సంస్థలు పలు ఆఫర్‌లు ప్రకటించాయి. తాజాగా బాయ్‌ఫ్రెండ్ కూడా బాడుగకు లభిస్తాడని పోస్టర్లు కనిపించడం నగరవాసులను ఆశ్చర్యానికి గురిచేశాయి. బెంగళూరు జయనగర్ నాలుగో బ్లాక్ సమీపంలో ఈ పోస్టర్లు వెలిశాయి. కన్నడ పోరాట నేత గురుదేవ్ నారాయణకుమార్ ఈ పోస్టర్‌ను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'బెంగళూరు సంస్కృతి ఎక్కడికి వెళుతోంది..' అని కోట్ చేయడం సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది.




# విజయవాడలో క్యాట్ సర్క్యూట్ బెంచ్

» 17న ప్రారంభించనున్న క్యాట్ చైర్మన్

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్) సర్క్యూట్ బెంచ్‌ను విజయవాడలో ఏర్పాటు చేశారు. క్యాట్ చైర్మన్ ఈ నెల 17న ఈ బెంచ్‌ను ప్రారంభిస్తారు. దేశవ్యాప్తంగా 19 బెంచ్‌లు, 21 సర్క్యూట్ బెంచ్‌లు ఉన్నాయి. ఢిల్లీలో ప్రిన్సిపల్ బెంచ్ ఉంటుంది. ఏపీలో సర్క్యూట్ బెంచ్ లేకపోవడం వల్ల ఢిల్లీలోని క్యాట్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇకపై రాష్ట్రంలోని ఉద్యోగులు, అఖిల భారత సర్వీసు అధికారులు తమ సర్వీసుపరమైన అంశాల్లో న్యాయం కోసం విజయవాడలోని సర్క్యూట్ బెంచ్‌ను ఆశ్రయించవచ్చు. సర్క్యూట్ బెంచ్‌కు రెగ్యులర్ జడ్జిలు ఉండరు. క్యాట్ ఉన్నతాధికారులు కేటాయించిన జడ్జిలు వచ్చి కొంతకాలం పాటు ఇక్కడ నమోదైన కేసుల విచారణ నిర్వహించి తిరిగి వెళ్లిపోతారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.